స్వర్గధామంలో - స్వర్ణకమలాలు

తారామతి - ప్రేమావతి

గోలకొండలో భారతీయ సంస్కృతి - సమైక్యత

డా॥ నటరాజ రామకృష్ణ

ఆంధ్రదేశంలోనే కాక భారతదేశమంతటా విరాజిల్లిన లాస్య నర్తనానికి తమ కళాతపస్సుతో పవిత్రతను చేకూర్చిన వారు అమర నర్తకీమణులు తారామతీ, ప్రేమావతులు. తమ విశాల హృదయంతో సాంస్కృతిక పరిరక్షణతో వివిధ మతాల, కులాల ప్రజలలో సోదర భావాన్ని పాదుకొల్పి తమ కోటలో దేవీ ఆలయాన్ని, మసీదును జంటగా నిర్మించి, నాలుగు వందల సంవత్సరాల క్రిందటనే నేడు మనం కోరుకొంటున్న మతసామరస్యాన్ని, జాతి సమైక్యతను గోలకొండ పాదుషాలు ఇభరాముడైన ఇబ్రహీం కుతుబ్‌షా, కులీ కుతుబ్‌షా, అబ్దుల్లా కుతుబ్‌షాలు పెంపొందించారు.

మహోన్నతమైన అబ్దుల్లా రాజ్య కాలంలో నుండిన ఉత్తమ కళాకారిణులు తారామతి, ప్రేమావతులు. గత నాలుగు వందల సంవత్సరాలు ఆంధ్రదేశ చరిత్రలో మరుగున పడ్డారు. ధన్యులైన ఈ యిరువురు కళాకారులను మళ్లా మనకు ఎరుక పరచాలన్న సదుద్దేశ్యంతో డాక్టర్ నటరాజ రామకృష్ణ గారు గత రెండు సంవత్సరాలుగా శ్రమించి పరిశోధించి ఈ చారిత్రక నవలికను మనకు అందజేశారు. వారికి మా ధన్యవాదాలు.

– ఆంధ్రనాట్యం ట్రస్టు



చదివితి సకల శాస్త్రములు
అందలి సారములెల్ల గ్రహించితి
అంత విజ్ఞాన నేత్రంబు విప్పిచూడ
తెలిసికొంటిని నాకేమి తెలియదనుచు

— నటరాజ రామకృష్ణ

21 మార్చి 1923 - 07 జూన్ 2011

సంగీత సరస్వతి ఆశీస్సులతో

కళాతపస్వినులు

తారామతి - ప్రేమావతుల

చరిత్రను

గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు

శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ద్వారా

నృత్యకళాలోకానికి సమర్పిస్తున్న

నా చిరుకానుక ఈ నవలిక



ఆంధ్రజాతి ఉన్నంత కాలం

ఈ కళాచరిత్రులు అమరులై ఉంటారు

- నటరాజ రామకృష్ణ



తారామతి గానమందిరం



ప్రేమావతి నృత్యమందిరం



అబ్దుల్లా కులీ కుతుబ్‌షా
సమాధి

ప్రక్కనే
తారామతి, ప్రేమావతి
సమాధులు





తారామతి, ప్రేమావతుల
నృత్యవేదిక



తారామతి, ప్రేమావతుల నృత్యవేదికపై పూజ చేస్తున్న
ఆంధ్రనాట్య కళాకారిణి శ్రీమతి సరిదె మాణిక్యమ్మ

'ఆంధ్రనాట్యం' యువ కళాకారిణులు

స్వర్గధామంలో - స్వర్ణ కమలాలు

తారామతి - ప్రేమావతి

గోలకొండలో భారతీయ సంస్కృతి - సమైక్యత

(1626 AD - 1672 AD)

డా॥ నటరాజ రామకృష్ణ

ఆంధ్రనాట్యం ట్రస్టు

చిక్కడపల్లి, హైదరాబాదు - 20

స్వర్గధామంలో స్వర్ణకమలాలు
డా. నటరాజ రామకృష్ణ

© హక్కులు రచయితవి

నవంబర్ 1998
ప్రతులు 1000
2వ ముద్రణ నవంబర్ 2004

వెల రూ. 100/-
$ 12/-

ఛాయా చిత్రాలు
ఆర్కియాలజీ శాఖ సౌజన్యం
శ్రీ వెంకట్, రవి
పేరిణి, విఠల్, పేరిణి శీను
కొడపర్తి భాస్కరు

ప్రతులకు: ఆంధ్రనాట్యం ట్రస్టు
1-1-230/2/7
చిక్కడపల్లి, హైదరాబాదు - 20
Phone: 27607508

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
బాంక్ స్ట్రీట్, హైదరాబాదు-1
ఫోను : 595 671

ముద్రణ: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
40-ఎపిహెచ్‌బి, విద్యానగర్,
హైదరాబాద్ - 500 044, ఫోన్ : 27618261, 27653348

పద్మశ్రీ



డా॥ నటరాజ రామకృష్ణ

చదివితి సకల శాస్త్రములు
అందలి సారములెల్ల గ్రహించితి
అంత విజ్ఞాన నేత్రంబు విప్పిచూడ
తెలిసికొంటిని నాకేమి తెలియదనుచు

- నటరాజ రామకృష్ణ

కృతజ్ఞతలు

స్వర్గధామంలో స్వర్ణకమలాలు – తారామతి ప్రేమావతుల గురించి నేను పరిశోధిస్తున్నప్పుడు వారికి సంబంధించిన ఒక చారిత్రక నవలను వ్రాయాలన్న బుద్ధి తొలుత పుట్టి శ్రీ బి.ఎస్. శాస్త్రిగారితో సంప్రదించాను. వారెంతో సంతోషించి, నన్ను ప్రోత్సహించడమే కాక ఈ రచనకు కావలసిన చారిత్రక విషయాలను నాకు తెలియజేశారు. తర్వాత ఈ నవలికను వారు చదివి వారి అమూల్యమైన అభిప్రాయాన్ని వ్రాసి ఇచ్చారు. వారికి నా కృతజ్ఞతలు.

నా పరిశోధనకు కావలసిన అనేక విషయాలను నాకు తెలియజేయడమే కాక అందుకు సంబంధించిన వర్ణచిత్రాలను, ఛాయా చిత్రాలను నాకు ఇచ్చిన ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్‌గా నుండిన శ్రీ ఎన్.ఆర్.వి. ప్రసాద్ గారికి, డాక్టర్ ఖయ్యాం గారికి, డాక్టర్ శివనాగిరెడ్డి గారికి నా ధన్యవాదాలు.

ఈ నవలిక రచనలోను, ముద్రణలోను నాతో సహకరించి, తమ ప్రశంసను తెలియజేసిన, సోదర సమానులు శ్రీ గిడుగు రామమూర్తి గారికి, ఈ నవలికపైని తమ ఉద్దీపన తెలిపిన రెవరెండ్ డాక్టర్ దాసుబాబు గారికి నా ధన్యవాదాలు.

ఈ నవలిక ప్రచురణలో నన్ను అన్ని విధాలా ప్రోత్సహించిన సోదరులు శ్రీ జి. సూర్యనారాయణ గారికి నా ధన్యవాదాలు.

ఈ నవలికకు అవసరమైన మరికొన్ని ఛాయా చిత్రాలను తీసి యిచ్చిన చిరంజీవులు ముదపాక వెంకటేశ్వరరావు. రవి; శిష్యులు పేరిణి శ్రీనివాసు, పేరిణి విఠల్, కొడపర్తి భాస్కర్‌కు, సుందరమైన శీర్షికను చిత్రించి ఇచ్చిన చిరంజీవి ఆనందరావుకు నా ఆశీస్సులు.

తారామతి ప్రేమావతుల ప్రథమ ఆంధ్రనాట్య, పేరిణి సంస్మరణ నృత్యోత్సవాలను రూపొందించుటలో నాతో సహకరించిన శిష్యులు చిరంజీవులు కళాకృష్ణ, నటరాజ పరమేశ్వర్, వెంకటేశ్వరరావు, ఎమ్. వేణుగోపాలు, శ్రీమతి టి. రాఘవకుమారి, జక్కా శ్రీకృష్ణ, టి. భీమన్న, బి. కుమార్, డి. ప్రకాష్, జి. రమేషులకు నా ఆశీస్సులు.

ఈ నవలికను ఆధారంగా చేసుకొని, స్వర్గధామంలో స్వర్ణకమలాలు – తారామతి ప్రేమావతుల నృత్య నాటికను రచించిన శ్రీ చల్లా రామఫణి శర్మ గారికి ధన్యవాదాలు.

చివరగా ఈ నవలికను చక్కగా మొదటిసారి ముద్రించిన సుందర్ ఎంటర్‌ప్రైజెస్ వారికి,

ఈ నవలికను రెండవసారి ముద్రించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ వారికి,

నా ధన్యవాదాలు

– నటరాజ రామకృష్ణ

N. R. V. Prasad, M.A.
Director

Phone: 234942
OFFICE OF THE DIRECTOR
ARCHAEOLOGY AND MUSEUMS
Govt. of A.P., Hyderabad.

Date 14-5-1997

Dear Sri Nataraja Ramakrishna garu,

True to your reputation as a committed scholar of patronizing music and dance, at your age to hear from you your proposal to revive the glory of the Sultans of Golconda with special reference to their religious patronage and also the role played by the dancers and musicians of the period, I am thankful for your interest to develop the monuments of Taramati and Premavati and revive their legendary role.

As part of the Janmabhoomi programme, I have attended to general cleaning and also sanctioned R. 50,000/- for attending to immediate conservation of the monument. In view of the extensive nature of both the monuments, there is great need that assistance of voluntary organizations is quite necessary to develop the monuments in a massive scale in a short span of one year. Since both the monuments are under the control of the Department of Archaeology & Museums, your proposal to adopt both the monuments and gear up public participation for landscaping and development of greenery in a befitting way is agreeable to this department.

I wish to convey my willingness to co-operate with you in all your endeavours and also invite you to appeal to the willing donors to come forward and adopt the monuments. There is a provision in the Ancient and Historical Monuments and Archaeological Sites and Remains Act of 1960 for entering into such an agreement with the donors for the adoption of any Archaeological monument.

I am hopeful that we way proceed further on hearing from you the details of the donors.

With regards,

Yours sincerely,

Sd/-

(N.R.V. Prasad)

GOVERNMENT OF ANDHRA PRADESH
EDUCATION (CE.I) DEPARTMENT

Letter No. 14659/CE. 1-1/97-2 Dated 11-8-1997

From

Sri Ch. R. K. G. Sarma,
Deputy Secretary to Government,
Education Department,
A.P. Secretariat,
Hyderabad.

To
Dr. Nataraja Ramakrishna,
H.No. 1-1-230/2/7,
Vivek Nagar,
Near Tanguturi Anjaiah Bhavan,
Hyderabad - 20.

Sir,

Sub: Certain repairs to the buildings of Gana Mandir, Nrutyamandir, Taramathi and Premavathi - Reg.

Ref: -- Nil --

- 0 -

I am directed to recall your discussion had with Principal Secretary (Higher Education) on 13-5-1997 in regard to certain repairs to the buildings of Gana Mandir/ Nrutyamandir etc., and surroundings.

2. In this connection I am to inform that the matter has been examined in consultation with the Director of Archaeology & Museums, Hyderabad and at present an amount of Rs. 1.00 Lakh has been sanctioned for replastering and flooring works of main Baradari and an amount of Rs. 5-00 lakhs have been estimated for the renovation of works to improve the surroundings of Taramathi Baradari for which necessary provision will be made for inclusion of works in the annual programme of Archaeology & Museums Department.

Yours faithfully,

Sd/-
for Deputy Secretary to Government

అభినందన

1997 జనవరి నాల్గవ తేది సాయం సంధ్యా సమయంలో డాక్టర్ నటరాజ రామకృష్ణగారు నాకు ఫోను చేసి, "శాస్త్రిగారూ! మీ కొరకు అతి ముఖ్యమైన విషయం తెలియజేస్తున్నాను. ఇప్పుడే గోల్కొండ కోట వద్ద గల తారామతి ప్రేమావతుల సంగీత నృత్య మందిరాలను సందర్శించి వచ్చాను. తమ కళల ద్వారా తెలుగు నేల నుండి ఒక నూతన సందేశాన్ని లోకాని కిచ్చిన ఆ కళాకారుల దివ్య మందిరాలు నేడు శిధిలావస్థలో ఉన్నాయి. వాటిని బాగు చేయించి, ప్రతి సంవత్సరం అక్కడ నృత్య గానోత్సవాలను జరిపించి, మరుగున పడియున్న ఆ కళా తపస్వినుల ఆదర్శ జీవిత చరిత్రలను లోకానికి చాటాలి. ఈ కార్యాన్ని నిర్వహించమని మనం ప్రభుత్వాన్ని కోరాలి. ఈ విషయాలలో మీ సహాయ సహకారాలను నేను కోరుతున్నాను" అని చెప్పిరి. ఆయన ఆలోచనకు నాకు ఆశ్చర్యముతో బాటు ఆనందము కలిగినది.

అరవై నాలుగు సంవత్సరముల వయస్సులో, ఆరోగ్యము అంతగా బాగులేని శరీర స్థితిలో వారికి ఈ సంకల్పము కలిగినందుకు నాకు ఆశ్చర్యము వేసినది. వారి సంకల్పము ఉన్నతమైన దయినందున నాకు ఆనందము కలిగినది.

మా యిద్దరిది నలుబది యేండ్ల పరిచయము. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన కొత్తలో కూచిపూడి నాట్య శాస్త్రీయతను రుజువు చేయుటకు ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యములో ఆయన ఒక సదస్సును నిర్వహించిన విషయమును నేను మరువ జాలను. అటు పిమ్మట, బౌద్ధుల కాలము నుండి ఆంధ్ర దేశము నందు బహుళ ప్రచారములో నుండి అతి ప్రాచీనమైన ఆదరణ లేక అంతరించి పోవుచుండిన ఆంధ్రుల లాస్యనర్తనమును పునఃప్రతిష్ఠ చేయుటకు ఆయన రాజమహేంద్రవరములో ఒక సదస్సును ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ తరపున నిర్వహించిరి. కాకతీయుల కాలము నాటి వీర పురుష నాట్యమైన పేరిణి శివతాండవమును రామప్ప ఆలయ శిల్పముల ఆధారముతో పునఃసృష్టి చేసిరి. మన నృత్యకళలకు ప్రాచీన రూపమైన చిందు భాగవతమును ఆరాధించుచున్న దళిత యక్షగాన కళాకారులను ఆంధ్రప్రదేశ్ నృత్య అకాడమీ అధ్యక్షులుగా ఆయన ప్రోత్సహించిరి.

పై విషయములన్నియు ఎంత కష్టసాధ్యమయినవో ఒక చారిత్రక పరిశోధకునిగా నాకు తెలియును. ప్రభుత్వము చేపట్టవలసిన కష్టతరమైన ప్రస్తుత కార్యమును వీరు తలపెట్టుట చాలా ఆశ్చర్యకరమైన విషయము. కార్యదీక్షకు వయస్సు అడ్డురాదని ఈయన రుజువు చేయుచున్నారు.

మేము ఫోనులో మాట్లాడుచుండిన సమయమందు ఆర్కియాలజీ శాఖకు చెందిన డాక్టర్ శివనాగిరెడ్డిగారు నా ప్రక్కనే యుండిరి. వారికి డాక్టర్ నటరాజు గారి సంకల్పము గురించి చెప్పి, వారితో మాట్లాడమని ఫోను ఇచ్చితిని. డాక్టర్ నటరాజు గారిని డాక్టర్ రెడ్డిగారు ప్రోత్సహించిరి.

ఆనాటి నుండి నాకు తరచుగా ఫోను చేయుచు గోల్కొండ చారిత్రక విషయములను, తారామతి ప్రేమావతుల గురించి నాతో డాక్టర్ నటరాజుగారు చర్చించుచూ వచ్చిరి. ఆర్కియాలజీ వారి కార్యాలయమునకు తరచుగా వెళ్ళి, దాని డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ గారిని, డాక్టర్ ఖయ్యాం గారిని స్వయముగా కలుసుకొని, తమకు కావలసిన చిత్ర పటములను డాక్టర్ నటరాజు గారు సేకరించుచూ వచ్చిరి. అబ్దుల్లా కుతుబ్ షా, తారామతి ప్రేమావతుల మందిరములను సమాధులను పలుసార్లు వారు సందర్శించిరి. తారామతి ప్రేమావతుల పేరిట వెలసిన పేటలను గూడ వారు చూచి వచ్చిరి. గోలకొండ చరిత్రను క్షుణ్ణముగా అధ్యయనము చేసిరి.

తారామతి ప్రేమావతుల మందిరముల వద్ద ప్రతి సంవత్సరము సంగీత నృత్యోత్సవములను జరిపించవలెనని కోరుచూ ప్రభుత్వ సాంస్కృతిక, పర్యాటక శాఖల వారికి విన్నపములు పంపిరి; ఆ శిథిల మందిరములను బాగు చేయించవలెనని ఆ శాఖలను కోరిరి. వీరి విన్నపములకు ప్రభుత్వము వారు స్పందించి, అందుకు తగిన కార్యకలాపములను చేపట్టిరి. ఇవి ఎంతయో సంతోషించతగ్గ విషయములు.

డాక్టర్ నటరాజు గారి దృష్టిలో తారామతి, ప్రేమావతులు కేవలము ఉన్నత కళాకారులే కారు. వారు కళాతపస్వినులు. వారు, అమరులై ఉండవలెనన్న సంకల్పముతో డాక్టర్ నటరాజు గారు ఈ చారిత్రక నవలికను రచించినారు.

ఈ కళాకారు లుభయులు పవిత్ర ఆశయములతో జీవించి, తరించిరి గనుకనే ప్రపంచము నందు మరి ఏ చక్రవర్తియు, ఏ కళాకారులకు ఇవ్వని గౌరవమును ఈ కళాకారుల కిచ్చి, వారి కొరకు ప్రత్యేక మందిరములను నిర్మించి, తన సమాధి ప్రక్కనే వారి సమాధులను అబ్దుల్లా పాదుషా ఏర్పరచినారు.

భారతదేశములో సాంస్కృతిక సమైక్యము, మత సామరస్యము నాలుగు వందల సంవత్సరముల క్రిందటనే ఈ విధముగా రూపొందినవని ఈ నవలిక తెలియజేయుచున్నది.

రాజులు, వారి రాణులు, వారి కళాకారుల గురించి గల నవలలో సాధారణముగా వారి శృంగార విషయములు, వారి ప్రేమ కలాపముల గురించి వర్ణింపబడుచుండును. కాని ఈ నవలికలో ఇరువురు కళాకారుల జీవితాశయములను తెలియజేయుచు, వారిరువురు వారి జన్మములను ఎట్లు సార్ధకము చేసికొనిరో డాక్టర్ నటరాజు గారు చాలా సున్నితముగా, ఉన్నతముగా వర్ణించి చెప్పినారు.

అబ్దుల్లా పాదుషా, ఆయన తల్లి మా సాహెబా హయాత్ బక్షీ బేగం, తారామతి ప్రేమావతులు. వారి తల్లి సిద్దేశ్వరీ సుగుణమతి పాత్రలను డాక్టర్ నటరాజు గారు బహు చక్కగా తీర్చిదిద్దినారు. రాజమాత హయత్ బక్షీబేగం తన కుమారుని ఒక ఆదర్శవంతుడైన ప్రజా పాలకునిగా ఈ నవలికలో తీర్చిదిద్దినది.

తారామతి ప్రేమావతుల మాతృమూర్తి సిద్ధేశ్వరి తన కుమార్తెలు తమ కళలను కేవలము ధనము కొరకు విక్రయించక లోక కల్యాణము కొరకు వినియోగించు విధముగా వారిని సుశిక్షితులను చేసినది. హయత్ బక్షీ బేగం, సిద్ధేశ్వరులు ఉత్తమోత్తములైన మాతృమూర్తులుగా ఈ నవలికలో డాక్టర్ నటరాజు గారు వర్ణించినారు.

తంజావూరు విజయ రాఘవ నాయకుని కళా పోషణ గురించి, గోలకొండ పాదుషా అబ్దుల్లా పోషించిన కళారీతుల గురించి డాక్టర్ నటరాజు గారు చాలా చక్కగా ఈ నవలికలో వర్ణించినారు. నాలుగు వందల సంవత్సరముల క్రితము గోలకొండలో అభివృద్ధి చెందిన సంగీత నృత్యకళల గురించి పరిశోధించు వారికి ఈ నవలిక దోహదకారి కాగలదు.

ప్రముఖ గోలకొండ ఆస్థాన వాగ్గేయకారుడుగా నుండిన తులసిమూర్తితో ప్రఖ్యాత వాగ్గేయకారుడు. పద రచయిత క్షేత్రయ్య పోటీపడిన విషయము ఈ నవలికలో గలదు. ఇట్టి విషయముల వలన ఆనాటి కళారీతులను పాఠకులు తెలుసుకొనవచ్చును.

ప్రేమావతి మరణము అబ్దుల్లా పాదుషాకు చాలా విషాదకరమైన సంఘటన. ఆమె యెడల ఆయనకు గల ప్రేమనే గాక గౌరవాభిమానములను డాక్టర్ నటరాజు చాలా అద్భుతముగా చిత్రించిరి. "తారామతీ! మీరిద్దరు ఆంధ్రదేశమున్నంత వరకు లక్ష్మీ సరస్వతుల్లాగ తారామతీ ప్రేమావతులుగా ఈ కళా ప్రపంచంలో చిరంజీవులై నిలిచి పోతారు. నీ పేరే ముందుంటుంది" అని ప్రేమావతి చనిపోయినప్పుడు అబ్దుల్లా తారామతిని ఓదార్చుతాడు. నిజముగా అట్లే నేడు జరుగుచున్నది. మన మందరము వారిరువురను తారామతి ప్రేమావతులుగానే స్మరించుచున్నాము.

"స్వామీ! గోలకొండకు మరల ప్రసాదించు అలనాటి సాంస్కృతిక స్వర్ణయుగము" అని దేవ దేవునికి విన్నవించుకొనుచూ డాక్టర్ నటరాజు గారు ఈ నవలికను ముగించినారు. వారి ఆశయము సిద్ధించవలెనని నేను కోరుకొనుచున్నాను. ఈ మహత్తర కార్యములో సహకరించే అవకాశము నాకు కలిగినందుకు నాకు ఆనందముగా నున్నది.

ప్రతి సంవత్సరము తారామతి ప్రేమావతుల దివ్య మందిరముల వద్ద నవంబర్ 21వ తేదీన సంగీత నృత్యోత్సవములను జరిపించుటకు మన ప్రభుత్వము సంకల్పించినదని విని నేను ఎంతో సంతోషించుచున్నాను.

ఈ నవలిక గురించి నా అభిప్రాయమును తెలియజేయు అవకాశమిచ్చినందుకు డాక్టర్ నటరాజు గారికి నా ధన్యవాదములు.

హైదరాబాద్ ఇట్లు

21-11-1998 బి. ఎన్. శాస్త్రి

ప్రశంస

నిత్య కృషీవలుడు, నృత్యకళా పరిశోధకుడు డాక్టర్ నటరాజ రామకృష్ణ. ఆంధ్ర దేశంలో నృత్యానికి మారు పేరు ఈ నటరాజు. ఈయన నిరంతర కృషి వల్లనే ఆంధ్రుల లాస్య వర్తనం – ఆంధ్ర నాట్యం – పునరుద్ధరింపబడింది. ఈయన పరిశోధన వల్లనే పేరిణి శివతాండవం పునః సృష్టింపబడింది. ఈయన దీక్షవల్లనే కూచిపూడి నాట్యం శాస్త్రీయ నృత్యంగా గుర్తింపు పొందింది. ఈయన ప్రచారం వల్లనే ఉన్నత కుటుంబాలకు చెందిన బాల బాలికలు నృత్యకళను అభ్యసిస్తున్నారు, ఆరాధిస్తున్నారు.

డాక్టర్ నటరాజ రామకృష్ణ సార్థకనాముడు. కారణ జన్ముడు. నలభై అయిదు సంవత్సరాల క్రిందట ఈయన ఆంధ్ర దేశంలో అడుగు పెట్టినందు వల్లనే మరుగున పడి యుండిన ఆంధ్రుల నృత్యకళకు దేశంలో పేరు ప్రతిష్ఠలు వచ్చాయి. ఆంధ్రుల జానపద నృత్యాలు మళ్ళా వెలుగు చూశాయి. నృత్యకళను నీచంగా పరిగణించిన పెద్దలు ఈయన ప్రచారం వల్లనే దానినొక ఉన్నతమైన కళగా మెచ్చుకొనడం ప్రారంభించారు. ఈయన ఊరూరా తిరిగి నృత్యకళపైన ప్రదర్శనా పూర్వక ఉపన్యాసాలు ఇవ్వడం వల్లనే ఈనాడు వేలాది మంది నృత్య కళాకారులు ఈ కళను ఆధారం చేసుకొని జీవిస్తున్నారు.

గత నలభై అయిదు సంవత్సరాలుగా డాక్టర్ నటరాజ రామకృష్ణ వివిధ పత్రికలలో అనేక వ్యాసాలు వ్రాస్తూ వస్తున్నారు. నృత్య కళపైని సుమారు 50 గ్రంథాలు ఈయన వ్రాశారు. ఇరవయ్యో శతాబ్దిలో వెలువడిన ఏకైక సంపూర్ణ నాట్యశాస్త్ర గ్రంథం ఈయన వ్రాసిన "దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర".

లోగడ కొన్ని కథలను నాట్యకళపైన ఈయన వ్రాశారు. నేడు ఈ "స్వర్గధామంలో స్వర్ణకమలాలు – తారామతి ప్రేమావతి" అనే ఈ చక్కని నవలికను వ్రాశారు.

గోలకొండ దుర్గం చెంతను గల రెండు శిథిల మందిరాలు ఈ మధ్య ఈయన్ను ఆకర్షించాయి. వెల్లకు కూడా నోచుకోని ఈ రెండు ప్రాచీన మందిరాలు ఈయనకు దివ్య మందిరాలుగా గోచరించాయి. అవి తారామతి గాన మందిరం, ప్రేమావతి నృత్య మందిరం. వాటిని ప్రత్యేకంగా ఇద్దరు కళాకారుల కోసం అబ్దుల్లా కుతుబ్ షా నిర్మించారు. "ఆయన ఆస్థానంలో ఇరవై వేల మందికి పైగా సంగీత నృత్య కళాకారులుండినా వీరిద్దరి కోసమే ఈ దివ్య మందిరాలను ఎందుకు నిర్మించారు?" అన్న జిజ్ఞాసతో డాక్టర్ నటరాజ రామకృష్ణ గారు అన్వేషణ మొదలు పెట్టారు. వీరిద్దరు ఎంతో గొప్ప కళాకారులు కాకపోతే వీరిద్దరి సమాధులను తన సమాధి చెంతను ఎందుకు ఆయన నిర్మిస్తాడు? ప్రేమావతి సమాధిపైన "స్వర్గధామంలో స్వర్ణకమలం" అని ఎందుకు చెక్కించాడు? ఈ రెండు ప్రశ్నలకు సమాధానంగా డాక్టర్ నటరాజు రామకృష్ణ ఈ నవలికను వ్రాశారు.

తన దేశ ప్రజలను తన కన్న బిడ్డల్లా అబ్దుల్లా పాదుషా పాలించాడు. హిందూ ముస్లిం అన్న భేద భావం లేకుండా కవులు, పండితులు, కళాకారులను సమ భావంతో ఆయన పోషించాడు. కుల మత

సామరస్యాలను ఆయన పాటించాడు. నాలుగు వందల సంవత్సరాల క్రితమే ఆయన మత సామరస్యాన్ని ఆంధ్రలో పాదుకొల్పాడు. ఇద్దరు ఉన్నతులైన కళాకారుల పేరున రెండు దివ్య మందిరాలను, రెండు సమాధులను ఆయన నిర్మించడం దీనికి తార్కాణం. ఈ విషయమే డాక్టర్ నటరాజ రామకృష్ణను ఆకర్షించింది. దాని ఫలితమే ఈ చారిత్రక నవలిక ఆవిర్భావం.

సాంఘిక కథలను వ్రాసే రచయితలకు వారికి కావలసిన విధంగా పాత్రలను సృష్టించే స్వేచ్ఛ ఉంటుంది. కాని చారిత్రక నవలలను వ్రాసే వారికి ఈ స్వేచ్ఛ ఉండదు. చారిత్రక సత్యాలను వీరు మీరలేరు. చారిత్రక సంఘటనలు ఇలా జరిగి యుండవచ్చునని వీరు ఊహించి, వీరు వ్రాయవలసియుంటుంది. ఈ నవలికలో డాక్టర్ నటరాజు ఊహించి వ్రాసిన సంఘటనలు సముచితంగా చారిత్రక సత్యాలకు కట్టుబడి ఉన్నాయి.

ఈ నవలికలో అయిదు పాత్రలు – అబ్దుల్లా కుతుబ్‌షా, తారామతి, ప్రేమావతి, హయాత్ బక్షీబేగం, సిద్ధేశ్వరీ సుగుణమతి – ప్రధానమైనవి. ఈ అయిదు పాత్రలు కల్పితాలు కావు. వాస్తవ పాత్రలు. ఈ నవలికలోని సంఘటనా స్థలాలు చారిత్రకమైనవి. ఈ పాత్రలతో, ఈ చారిత్రక స్థలాల చుట్టూ ఈ నవలిక పరిభ్రమించింది.

అయితే అబ్దుల్లా ఆస్థానంలో ఎటువంటి నాట్యరీతి ఉండేది? తారామతి. ప్రేమావతి ఏ బాణీలో పాడేవారు? ఆడేవారు? అన్న విషయాలను డాక్టర్ నటరాజు ఈ నవలికలో చక్కగా, సున్నితంగా తెలియజేశారు. తులసిమూర్తి వంటి అబ్దుల్లా ఆస్థాన వాగ్గేయకారునితో ప్రఖ్యాతుడైన క్షేత్రయ పోటీ పడ్డాడంటే ఆ యాస్థానంలో భరత శాస్త్రపరమైన నృత్యకళ పోషింపబడి ఉండాలి. యశోధరా దేవి వంటి వారణాసి గాయకురాలు గోలకొండలో కచ్చేరీ చేసిందంటే ఉత్తర హిందూస్థానీ సంగీత నృత్యకళలు గూడా ఆ యాస్థానంలో పోషింప బడి ఉండాలి. దక్షిణ, ఉత్తర భారతదేశ బాణీలు రెంటింటిలోనూ తారామతి ప్రేమావతులు నిష్ణాతులై ఉండాలి. కుల, మత, భాషా సామరస్యాలనే కాక కళా సామరస్యాన్ని కూడా అబ్దుల్లా పాదుషా పెంపొందించినట్టుగా డాక్టర్ నటరాజు ఈ నవలికలో చిత్రించారు.

తారామతి, ప్రేమావతులను ఆ పాదుషా వారి దర్బారు కళాకారులుగా కాక వారి పోషణలో జీవించిన కళాకారులుగా వారిని డాక్టర్ నటరాజు భావించారు. అందుకే వీరి కోసం ప్రత్యేక మందిరాలు నిర్మించబడ్డాయి. ప్రత్యేకంగా రెండు పేటలు వెలిశాయి. వీరిద్దరూ సంగీత నృత్యకళలలో నిష్ణాతులే అయినా తారామతి సంగీతాన్ని, ప్రేమావతినృత్యాన్ని వారి అభిమాన కళలుగా స్వీకరించారని డాక్టర్ నటరాజు ఈ నవలికలో తెలియజెప్తున్నారు. రాజపోషణ అంటే ప్రభుత్వ పోషణ లేనిదే కళలు రాణించవన్నారు డాక్టర్ నటరాజు. ఎర్రగొల్ల భాగవతులకు అబ్దుల్లా పాదుషా వారు తిమ్మాపురాన్ని ఇనాంగా ఇచ్చినట్లు అబుల్ హసన్ తానీషా వారు బ్రాహ్మణ భాగవతులకు కూచిపూడి గ్రామ స్థలాన్ని ఇనాంగా ఇచ్చారు. ఈ యుభయులు ఆ విధంగా భాగవత కళలను పోషించక పోయుంటె అవి ఏనాడో అంతరించి పోయేవి.

"భావ వికాసంలో క్షేత్రయ పదాలకు మించినవి ఎక్కడా లేవు" అన్నారు డాక్టర్ నటరాజు. ఇది అక్షర సత్యం. "మతం మారినా, భాష వేరైనా, ప్రాంతం అన్యమైనా మానవ హృదయం ఒక్కటే" అని కూడా ఈయన అన్నారు. ఇది ప్రకృతి సహజం. దీనిని ఎవరూ కాదన లేరు.

"క్షేత్రయ కవిత్వం కేవలం శారీరక శృంగారానికి సంబంధించినది కాదు. ఆధ్యాత్మిక పరంగా దానిని మనం అర్థం చేసుకొనా"లన్నారు డాక్టర్ నటరాజు. జీవాత్మ, పరమాత్మ సంయోగాన్ని కోరుకొంటుందన్నారు. ఈయన వేరొక సందర్భంలో కేవలం శారీరక శృంగార పరంగా క్షేత్రయపదాలను అర్థం చేసుకొన్న వారికి డాక్టర్ నటరాజు గారి సమాధాన మిది.

ఆంధ్ర నృత్య కళాకారులు భావావేశానికి ప్రాముఖ్యమిస్తారు. దక్షిణాది కళాకారులు ఆంగికాభినయానికి ప్రాధన్యమిస్తారు అని డాక్టర్ నటరాజు వేరొక సందర్భంలో నిర్మొహమాటంగా తెలియజెప్పారు.

"దైవారాధనలో కళాకారులు పూజా పుష్పాలు కావాలి. విజ్ఞాన వంతులకు మన కళలు విందు చేయాలి. నిరక్షరాస్యులకు కళల ద్వారా కళాకారులు జ్ఞాన ప్రబోధం చేయాలి. కళారాధనలో నిజమైన పరమార్థం ఇదే" అన్నారు డాక్టర్ నటరాజు.

ఇది కేవలం ఒక నవలికే. అయినా ఇందులో అనేక ఉత్తమోత్తమమైన తమ అభిప్రాయాలను డాక్టర్ నటరాజు వెల్లడించారు. ఇది చాలా ప్రశంసనీయమైన నవలిక. దీనిని వ్రాసినందుకు వారిని అభినందిస్తున్నాను. ఇటువంటి నవలికలను మరికొన్ని ఆయన వ్రాయాలని ఆకాంక్షిస్తున్నాను.

"స్వామీ! గోలకొండకు మరల ప్రసాదించు అలనాటి సాంస్కృతిక స్వర్ణయుగము" అంటూ దైవన ప్రార్థనతో డాక్టర్ నటరాజ రామకృష్ణగారు ఈ నవలికను ముగించారు. వారి ప్రార్థనను భగవంతుడు ఆలకించాలని నేను మనసారా కోరుకొంటున్నాను.

21-11-1998

– గిడుగు రామమూర్తి

ఉద్దీపన

కళారాధకుల్లో రెండు రకాలు - కళను ప్రదర్శించేవాళ్ళు; కళను పోషించేవాళ్ళు. మందీ, మార్బలం, ధనం, దాంబికం ఉన్న వాళ్ళంతా కళాపోషకులు కాలేరు. కళపట్ల కేవలం శ్రద్ధాసక్తులుంటే సరిపోదు - వ్యామోహం ఉండాలి. చక్రవాక రాగం కోసం పడిగాడ్పులు కాయాలి. భామా కలాపం కోసం కళ్లల్లో ఒత్తులు పెట్టుకొని చూడాలి! అట్లాగే - కళ్లకు కాటుక పెట్టుకున్న వాళ్లూ, కాలికి గజ్జ కట్టిన వాళ్లూ కళాకారులు కానక్కరలేదు. అభిలాషుంటే చాలదు; అభినివేశం ఉండాలి. భగవత్ప్రసాదితమైన ప్రజ్ఞను ప్రదర్శించి, ప్రజల్లో నిద్రాణంగా నున్న కళాతృష్ణకు ఉద్దీపనం కలిగించాలి. తద్వారా కలిగే రసాస్వాదన శారీరకంగా తన్మయత్వాన్నే కలిగించకుండా, ఆధ్యాత్మికంగా కూడా తాదాత్మ్యం చెందే పరిణితిని సృజించాలి. ఈ ప్రక్రియలో - మతం గీచే ఎల్లలకు తావు లేదు; వర్ణ నిబంధనలకు స్థానం లేదు. కళా ప్రదర్శన, కళా పోషణ - ఈ రెండింటి సమ్మిళతమే కళారాధన. ఇవే చరిత్రలో ఓ విశిష్ట స్థానాన్ని అలంకరించుకొంటాయి.

ఈ నవల ఆ కోవకు చెందిన చరిత్రాత్మక చారిత్రక నవల! కథ - ఓ ముస్లిం మహారాజు, ఇద్దరు హైందవ కళాభినేత్రులు: ఒకరు సంగీతంలో, మరొకరు నాట్యంలో సిద్ధహస్తులు. రాజుగారు కళా పోషకులు. వారి పేరు అబ్దుల్లా కుతుబ్‌షా. కళాకారుల పేర్లు తారామతి, ప్రేమావతి. ఈ ముగ్గురి చుట్టూ పరిభ్రమించేదే ఈ స్వర్గధామంలో స్వర్ణకమలాలు. ఇక్కడే ఒక మాట చెప్పడం సముచితం. ఆనాటి ముస్లిం మహారాజుకు కానీ, హైందవ కళాకారులకు కానీ మత పట్టింపులు లేవు! నాలుగు వందల సంవత్సరాలు గడిచాక, కంప్యూటర్ యుగంలో ప్రవేశించిన మనం - వాళ్లు హైందవులు, వీళ్ళు ముస్లింలు అని ఉదహరించడం అపచారమే అవుతుంది. వాళ్లకు లేని పట్టింపులు మనకెందుకు? పోతే - మతాతీతమైన ఈ కళాశక్తి మనకో పాఠాన్ని నేర్పిస్తూంది... పాత్రల ద్వారా కళకున్న స్వచ్ఛత, నైర్మల్యత ఎంత పవిత్రమయినవో ఈ నవల కళ్లకు కట్టినట్టుగా మనకు చూపెడుతుంది. ఈ పరమ సత్యాన్ని చరిత్రలో పూడుకుపోయిన సమాధుల్లో నుంచి పునరుద్ధరించాలని రచయిత చేసిన ప్రయత్నానికి ఆకృతే ఈ నవల!

చారిత్రాత్మకమైన ప్రతి విషయానికి మనస్సులో చెరగని ముద్ర వేసే కొన్ని జ్ఞాపకాలుంటాయి. కూలంకషంగా వాటిని పరిశీలిస్తే - ఆహ్లాదకరమైన సన్నివేశాలు ఒక ప్రక్క కనిపిస్తే, హృదయ విదారకమైన సంఘటనలు మరో ప్రక్క కనిపిస్తాయి. ఈ రెండింటిని సంగ్రహించి ప్రతి ముఖ్య భూమికలోను తను జీవించి, తాను పొందిన ఆ విచిత్రానుభూతిని అతి నేర్పుగా అక్షరబద్ధం చేశారు రచయిత. అంత మాత్రాన మహద్గ్రంథం కానక్కరలేదు. ఇదో ఇతిహాసం. రసాత్మక వాక్యం కావ్యం అన్నారు లాక్షణికులు.

ఓర్పుకు, నేర్పుకు ప్రతీక రామకృష్ణగారు... డాక్టర్ నటరాజ రామకృష్ణ అటు సంగీతంలోనూ, ఇటు నాట్యంలోను ఆరితేరినవారు గనుక ఇలా చెయ్యడం వారికే సాధ్యమయింది. నవల చదివిం తర్వాత నాకు కలిగిన అనుభూతి: తారామతి, ప్రేమావతి ఇద్దరూ నటరాజ రామకృష్ణలో కనిపించారు!

కొన్ని దశాబ్దాలుగా రామకృష్ణగారు కళకు చేస్తున్న సేవల కిది కలికితురాయి. ఆంధ్ర నాట్యాన్ని, సంగీతాన్ని, కళాకారుల్నీ ఉన్నత శిఖరాల మీద అధిష్టింప చేస్తున్న రచయిత. అలాంటి చరితార్థుల ప్రక్కన పెద్ద పీట వెయ్యాలి.

ఈ నవలని ప్రచురణ బాధ్యత శ్రీ గిడుగు రామ్మూర్తిగారి మీద మోపటం జరిగింది. వారితోపాటు కలిసి ఈ నవల కళ్ళకు కాటుక దిద్ది కాలికి గజ్జె కట్టించే అవకాశం నాక్కూడా లభించినందుకు రామకృష్ణగారికి ధన్యవాదాలు. మత సామరస్యానికిది దోహదం చేసే విధంగా దీనిని రూపొందించిన రామకృష్ణగారి దీర్ఘదృష్టికి నా కైమోడ్పు.

నటరాజ రామకృష్ణగారికి ఈ నవల ఓ మధుర స్వప్నం! అచ్చువేసే రోజుల్లో ఈ నవలని గురించి వారు పడిన తాపత్రయం ఇంతా అంతా అని చెప్పలేం. ఇప్పటికే వారు యాభై పుస్తకాలు రాసినా, ఈ నవల పట్ల వారు చూపెట్టిన శ్రద్ధ ఓ వ్యక్తిపట్ల చూపెట్టే ఆప్యాయతలా పరిణమించింది! వైభవోపేతంగా విరాజిల్లినా ఆనాటి కళా సామ్రాజ్యపు కళాకాంతుల్లో ఏ ఒక్క కిరణంలా అయినా సరే... తన నవల వెలుగొందాలన్న వారి మనస్సు ఆ తాపత్రయంలో ప్రతిబింబించింది. అందుకే – ఆ తాపత్రయం... ఆ తపన. నాకు తెలిసిన రామకృష్ణగారు... స్వప్నజగత్తులో విహరించే వ్యక్తి. బహుశా, అది కళాకారుని లక్షణమేమో కాని – ఈ నవల వారి కలలకు మానవాకృతిని కల్పించి, కనుమరుగయిపోయిన "కమలాలను" మన కళ్ల ముందు సజీవంగా నిలబెట్టింది! ఇంకేం కావాలి? ఈ ఉద్దీపనం చాలదా?

రెవరెండ్ డా॥ దాస్‌బాబు
జాతీయ రచయితల సమాఖ్య కార్యదర్శి

Inscription in the tomb of Prema Mati, Golconda

Behind the dry details of ordinary events, the chronicle of the Qutb Shai dynasty have a halo romance and the names of the beautiful Bhag Mati, Pem Mati and Tara Mati, aided by local traditions and monuments, conjure up many a stirring scene in the imaginative mind. Pem Mati is reported to have been a concubine of 'Abdullah Qutb Shah' (1626 - 72 A.D.), which does not appear to be unlikely, because she expired in 1073 A.H. (1662 A.D.) and her tomb was built during the reign of the king. It is a small building, consisting of a square hall crowned with a shapely dome. The most interesting feature of the tomb is the epitaph, which is carved on the lintels of the eastern and the southern doors and also on the sarcophagus in band IV of the benedictory verses. It is full of poetic feeling and echoes a transcendental philosophy:-

PLATE XII (a)

بود از ازل کل جنتي پيم متي

سنه ۱۰۷۳

TRANSLATION

From all eternity Pem Mati was a flower of Paradise. 1073 A.H. (1622 A.D.).

The style of writing is Nasta'liq, which was adopted probably to distinguish the inscription from the epitaphs of royal ladies. The only other inscription in the Nasta'liq characters at Golconda is on the grave of Neknam Khan, who also did not belong to the royal family.

The benedictory verses on Pem Mati's grave are carved in this order:-

Top slab - Qur'an (Ch.III, versa 16).

Along the sides - Bands I-III, Qur'an (Ch. II, verse 256, and Ch. CXII).

Band IV, Shite Durud in a brief form.

కళకు కులం పులమకండి!

ఈ తారామతి ప్రేమావతు లెవరు? వారిది ఏ వంశం? ఏ గోత్రం? ఏ కులం? వారెక్కడ పుట్టారు? వారి తల్లిదండ్రులెవరు? అసలు వారింతకు తెలుగు వారేనా? ఇటువంటి సందేహాలు గత నాలుగు వందల సంవత్సరాల నుంచి ఎవరికీ కలుగలేదు. కాని 4-1-97 నుంచి నేను వారిని గురించి ఆలోచించి, వారి శిథిల మందిరాల వద్దకు వెళ్ళి, వాటిని పరిశీలించి, పరీక్షించి, వారిని గురించి పత్రికలలో వ్రాస్తూ, ప్రచారం చేయటం మొదలు పెట్టిన తర్వాత కొంత మంది పెద్దల మెదడులో పై సందేహాలు మెదలడం మొదలు పెట్టాయి. వారిలో కొందరు నా వద్దకు వచ్చి నిర్మొహమాటంగా ఈ ప్రశ్నలు అడిగారు. అప్పుడు నేను వారిని ఈ క్రింది ప్రశ్నలు అడిగాను.

క్షేత్రయ్య ఎవరు? ఎక్కడ పుట్టాడు? అతని తల్లిదండ్రులెవరు? అతనికి మోహనాంగి అనే ఒక ప్రియురాలు ఉండేదా? ఆయనకు పెళ్ళి అయిందా? అతని భార్య పేరు రుక్మిణా? తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన నాట్య గ్రంథాలలో ఈ విషయాలున్నాయి. అవి వాస్తవాలేనా? ఇవి నాట్య విద్యార్థులకు అవసరమా?

తారామతి ప్రేమావతుల గురించి నేను ఆలోచించినప్పుడు వారు పుంటి కూరతో జొన్న రొట్టెలు తిన్నారా? కోడి పలావ్ తిన్నారా? తైదల అంబలి తాగారా? అని ఆలోచించలేదు. అబ్దుల్లా కుతుబ్ షా వారి కోసం ప్రత్యేకంగా రెండు భవనాలు తన గోల్కొండ కోటకు చేరువలో ఎందుకు నిర్మించారు? ప్రపంచ చరిత్రలో ఎక్కడా, ఎవరికీ రాని ఈ గౌరవం ఈ యిద్దరు కళామూర్తులకు ఎందుకు లభించింది? అని ఆలోచించాను. తారామతి సంగీతం ఎంతో ఉత్తమమైనదీ, ఉన్నతమైనదీ కాకపోతే తారామతి గాన మందిరాన్ని ఆయన ఎందుకు నిర్మించారు? ప్రేమావతి నాట్యం ఎంత గొప్పది కాకపోతే ఆయన ప్రేమావతి నాట్య మందిరాన్ని ఎందుకు నిర్మించారు? గోల్కొండ చరిత్రలో ఇంత గొప్ప గౌరవం ఆ యిద్దరు కళామూర్తులు పొందడానికి వారు ఆ పాదుషా వారిని వారి కళా ప్రదర్శనలతో ఎంత మైమరిపించి ఉంటారు? హైదరాబాద్ నగర శివారులలో వారి పేరిట రెండు గ్రామాలు వెలిశాయి. మరి వారెంత గొప్పవారై ఉండాలి? ఇవే నేను ముఖ్యంగా వారి గురించి ఆలోచించిన విషయాలు. వారిద్దరు ఎవరైతేనేం? వారి తల్లిదండ్రులు ఎవరైతేనేం? వారి గురువులు ఎవరైతేనేం? ఆంధ్రుల సాంస్కృతిక చరిత్రకు ముఖ్యంగా అబ్దుల్లా కుతుబ్ షా కాలం నాటి సాంస్కృతిక చరిత్రకు అపూర్వ గౌరవాన్ని వారు చేకూర్చారు. ఇదే నన్ను ఆకర్షించింది. వారి కళా తపస్సు గర్వించదగ్గది.

ప్రస్తుతం కాలంలో కళావంతుల కులానికి చెందినవారు వారి వృత్తిని విడనాడారు. ఇతర కులాలకు చెందిన వారు ఆ వృత్తిని చేపట్టారు. ఒకప్పుడు నాట్య కళను చిన్న చూపుతో చూసిన వారే నేడు అదొక పవిత్రమైన కళ అని వేదికపై నెక్కి ఉపన్యాసాలిస్తున్నారు. హఠాత్తుగా ఈ కళ ఎలా గొప్పదైంది? అకస్మాత్తుగా నాట్యకళకు పవిత్రత చేకూరిందా?

దేవగిరికి చెందిన సారంగ దేవుడు సంగీత రత్నాకరం వ్రాశాడు. ఓరుగల్లుకు చెందిన జాయప నృత్య రత్నావళి, వాద్య రత్నావళి, గీత రత్నావళి రచించాడు. రాచకొండకు చెందిన సర్వజ్ఞ సింగ భూపాలుడు రసార్ణవ సుధాకరాన్ని వ్రాశాడు. అక్బర్‌షా శృంగార మంజరి వ్రాశాడు. వీరందరూ వివిధ కులాలకు చెందిన వారు. కనుక పరిశోధకులకు కులాలతో సంబంధం లేదు. వారి జాతి మతాలతో సంబంధం లేదు. వారి కళా జ్ఞానం తోను, వారి కళా సంపత్తిలోను మాత్రమే పరిశోధకులకు సంబంధముంది. వీరి గ్రంథాలను చక్కగా పరిశీలించి, విపులంగా పరిశోధిస్తే ఆయా కాలాలలో ఉన్న నాట్య సంగీత రీతులు, వాద్య విశేషాలు, తెలుసుకొనవచ్చు.

ఆనాటి కళాకారులు వారి జీవితాలను కళలకు అంకితం చేసి, కళలను ఆరాధించకపోతే నేడు కళలు జీవించి ఉండేవి కావు. బ్రాహ్మణ భాగవతులకు కూచిపూడి అగ్రహారాన్ని దానం చేసిన అబ్దుల్ హసన్ తానీషా వారిని తలంచకుండా కూచిపూడి నాట్యం ఎలా ఉండగలదు? ఆత్మ సంస్కారంతో పరిశోధనలు చేయాలి. గ్రంథాలు, చరిత్రలు వ్రాయాలి. కళాకారుల హృదయాలను ఎరిగి, వారి అనుభూతులను తెలుసుకొని గ్రంథరచన చేయాలి. ఈ దృష్టితో నేను ఊహించిన ఇరువురు కళాకారులు, తారామతి, ప్రేమావతులు. ఇదే ఈ నవలికలోని ఇతివృత్తం.

– డా. నటరాజ రామకృష్ణ

స్వర్గధామంలో స్వర్ణ కమలాలు

తారామతి - ప్రేమావతి

నా కళాహృదయంలో వికసించిన సుందర పారిజాతం ఈ నవలిక.

తారామతి ప్రేమావతులు చరిత్రలో వాస్తవ వ్యక్తులు. అలాగే మా సాహెబా హయాత్ బక్షీ బేగమ్, అబ్దుల్లా పాదుషాలు. వారిని ఆధారం చేసుకొని నేను అల్లిన నవలిక ఇది. దీనిలోని సంఘటనలు, సందర్భాలు, పాత్రల ప్రవర్తనలు ఇలాగే జరిగియుండకపోవచ్చు గాని ఇలా జరిగి యుండడానికి అవకాశ ముందని చారిత్రక అధ్యయనం ద్వారా నేను ఊహించాను. ఈ నవలిక యధాతథంగా వాస్తవ చరిత్రకాదు. కానీ వాస్తవాల ఆధారంగా ఊహించిన ఇతివృత్తం ఇది అని మాత్రం నేను తెలియజేస్తున్నాను.

డా॥ నటరాజ రామకృష్ణ

ప్రేరణ

ఆనాడు ఆగష్టు 15, 1997, భారత స్వాతంత్ర్య దినం. సాయంత్రం 5 గంటలయింది.

ఆకాశం నల్లని మేఘాలతో కమ్ముకొని ఉంది. చిన్న చినుకులతో ప్రారంభమైన వర్షం జోరుగా కురియనారంభించింది. రాజభవనంలో ఆనాటి తేనీటి విందుకు నాకు ఆహ్వానం వచ్చింది. పద్మశ్రీ, పద్మభూషణ్ మొదలైన బిరుదాంకితులకు ప్రభుత్వం వారు ఆగష్టు 15 ఉత్సవానికి ఆహ్వానం పంపడం ఒక ఆనవాయితీ. అది ఒక ప్రత్యేక గౌరవం. అందువల్ల ఆ తేనీటి విందుకు వెళ్ళాలని ఒక టాక్సి తెప్పించుకొన్నాను. టాక్సి వచ్చి నా యింటి గేటు వద్ద ఆగింది. నేను వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. నా మిత్రుడు యుగంధర్, శిష్యుడు శ్రీధర్ నాతో గూడ వస్తామన్నారు. సరే నన్నాను.

కాని ఎందు వల్లనో అకస్మాత్తుగా తారామతి ప్రేమావతుల దివ్య మందిరాల వద్దకు వెళ్లాలన్న ఒక కోరిక నా మనస్సులో మెదలింది. నా మనస్సు మారింది. రాజభవన్ టీ పార్టీకి వెళ్లకుండా గొల్లకొండ కోట వైపు వెళ్లాలనిపించింది. ఆ మాటే మిత్రులకు చెప్పాను. "మాష్టారు గారూ! అక్కడేముంది? అంతా బురదా, బాడీ తప్ప, అక్కడ నిలువడానికి నీడ కూడా లేదు. చక్కగా, మహారాజులాగ రాజభవన్ తేనీటి విందుకు వెళ్ళండి" అన్నారు ఆ మిత్రులు.

"గొల్లకొండకే వెళ్ళాలి. నిలవడానికి నీడలేకపోతే కారులో కూర్చునే ఆ శిథిల మందిరాలను సందర్శించి వద్దాం" అన్నాను నేను.

ముగ్గురం బయలు దేరాం. దారిలో గులాబి పువ్వులు, అగరవత్తులు, అరటిపళ్లు కొని, తీసికొని వెళ్ళాం. ఒక గంటలో ఆ శిథిల మందిరాల వద్దకు చేరుకొన్నాం. "దీనినే బారదరీ అంటారు" అని వారికి చెప్పాను.

వర్షం ఆగింది కాని ఇంకా చిన్న చిన్న చినుకులు పడుతూనే వున్నాయి. ప్రేమావతి నృత్య మందిరానికి చేరువుగా కారుని ఆపించాను. ఆ గుట్ట పైకి నేను ఎక్కలేక " ఆ మందిరంలో ప్రేమావతి నృత్యం చేసిన వలయాకార రంగస్థలంపైని ఈ పూవులు, పండ్లు ఉంచి, అగరవత్తులు వెలిగించి రండి" అని వారిద్దర్నీ ప్రేమావతి మందిరానాకి పంపాను. వారిద్దరూ ఆ గుట్టమీదకు ఎక్కుతూ వుంటే ఆ మందిరాన్ని చూస్తూ నేను కారు వద్ద నిలబడ్డాను.

ఆ మందిరం పై నుండి సన్నని ధారలుగా వర్షపునీరు కారుతూ ఉంది. ఆ శిధిలమందిరం కన్నీరు కారుస్తున్నట్టు నా కనిపించింది. నా కళ్ల వెంట కన్నీరు కారింది.

పశ్చిమ దిక్కున సూర్యుడు కుంగేడు. ఆకాశంలో దట్టంగా మేఘాలు కమ్మి ఉండడం వల్ల చుట్టూ చీకటి ఆవరించింది. చుట్టూ కలియజూశాను. దూరంగా స్వాతంత్ర్యదినోత్సవాల దీపాల అలంకరణలతో చుట్టూ ఉన్న భవనాలు మెరిసిపోతున్నాయి. దీపం పెట్టే దిక్కులేక చీకట్లో తారామతి ప్రేమావతుల సంగీత నృత్య మందిరాలు విలపిస్తున్నట్టుగా నాకు కనిపించాయి. జన సంచారం లేని ఆ ప్రాంతంలో ఆ గుట్టలపైని ఒంటరిగా అవి రోదిస్తున్నట్టు నాకు అనిపించింది.

మరింత చీకటి అక్కడ అలుముకొంది. దూరంగా గోలకొండ కోట విద్యుద్దీపాలతో మెరిసిపోయింది. ఈ దివ్య శిధిల మందిరాలు కాంతి రహితంగా రెండు భూతాల్లాగా ఆ చీకట్లో నాకు కనబడ్డాయి. నా మనస్సు చివుక్కుమంది. హృదయం తరుక్కుపోయింది.

యుగంధర్ శ్రీధర్‌లు గుట్టదిగి వచ్చారు. గోలకొండ ఊరిలోని దీపావళులను, చీకటిలో శిధిలాలుగా నున్న ఆ దివ్య మందిరాలను వారికి చూపించాను. "ఒకప్పుడు గొప్ప కళాకారులుగా వెలుగొందిన తారామతి ప్రేమావతుల దివ్యమందిరాలలో నేడు వెలుగే లేదు! ఇదేనా మానవ జీవితం?"

"మనం ఏం చేయలేమా?" అని ఆలోచిస్తూ కారు ఎక్కాను. హైదరాబాద్ వైపుకు కారు పరుగెడుతూంది. త్రోవ పొడుగునా రకరకాల దీపాలు, రంగు రంగులుగా అలంకరింపబడిన దీపాలు, ఆరి వెలుగుతున్న దీపాలు, తోరణాలలాగ వేలాడుతున్న దీపాలు, విష్ణుచక్రాలు తిరుగుతున్నట్టు భ్రమగొలిపే దీపాలు, వర్ణచిత్రాల్లా రూపొందించబడిన దీపాలు, వర్ణించడానికి వీలు లేనన్ని రకరకాల దీపాలు.

త్రోవపొడుగునా ఎక్కడ చూసినా ఆనందం వెల్లివిరుస్తూంది. నాకు మాత్రం ఆ దివ్య మందిరాలలోని చీకటే కనిపిస్తూంది. నా మదిలో విషాదం చోటు చేసికొంది. హృదయం దుఃఖంతో నిండిపోయింది. కళ్ళ వెంట దుఃఖాశ్రువులు జలజలరాలేయి. యుగంధర్, శ్రీధర్‌లు చూడకుండా కళ్లు తుడుచుకొన్నాను. భారంగా నిట్టూర్చాను. నాలాగే వారిద్దరూ కూడా బాధపడుతున్నారేమో, వారేమీ నాతో మాట్లాడలేదు. నన్ను నా యింటి వద్ద విడిచి వారిద్దరూ వెళ్ళిపోయారు.

ఒంటరిగా ఆలోచిస్తూ నా గదిలో కూర్చున్నాను. ఆ దివ్య మందిరాలకు వాటి పూర్వ వైభవాన్ని ఏనాటికైనా చేకూర్చాలని నా మనస్సులో నిశ్చయించుకొన్నాను. కాదు సంకల్పించుకొన్నాను. మళ్లా ఆ శిధిల మందిరాలు దేదీప్యమానంగా వెలుగొందాలి, అవి మరల ప్రకాశించాలి. తారామతి ప్రేమావతులను అందరూ స్మరిస్తూండాలి. సంగీత నృత్యకళల పవిత్రతను లోకానికి చాటి చెప్పాలి అని తీర్మానించుకొన్నాను.

తారామతి ప్రేమావతులు గొప్ప కళాకారులు. అందుకనే వారికి ప్రత్యేకంగా సంగీత నృత్యమందిరాలను అబ్దుల్లా కుతుబ్‌షా నిర్మించాడు. తన సమాధి ప్రక్కనే వారి సమాధులను కట్టించాడు. ఆ యిద్దరు సామాన్య కుటుంబంలో జన్మించినా గొప్ప కళాకారులుగా ఖ్యాతి పొందారు. అయినా వారు ఆంధ్రుల కళా చరిత్రలో మరుగున పడిపోయారు.

భక్త మీరాబాయిలాగ ఏ రాజవంశంలోనైనా వారు పుట్టియుంటే! ఆ శ్రీకృష్ణ దేవుని భక్తురాండ్రుగా వారిని చరిత్రకారులు కీర్తించి యుండేవారు. కవులు కావ్యాలు వ్రాసి ఉండే వారు సువర్ణాక్షరాలతో వారి పేర్లు చరిత్రలో లిఖింపబడేవి.

గొప్పవారి గోత్రాలు వేరు, పేదవారి గోత్రాలు వేరు. ఈ గోత్రాల ననుసరించే మనవారు చరిత్రలు వ్రాస్తున్నారు. జీవిత అంతస్తులు చారిత్రక రచనలలో తారుమారు అవుతూ ఉంటాయి.

నృత్యనికేతనం
అశోకనగరం

15 ఆగష్టు, 1997

– డా॥ నటరాజ రామకృష్ణ

విన్నపం

ఆంధ్ర సోదర సోదరీమణులకు నా విన్నపం.

ఏనాడో తెలుగు గడ్డ నుండి బెంగుళూరు వెళ్లి అక్కడ స్థిరపడిన కళాతపస్విని స్వర్గీయ బెంగుళూరు నాగరత్నమ్మ గొప్ప సంగీత నృత్య విద్వాంసురాలు. ఆమె ఒకసారి త్యాగరాజ స్వామి వారి సమాధి వద్దకు వెళ్ళింది; ఆ సమాధి దీనావస్థను కళ్లారా చూసింది; కన్నీరు కార్చింది. తన యావదాస్తిని ఆ త్యాగరాజస్వామి వారి మందిర నిర్మాణానికే వెచ్చించింది. ఆ స్వామి వారిని చిరంజీవులను చేసింది. ఆ స్వామి వారి మందిరాన్ని ఆమె నిర్మించినప్పటి నుండి ప్రతి సంవత్సరం ఆ స్వామి వారి ఆరాధనోత్సవాలను సంగీత కళాకారులు అక్కడ నిర్వహిస్తున్నారు. ఒక ఆంధ్ర స్త్రీ కళామూర్తి సేవా ఫలితం అది.

మనం ఆరుకోట్ల ఆంధ్రులం. లక్షలమంది కళాకారులు మనలో ఉన్నారు. చరిత్ర పుటలలో మరుగున పడిన ఇరువురు కళామూర్తులు – తారామతి ప్రేమాపతులను మనం పునర్జీవింపజేయలేమా? ఆలోచించండి! మనం కళల విశిష్టతను లోకానికి చాటడానికి ముందుకు రండి! పవిత్రమైన ఆంధ్ర సంగీత నృత్యకళల విశిష్టతను లోకానికి తెలియచెప్పండి. రండి! ముందుకు కదలండి! త్వరపడండి!

ఇదే నా విన్నపం.

– డా॥ నటరాజ రామకృష్ణ

ప్రేమావతి పేట

హైదరాబాద్ నగర శివారులలో నున్న శివరాంపల్లికి చేరువలో ప్రేమావతి పేట ఉందని తెలిసి, కథక్ నాట్యాచార్యుడు అంజుబాబు కారులో శివరాంపల్లి వెళ్ళాను. అక్కడ ప్రేమావతి పేటకు దారి అడిగి, ఆ పేటను సమీపించాను. ఆ గ్రామం వెలుపల ఒక వృద్ధుడు తారసిల్లేడు. ఆయన ఖద్దరు దుస్తులు ధరించి ఉన్నాడు. ఆయనొక గాంధేయవాది అని తలచి, కారు దిగి ఆయన వద్దకు వెళ్ళి, "తాతగారూ! ప్రేమావతి పేట ఇదేనా?" అని అడిగాను. ఆయన సంస్కారవంతుడులా ఉన్నాడు. "అవును బాబూ! మీకు ఎవరు కావాలి?" అని మర్యాదపూర్వకంగా అడిగారు.

"ఎప్పుడో గతించిన ప్రేమావతిని గురించి తెలుసుకొనాలని వచ్చాను" అని చెప్పాను.

"ఔను బాబూ! ఒకప్పుడు ప్రేమావతి ఇక్కడ ఉండేదట! ఆమె అబ్దుల్లా కుతుబ్‌షా దర్బారులో నాట్యం చేసేదట! ఆమె పేరిట ఈ గ్రామం వెలిసిందట! ఆమె ఒక గొప్ప వేశ్యట!"

"తాతగారూ! ఆమె వేశ్యకాదండి, ఆమె ఒక గొప్ప కళాతపస్విని, వేశ్యాత్వం ఆమెకు లోకం అంటగట్టింది. ఏమైతేనేం ఆమె భౌతిక కాయం ఏనాడో పంచభూతాల్లో కలిసిపోయింది" అన్నాను.

"ఆమె గొప్ప కళాకారిణా" అని ఆయన ఆశ్చర్యపోయాడు.

"ఔనండి! ఆమె నృత్య కళాతపస్వి ... ఆమె కళాతపస్సే నన్నిక్కడకు తీసికొని వచ్చింది. ఆమె జాడలు ఇక్కడ ఏమైనా యున్నాయేమోనని వెతకడానికి వచ్చాను" అన్నాను.

ఆయన నా సమాధానం విని ఆశ్చర్యపోయారు. ఒక్క నిమిషం నిశ్చేష్టుడై నిల్చిపోయారు. తర్వాత స్పృహలోకి వచ్చి, "తమ నామధేయం?" అని అడిగాడు. చెప్పాను.

"రండి బాబూ! ఊర్లోకి వెళ్దాం" అని నన్ను ఆయన వెంట తీసుకుని వెళ్లారు. ఆ వూరిలోని పెద్దలు కొందర్ని కలిశాను. పురాతనమైన ఒక మసీదును చూశాను. దాని నిర్మాణ తీరును బట్టి అది పాదుషాల నాటిదని తెలుస్తూంది. కనుక ఆ గ్రామం పాదుషాల కాలం నాటి ప్రేమావతి పేట. ఆ పెద్దల్లోని కొందరు సహృదయులు విషయ సేకరణ చేసి నాకు పంపుతామన్నారు. నా కృషిని కొందరు శ్లాఘించారు. ప్రేమావతికి చెందిన కొంత విషయం ఎవరి వద్దనో ఉర్దూలో ఉందని ఒక రన్నారు. అరబ్బీలో ఉన్నదని మరొక రన్నారు. పారసీకంలో ఉందని వేరొక రన్నారు. చివరకు, ఆ విషయాలను గురించి చెప్పగలవారు పాకిస్తాన్ వెళ్లిపోయారని తెలిసింది.

ఇంకా కొందర్ని కలవాలనుకొన్నాను. కాని వారందరూ రాజకీయనాయకులు. వారికి రాజకీయాలలో ఉన్న ఆసక్తి కళలలో లేదు. నాకు కళాసేవే ముఖ్యం. వారికి రాజకీయాలు ప్రధానం. వారికీ నాకూ మధ్యగల తేడా ఇది. అందువల్ల వారెవరిని నేను కలియలేదు. నేను మళ్లా ఆ గ్రామం వెళ్లలేదు. వారు నాకు ఏ సమాచారం పంపలేదు.

ప్రేమావతి చరిత్ర ఏమైనా తెలుస్తుందేమోనని ఆ పేట వెళ్లాను. ఆ ఆశ నిరాశ అయింది. అదే నాకు మిగిలింది.

ఆ వూరి నుండి తిరిగివచ్చేముందు మొదట పరిచయమైన ఆ తాతగారికి నమస్కరించి, కృతజ్ఞతా పూర్వకంగా నా భుజం మీదనున్న పట్టు శాలువాను తీసి, ఆయనకు కప్పి, కారు ఎక్కి ఇంటికి తిరిగివచ్చాను.

తారామతి పేట

విజయవాడ రహదారి మీదుగా హయత్‌నగర్ దాటి, అబ్దుల్లాపూర్ మెట్టదాటి, మండుటెండలో తారామతి పేటను వెతుక్కొంటూ వెళ్లాం. వెళ్లగా, వెళ్లగా తుదకు ఆ గ్రామం కనబడింది. ఆ గ్రామంలోకి వెళ్ళాం. అక్కడ పాదుషాల నాటి ఒక మసీదు ఉంది. ఆ మసీదును బట్టి ఆ గ్రామం చాలా ప్రాచీనమైనదని మేము భావించాం.

ఆ గ్రామాన్ని చూశాం. అక్కడి ప్రజలలో కొందర్ని కలసి, మాట్లాడేం. ఆ వూళ్లో వారుంటున్నారు గనుక వారి కా పేరు తెలుసు. కాని ఆ వూరి పేరు కున్న గొప్పతనం వారికి తెలియదు; తెలుసుకొనే అవసరం వారికి లేదు; తెలుసుకొనా లనే జిజ్ఞాస వారికింత వరకు కలిగినట్టు లేదు. గత మూడు నాలుగు శతాబ్దులుగా వారూ, వారి పూర్వీకులు ఆ గ్రామంలో ఉంటూ వచ్చినా వారికి ఆ ఊరి గొప్పతనం తెలియదు. ఇదే మనదేశ చరిత్రకున్న గొప్పతనం.

హయత్‌నగర్

అలనాడు హయత్ బక్షీ బేగం సాహెబా కట్టించిన ఒక మసీదు, ఒక సరాయి ఉన్నాయని తెలిసి ఒకనాడు హయత్‌నగర్ వెళ్లాను. మసీదు చెక్కు చెదరకుండా ఉంది. సరైన పోషణ లేక సరాయి కొంత పాడుపడింది. ఏ నూతన విషయాలను ఈ రెండు నిర్మాణాలు నాకు చెప్పలేదు. సరాయికి ముందు భాగానికి చేరువలో ఒక సొరంగముంది. అక్కడ నుండి ఆ సొరంగం గుండా గోలకొండకు పూర్వం వెళ్లేవారట. అంటే అది భూగర్భ మార్గమన్నమాట!

ఆ సరాయిలో ఒక కుటుంబం కాపురముంటున్నది. ఆ యింటి యజమానిని కలిసి మాట్లాడాను. అతనికి సుమారు 45 సంవత్సరాల వయస్సుండవచ్చును. అతడా సరాయిలోనే పుట్టి పెరిగాడట. అతని తండ్రీ, తాతా గూడా అక్కడే పుట్టి, జీవించి, చనిపోయారట. కాని ఆ మసీదు గురించి పూర్తి వివరాలు అతనికి తెలియవు. ఏవో కొన్ని విషయాలు చెప్పాడు. ఇంకా ఎక్కువ సమాచారం కావాలంటే హైదరాబాద్‌లోని పురావస్తు శాఖ వారిని సంప్రదించమని అతడు సలహా ఇచ్చాడు. అతడు చెప్పిన వివరాలు నాకేమి ఉపకరించలేదు.

సుల్తాన్‌పూరు

హయత్ బక్షీ బేగం నిర్మించిన హయాదాబాద్‌కు కొంత దూరంలో కొన్ని రాతి కట్టడాలు శిథిలాలుగా నిలిచి వున్నాయి. వాటి చుట్టూ ఒక అగడ్త ఉంది. హయత్ బక్షీ బేగం భర్త, అబ్దుల్లా కుతుబ్‌షా తండ్రి

అయిన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా ఒక పట్నాన్ని నిర్మించదలచి, ప్రారంభించిన కట్టడాలు అవి. 1626 లో భయంకర వ్యాధి పీడితుడై సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా మరణించారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడక పూర్వం వరకు ఆ శిధిలాలు వంటరిగా అలాగే ఉన్నాయి. ఆ తర్వాత అక్కడ కొందరు ఇళ్లు కట్టుకొన్నారు. ఒక శిధిల గృహాన్ని వారు ఒక దైవ మందిరంగా చేసుకొన్నారు. అయితే వారికి ఆ ప్రాంతం గురించి గాని, దాని విశిష్టత గురించి గాని, దాని చరిత్ర గురించి గాని తెలియదు. అక్కడకు వెళ్లడం కూడ దండగే అనిపించింది.

పుప్పాలగూడ

ఒకనాడు పుప్పాల గూడ వెళ్లాను. దీనిని పూర్వం పుష్పాలగూడ అనేవారట. పూర్వం ఇక్కడ పూతోట లుండేవట. ఈ తోటలలోని పూవులనే తీసికొని వెళ్లి పాదుషాలకు ఇచ్చేవారట. ప్రస్తుతం అక్కడ గూడ పూర్వ వైభవ చిహ్నాలు ఏవీ మిగిలి లేవు.

పైని చెప్పిన వన్నీ గతకాల వైభవాలు. నేటి శిధిలాలు నా యీ పర్యటనలు నా పరిశోధనకు కలిసి రాలేదు. వృధా అయ్యాయి. మరింక వృధా శ్రమ పడదలచుకొనక నాకు తెలిసిన కొద్ది విషయాలతో ఈ నవలిక వ్రాశాను. కనుక సహృదయంతో ఈ నవలికను మీరు స్వీకరించి, చదవండి, ఆనందించండి. చాలు.

ఒక స్మృతి

సుమారు ముప్పయి సంవత్సరాల క్రితం ఒకనాటి సాయంత్రం సరదాగా గోలకొండ దుర్గాన్ని చూడ్డానికి వెళ్లాను. ఆ దుర్గం వెనుక రెండు చిన్న కొండల పైని రెండు శిధిల మందిరాలు కనిపించాయి. వాటిని గురించి అక్కడున్న వారిని అడిగాను అవి తారామతి, ప్రేమావతి మందిరాలని నాకు వారు చెప్పారు. ఆ చిన్న కొండ లెక్కి వాటిని దగ్గరగా చూశాను. తర్వాత వాటిని గురించి ఎన్నో పిట్టకథలు విన్నాను. పత్రికలలో కొన్ని కథలు చదివాను. ఆ తర్వాత మళ్లా అనేకసార్లు వాటిని దగ్గర నుండి, దూరం నుండి చూశాను. అంతే. ఎందువల్లనో అవి నా స్మృతి పథంలో నిలువలేదు. అప్పటికప్పుడే వాటిని గురించి మరిచిపోతూ వచ్చాను. అదే ఇప్పుడు చిత్రమనిపిస్తూంది.

అప్పుడు నేనింకా యువకుణ్ణి. విశేషంగా శ్రమపడి, పరిశ్రమ చేసి, పరిశోధనలు చేస్తూండేవాణ్ణి. ఆంధ్రుల నాట్య కళాభివృద్ధికి పాటుపడుతూ ఉండేవాణ్ణి. కన్వీనరుగా కూచిపూడి నాట్య సదస్సును నిర్వహించి, కూచిపూడి నాట్యం శాస్త్రీయమైనదని రుజువు చేసి, కేంద్ర సంగీత నాటక అకాడమీ దానిని గుర్తించేటట్టు చేశాను. పేరిణీ శివ తాండవాన్ని పునఃసృష్టించాను. ఆంధ్రుల లాస్య నర్తనానికి కొత్త ఊపిరిపోసి, ఆంధ్ర నాట్యంగా దానిని ప్రచారం చేస్తూ వస్తున్నాను. చిందు భాగవతం, తూర్పు భాగవతం రీతులను ప్రోత్సహించాను. తప్పెట గుండ్లు, గరగలు, డప్పులు, జోగాట, వీరుల నాట్యం, గురువయ్యలు, దొమ్మరి ఆట, ఉరుములు, తప్పెడలు, పగటి వేషాలు, వీధినాటకం, యక్షగానం ఇలా ఎన్నో రకాల జానపద నాట్యరీతుల అభివృద్ధికి, ప్రచారానికి పాటుపడుతున్నాను. ముఖ్యంగా ఆంధ్రుల వివిధ నాట్యకళా సంప్రదాయాల సమున్నతికి,

ఆంధ్రుల లాస్యాభినయ కళాభివృద్ధికి, వాటి ప్రచారానికి కృషి చేయడంలో నిమగ్నుడనై ఉండి పోయాను. తారామతి, ప్రేమావతుల దివ్య మందిరాల గురించి మరిచిపోయాను.

1997 ఆగష్టు 15 వ తేదీ సాయంత్రం ఆ దివ్య మందిరాలు నన్ను ఆహ్వానిస్తున్నట్టు నాకు అనిపించింది. అవి నా కోసం వేచి యున్నట్టుగా భావించి, రాజభవన్‌లోని తేనీటి విందుకు వెళ్లకుండా వర్షంలో ఆ శిధిల మందిరాల వద్దకు వెళ్ళాను.

ఇప్పటికే చాలా జాప్యం చేశానని ఆ మందిరాలు నన్ను నిలదీసినట్టు నాకు అనిపించింది. నాలో ఏదో చెప్పలేని స్పందన కలిగింది. అందువల్ల ఆ మందిరాలకు ఏమైనా చేయాలని నిశ్చయించుకొన్నాను. ఆ మందిరాలు వాటి పూర్వ ఔన్నత్యాన్ని, శోభను తిరిగి పొంది మళ్లా ప్రకాశించాలి ఇప్పుడు నా ప్రయత్నం అదే.

చరిత్ర పుటల్లో మరుగు పడిన తారామతి ప్రేమావతుల సంగీత నృత్యకళల గొప్పతనాన్ని లోకానికి ఎరుక పరచాలని , వారి కళా తపస్సుల గురించి లోకం తెలుసుకొనాలని 1997 ఆగష్టు 15 తేదీ సాయంత్రం ఆ వర్షంలో నిలబడి నిశ్చయించుకొన్నాను.

అందులో ఒక భాగమే ఈ నవల, కాదు నవలిక.

అబ్దుల్లా కుతుబ్‌షా

గోలకొండ చరిత్రలో మరువరాని శుభదినం, దానిని స్వర్ణాక్షరాలతో చరిత్రకారులు లిఖించదగిన సుదినం 21-11-1614. ఆనాటి అర్ధరాత్రి వరకు గోలకొండ నగరం ప్రశాంతంగా ఉంది. సరిగ్గా అర్ధరాత్రి సమయంలో ఉన్నట్టుండి ఒక్కసారి గోలకొండ కోటలో ఫిరంగులు ధన ధన మంటూ మ్రోగాయి. టపటప మంటూ తోపులు గూడా పేలాయి. వెనువెంటనే భేరీ, నగారా, సన్నాయుల సంగీతం వినవచ్చింది. వీటితోబాటు ఔట్లు, తారాజువ్వలు ఆకాశలంలోకి ఎగిరి, పేలి, రంగురంగుల వింత కాంతులను గగన వీధిలో వెదచల్లాయి. ఈ ఫిరంగుల, తోపుల, బాణాసంచాల మోతలకు, భేరీ నగారా, సన్నాయుల సంగీతాలకు గోలకొండ పురజనులు మేల్కొని, ఇళ్లలో నుంచి బైటకు వచ్చి, ఆకాశం వైపు వింతగా చూస్తూండిపోయారు.

ఇంతలో కోటలో సంగీత, నృత్య కచేరీలు ప్రారంభమయ్యాయి. ఆ మధుర గానాలను వింటూ ప్రజలు తన్మయులయ్యారు. ఈ వేడుకలన్నీ ఎందుకో తెలియక ప్రజలు విస్మయులై ఒకరితో ఒకరు ముచ్చటించుకొనడం ప్రారంభించారు.

అంతలో రాజభటులు గుర్రాల మీద స్వారీ చేస్తూ వచ్చి, దండోరాలు, డప్పులు వాయిస్తూ "ప్రజలారా! వినండి! ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, మన పాదుషా సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా వారికి కుమారుడు జన్మించాడు. అందుకే ఈ వేడుకలన్నీ జరుగుతున్నాయి" అంటూ పట్నమంతా ప్రచారం చేశారు. ఇంక ఆనాడు ప్రజలు ఆనందానికి అవధులు లేకపోయాయి. గోలకొండ పురజనులందరూ ఈ పుత్రోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. కొందరు ఆడేరు, కొందరు పాడేరు. కొందరు ఆనందంగా గెంతులు వేశారు. స్త్రీలు, పురుషులు అన్న తేడా లేకుండా, పిల్లలు, పెద్దలు అన్న భేదం లేకుండా ప్రజలందరూ తెల్లవార్లూ వివిధ వినోదాలతో కాలం గడిపి, ఆనందించారు.

కోటలో సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షాకు, ఆయన బంధు వర్గానికి, మిత్రులకు, దాసదాసీ జనానికి, సిబ్బందికి ఆనందం అవధులు లేకుండా పోయింది.

పుట్టిన పసివానికి నీళ్లుపోసి, చీనీ చీనాంబరాలు, దక్కా మజ్లీను బట్టలు వేసి అమర్చిన శయ్యపైని తల్లి హయాత్ బక్షీ బేగమ్‌ను పడుకొనబెట్టి, ఆమె ప్రక్కకు ఆ పసికందును చేర్చారు. ఆ తల్లి తన ప్రసవ వేదనను మరచిపోయి, తన కుమారుని అక్కున చేర్చుకొని, ముద్దు పెట్టుకొని ఆనంద పరవశురాలైంది.

తెల్లవారేసరికి మంత్రులు, సామంతులు వచ్చి, బంగారు తూగుటుయ్యాలలో నిద్రిస్తున్న పసిబాలుని చూసి "అపరంజి బొమ్మలా మెరిసి పోతున్నా"డని మెచ్చుకొన్నారు. పిల్లవానికి కానుకలు సమర్పించారు.

పాదుషా వారి ఆజ్ఞ మేరకు ఆస్థాన జ్యోతిష్య పండితులు వచ్చి, ఆ బాలుని ముఖ వర్చస్సు చూసి ఆశ్చర్యపోయారు. చందమామ వంటి గుండ్రని ముఖం, విశాలమైన పాల భాగం, కలువరేకుల వంటి

కళ్ళు, పర్షియా గులాబి రేకుల వంటి ఎర్రని పెదవులు గల ఆ పసికందుని అందాన్ని చూసి, ఆనందించి వారు పొంగిపోయారు. పొగడసాగారు.

"పాదుషావారు తమ పుత్రరత్నాన్ని చూడాలని వేగిరపడుతున్నారు. పిల్లవాని జాతక రీత్యా వారెప్పుడు ఆ బాలుని చూడవచ్చో చెప్పండి" అన్నాడు మంత్రి. వెంటనే జ్యోతిష్కులు లెక్కలు కట్టి, జాతకచక్రాలు వేసి, మీనమేషాలు లెక్క పెట్టడం మొదలు పెట్టారు. వారు ఏమి చెప్తారా అని ఆతురతతో సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా వారు వారి వంకే చూస్తూ కూర్చున్నారు. ఆ జ్యోతిష్య పండితులు వారిలో వారు చర్చలు జరుపుతూ, పాదుషావారికి ఏమి విన్నవించాలో తెలియక మధన పడుతున్నారు. ఖిన్న వదనులై వారు కూర్చుండిపోయారు. పాదుషావారిలో ఆత్రుత పెరిగి మంత్రి వైపు చూశారు. ప్రధాన జ్యోతిష్య పండితుని వైపు మంత్రి చూసి, "యువరాజా వారి జాతకం ఏమిటో త్వరగా చెప్పండి" అని ఆదేశించాడు. ఆ వృద్ధ జ్యోతిష్కుడు నోటమాట రాక తటపటాయించాడు. పాదుషావారు మళ్లా మంత్రివైపు చూశారు. "అయ్యా! పండితులవారూ! ప్రియమైనా, అప్రియమైనా ఉన్నదున్నట్టుగా మీరు ఆ యువరాజు జాతకం చెప్పక తప్పదు. పాదుషావారు వినక తప్పదు. కనుక సంకోచించకుండా వెంటనే చెప్పండి. పాదుషావారు తమ కుమారుని చూడాలని వేగిరపడుతున్నారు" అన్నాడు మంత్రివర్యుడు.

" మహారాజా! బాలుని జాతకం చాలా గొప్పది. ఈ యువరాజావారు చాలా అదృష్టవంతులు. గోలకొండ రాజ్యాన్ని దీర్ఘకాలం పాలించి మీ వంశానికి వన్నె తేగలవారు. ఇంత గొప్ప జాతకుడు మీ కుతుబ్‌షాహి వంశంలో ఇంతవరకు జన్మించలేదు. ఇకముందు జన్మించగలడని చెప్పడం కష్టం " అన్నాడా వృద్ధ జ్యోతిష్కుడు.

"ఇంత మంచి విషయం చెప్పడానికి ఎందుకు తటపటాయించారు? ఇంత గొప్ప జాతకం చూసి, మీరు ఆశ్చర్యపోయి నోటమాట రాకుండా ఉండి పోయారా? అయ్యుంటుంది!" అన్నాడు మంత్రివర్యుడు.

"మహారాజా! ఇంతవరకు ఇటువంటి గొప్ప జాతకాన్ని నేను వెయ్యలేదు; చూడలేదు. అయితే ప్రభువుల వారు మన్నించాలి..."

"ఊ, చెప్పండి ఏదో దాస్తున్నారు. ఏమీ దాచకుండా ఉన్నదున్నట్టుగా చెప్పండి. ఏదైనా అనర్ధదాయకమైనదుంటే అది మీ తప్పుకాదు. అది బాలుడు జన్మించిన ముహూర్తం తప్పు. కనుక భయం లేకుండా చెప్పండి" అన్నా డొక రాజ బంధువు.

"ప్రభువులవారు మన్నించాలి; బాలుని జాతకం చాలా గొప్పగా ఉన్నా....." "ఊ... చెప్పండి సందేహించకండి. దేనినైనా విని మేం తట్టుకోగలం" అని చివరకు సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా వారే స్వయంగా అన్నారు. "ఈ బాలుడు పుష్యమి నక్షత్రం రెండవ పాదంలో జన్మించాడు. అందువల్ల ప్రభువుల

వారు క్షమించాలి. తండ్రికి మారకముంది!" అన్నాడు జ్యోతిష్కుడు. పాదుషావారు మంత్రివర్యుని వైపు చూశారు.

"దీనికి శాంతి ఏమీ లేదా? చూడండి. గ్రంథాలన్నీ తిరగవేసి చూడండి" అన్నాడు మంత్రివర్యుడు.

"ఉంది ప్రభూ! శాంతిని చెయ్యాలి. హోమాలు చెయ్యాలి. చేసినా..."

"ఊ ఆగేరేం? చెప్పండి ఇంకేం చెయ్యాలో."

"దీనికి ఒక్కటే విరుగుడు. ఈ బాలునికి పన్నెండేండ్లు నిండేవరకు ప్రభువుల వారు ఈ బాలుణ్ణి చూడరాదు. చూస్తే ప్రభువుల వారికి గండం తప్పదు" అని ఉన్న విషయం చల్లగా చెప్పాడా జ్యోతిష్కుడు.

ఈ మాటలు విన్న పాదుషావారు ఒక నిమిషం నిశ్చేష్టులై ఉండిపోయారు. ఆ తర్వాత ఆయన తేరుకొని "విధి వ్రాతను ఎవరు తప్పించగలరు? ఈ యువరాజు బాగుంటే మాకు చాలు. ఈ పన్నెండేండ్లు ఈ బాలుణ్ణి నాకు దూరంగా ఉంచమంటారా? అలాగే ఉంచుదాం. ఈ యువరాజు ఎక్కడుండినా, ఎక్కడ పెరిగినా, బుద్ధిమంతుడై, విద్యావంతుడై, క్షేమంగా ఉండి, గోలకొండ రాజ్యానికి ఆదర్శ చక్రవర్తిగా ఉండి, కీర్తి తెచ్చుకొంటే అదే మాకు పదివేలు. ఇంకా ఏమైనా ఉందా? ఇంకా ఏమైనా చెయ్యాలా? చెప్పండి".

"ప్రభువుల వారు మన్నించాలి. ఈ బాలుడు ఎవరి వద్ద ఉంటే వారు మరణిస్తారు. కనుక ఈ బాలుణ్ణి ప్రభువుల వారు ఎలా రక్షిస్తారో! ప్రభువుల వారే నిర్ణయించాలి."

"అలాగే చేస్తారు ప్రభువుల వారు ఇంకా, ఏమైనా ఉందా?" అని అడిగాడు మంత్రివర్యుడు.

"ప్రభువుల వారు దైవభక్తి పరాయణులు. నిత్యం నమాజ్ చేస్తుంటారు. ఖురాన్ చదువుతూ ఉంటారు. కనుక అల్లా వారిని రక్షిస్తాడు. కనుక ప్రభువుల వారు ఒక మసీదును కట్టిస్తే కొంత శాంతి కలుగుతుంది. ప్రభువుల వారికి, యువరాజా వారికి, గోలకొండ సామ్రాజ్యానికి మేలు కలుగుతుంది. మక్కాలో గల మసీదు వంటి మసీదును ప్రభువులు నిర్మిస్తే, ఈ పన్నెండేండ్లు ఇట్టే గడిచిపోతాయి" అని జ్యోతిష్కుడు చెప్పాడు. పాదుషావారు మంత్రివైపు చూశారు.

"ప్రభువుల వారు అంగీకరించారు. అలాగే చేద్దాం."

"మంత్రివర్యా! ఈ సాయంత్రం నిండు సభ ఏర్పాటు చెయ్యండి. ఈనాటి సభకు కవులు, పండితులు, విద్యావేత్తలు, మతాధికారులు, మౌల్వీలు, మొదలగు పెద్దల నందరినీ ఆహ్వానించండి. ఆ సభలో తగిన నిర్ణయం తీసుకొందాం. ఈ జ్యోతిష్కులకు మెండుగా కానుక లిచ్చి పంపించండి" అని ఆజ్ఞాపించి, మహమద్ కుతుబ్‌షా వారు వారి మందిరానికి వెళ్ళిపోయారు.

"ఈ బాలచంద్రుణ్ణి చూడడానికి పాదుషా ప్రభువులు ఇంకా ఎందుకు రాలే"దని రాణి హయత్ బక్షీ బేగం ఒక దాసిని అడిగారు.

"అమ్మా! ఏం చెప్పమంటారు? యువరాజావారి జన్మ నక్షత్రం రీత్యా ప్రభువుల వారు యువరాజావారిని చూడరాదని జ్యోతిష్కులు సెలవిచ్చారుట. అందుకని ప్రభువుల వారు రాలేదు" అంటూ తాను విన్నది ఆ దాసి చెప్పింది.

ఆ వార్త వినగానే ఆ మాతృమూర్తి హయాత్ బక్షీ బేగం వారి నేత్రాలు అశ్రుపూరితాలైనాయి. "విధి వ్రాత తప్పించనెవరి వశం" అని ఆమె మనస్సులోనే అనుకొని బాధపడ్డారు.

ఆనాటి సాయంత్రం కోటలో దర్బారు ఏర్పాటు చేయబడింది. గోలకొండ పట్నంలోని కవులు, పండితులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పురప్రముఖులు ఆ దర్బారుకు వచ్చారు. పాదుషావారు ఆ సభకు రాగానే అందరూ లేచి, నిలబడి పాదుషావారికి సలాం చేశారు. పాదుషావారు సింహాసనం మీద ఆసీనులైన పిదప అందరూ కూర్చున్నారు. పాదుషావారు మంత్రివర్యుల వైపు చూశారు.

"మన పాదుషా వారికి రాత్రి కుమారుడు కలిగా డన్న శుభవార్త మీ అందరికి తెలిసిన విషయమే. ఈ శుభ సమయంలో మన పాదుషా వారు ఈ సామ్రాజ్యంలో ఒక మక్కా మసీదును నిర్మించదలచుకొన్నారు. ఎవరైతే గత పన్నెండు సంవత్సరాలు క్రమం తప్పకుండా నమాజ్ చేశారో వారు ముందుకు వస్తే, వారి చేత ఈ మసీదుకు శంఖుస్థాపన వారు చేయిస్తామని సెలవిస్తున్నారు. అలాంటి వారు ఈ సభలో ఎవరైనా ఉంటే లేచి నిలబడవలసినదిగా కోరుతున్నాను" అని మంత్రివర్యుడు ప్రకటించాడు.

ఎవ్వరూ ముందుకు రాలేదు. అప్పుడు మహమ్మద్ కుతుబ్‌షా వారే సింహాసనంపై నుండి లేచి, నిలబడ్డారు. సభలోని వారందరూ లేచి నిలబడ్డారు. మేము గత పన్నెండు సంవత్సరాలకు మించి క్రమం తప్పకుండా నమాజ్ చేస్తూ వస్తున్నాము. కనుక మేమే ఈ నూతన మసీదుకు శంకుస్థాపన చేస్తాము. మక్కా మసీదు వంటి మసీదును నిర్మిస్తాము. కనుక దానికి మక్కామసీదు అని పేరు పెడతాము. "హే అల్లా!" అని ఒక్కసారి అల్లాను ప్రార్థించి, "అయితే మాకు ఇప్పు డొక సమస్య వచ్చింది. నేడు జన్మించిన యువరాజును మేము పన్నెండు సంవత్సరాలు చూడకుండా దూరంగా ఉండాలి. కనుక మీలో ఎవరైనా ముందుకు వచ్చి, ఆ బాలుని రక్షణ భారం వహించాలని కోరుతున్నాను. అయితే ఆ బాలుని జాతకరీత్యా ఆ బాలుని రక్షణ భారం వహించేవారు మరణించే ప్రమాదముంది గనుక అందుకు సిద్ధపడ్డవారే ముందుకు రావలసినదిగా కోరుతున్నాము," అంటూ ఏ దాపరికం లేకుండా నిండు సభలో పాదుషావారు తమ కోర్కెను వెల్లడించారు.

యువరాజుని పెంపక భారం వహిస్తే ఆర్థికంగా లాభముంటుందని కొందరు ఆశపడ్డారు గాని మరణ భయంతో వారు వెనుకంజ వేశారు. అప్పుడు రాజబంధువైన కుతుబుద్దీన్ నియమతుల్లా ముందుకు వచ్చి,

పాదుషా వారికి నమస్కరించి "ప్రభువుల వారు చిత్తగించాలి. ప్రభువుల వారికి అభ్యంతరం లేకపోతే యువరాజావారి రక్షణ భారం నేను వహిస్తాను. వారిని భద్రంగా పెంచి, పెద్దచేసి ప్రభువుల వారికి అప్పగిస్తాను" అన్నాడు.

"నియమతుల్లా! ఈ బాలుణ్ణి ఎవరు పెంచితే వారికి మరణం సంభవించవచ్చును. ఆ విషయం నీకు గుర్తుందా!" అని పాదుషావారు అతన్ని అడిగారు.

"పాదుషా వారు మన్నించాలి! ఆ విషయం నాకు తెలుసు ప్రభూ! ఏదో ఒక రోజున నేను మరణించక తప్పదు. నా ప్రభువుల వారి సేవలో మరణించడం కన్నా ఇంకా గొప్ప కార్యమేముంది? ప్రభువుల వారు దయతో యువరాజా వారిని నాకు అప్పగించవలసినదిగా ప్రార్థిస్తున్నాను" అని నియమతుల్లా అన్నాడు. అతని రాజభక్తిని సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా వారు మెచ్చుకొని, నిండు సభలో అతనిని యువరాజుని సంరక్షకునిగా ప్రకటించారు. నియమతుల్లా స్వామి భక్తిని సభికులందరు కొనియాడారు.

యువరాజుని రక్షణభారం వహించిన నియమతుల్లా రెండేళ్ళ తర్వాత మరణించాడు. ఆ తర్వాత ఆ బాలుని పెంచిన మీర్జా షహస్థానీ మరి ఆరు సంవత్సరాల తర్వాత మరణించాడు. అతని తర్వాత ఆ బాలుని సంరక్షించిన ఖాజా ముజఫర్ రెండేళ్ల తర్వాత మరణించాడు. అటు పిమ్మట మౌలనా హుస్సేన్ షిరాజ్ ఆ బాలునికి విద్యాబుద్ధులు చెప్పి, పెంచి, పెద్దవానిని చేశాడు. ఆ బాలునికి 12 ఏళ్ళు నిండాయి. ఇంక ఆ బాలుని సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షాకు అప్పగించాలని అతడు అనుకొంటూ ఉండగా అతడు కూడా చనిపోయాడు.

జ్యోతిష్కులు చెప్పిన 12 ఏండ్ల గడువు తీరిపోయిన తర్వాత సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా జ్యోతిష్కులను సంప్రదించి, ఒక మంచి రోజున తన కుమారుని తన వద్దకు రప్పించుకొన్నారు. తొలిసారి ఆ బాలుని చూసి ఆ పాదుషావారు పరవశులయ్యారు. అడపా తడపా వెళ్లి తమ కుమారుని చూసి, వస్తున్న మా సాహెబా, ఇంక తన కుమారుడు తన వద్దనే ఉంటాడన్న సంతోషంతో ఆ కుర్రవానిని కౌగిలించుకొని ముద్దుల వర్షం కురిపించారు.

జ్యోతిష్కులు నిర్ణయించిన శుభముహూర్తాన ఆ కుర్రవానికి నామకరణం చేసి, అతనికి అబ్దుల్లా కుతుబ్‌షా అని పేరు పెట్టారు ఆ తల్లిదండ్రులు.

పుత్రవాత్సల్యం తీరకముందే మరికొద్ది రోజుల తర్వాత జ్వరపీడితుడై మహమ్మద్ కుతుబ్‌షా మరణించారు. "దైవ సంకల్పాన్ని ఎవరు కాదనగలరు? విధి వ్రాతను ఎవరు తప్పించగలరు?" అని మా సాహెబా తలపోసి, తన కుమారునికి వెంటనే 12వ యేటనే పట్టాభిషేకాన్ని ఘనంగా చేయించింది. "అబ్దుల్లా కుతుబ్‌షా ప్రభుత్వం కలకాలం వర్ధిల్లుగాక!" అని రేనఖు, "అబ్దుల్లా కుతుబ్‌షా ప్రభుత్వం దక్కనులో వర్ధిల్లుగాక!" అని ఆస్థాన కవి ఫకీర్ సిరాజ్‌లు ఆశీర్వదించారు. ఆమె అతని తరఫున రాజ్యాన్ని ఏలుతూ వచ్చింది.

తన కుమారుడు పెరిగి పెద్దవాడై రాజ్యభారం చేపట్టబోయే ఈ సంతోష సమయంలో తన భర్త లేనందుకు ఆమె అప్పుడప్పుడు కంటతడి పెట్టేది. "విధి లిఖితాన్ని ఎవరు మార్చగలరు? చింతించి ఫలితమే ముంటుంది?" అని అత్తగారు ఖానిమ్ ఆగా ఆమెను మందలిస్తూండేది. వారిద్దరూ అబ్దుల్లా పైని అనురాగం పెంచుకొని, అతనిని కంటికి రెప్పలా చూచుకొంటూ ఉండేవారు. వారివద్ద అతడు ముద్దు మురిపాలతో పెరుగుతూండినందు వల్ల కోటలో అతని మాటకు ఎదురు లేక పోయింది. అతడు ఆడింది ఆటగా, పాడింది పాటగా మారిపోయాయి. చిన్ననాటి నుండి అతడు విందులు, వినోదాలకు, సంగీత నృత్యాలకు, అలవాడు పడిపోయాడు. అతనికి వేట ఒక వ్యసనమైంది. రాజుల కుండవలసిన లక్షణాలు ఇవే నన్న భ్రమకు అతడు లోనయ్యాడు. అందువల్ల స్వేచ్ఛగా తన పరివారంతో దేశాటన చేసి వస్తూండేవాడు. ఒక్కొక్కప్పుడు అతడు ఎవరికీ చెప్పకుండా గుర్రమెక్కి సవారీ చేసుకొంటూ ఎక్కడెక్కడో తిరిగి వచ్చేవాడు. అతని కోసం అతని పరివారం వెతుక్కొంటూ వెళ్లవలసి వచ్చేది. అతనికోసం వారు వెతుకుతూంటే వారిని తప్పించుకొని తిరగడం అతనికి ఆనందంగా ఉండేది. చివరికి అతనికి అదొక ఆట అయింది.

ఒకనాటి సాయంత్రం తన పరివారంతో అబ్దుల్లా కుతుబ్‌షా వేటకు అడవికి వెళ్లాడు. తన పరివారాన్ని ఏడిపించాలన్న వింత కోరిక అతనికి పుట్టి, ఎవరికీ కనబడకుండా వెళ్లి, ఒక పెద్ద చెట్టు ఎక్కి, కొమ్మల చాటున నక్కి కూర్చున్నాడు. తన పరివారం తన కోసం వెతుకుతూ ఉంటే ఆ కొమ్మల చాటు నుండి చూస్తూ ఆనందించాడు. వారు అలా వెతుకుతూ, వెతుకుతూ అతనికి దూరంగా వెళ్లిపోయారు. వారు మళ్లా వస్తారన్న నిబ్బరంతో అతడలాగే ఆ చెట్టుపైని కూర్చున్నాడు. ఇంతలో ఆకాశంలో మేఘాలు కమ్ముకొన్నాయి. పొద్దు కుంకకుండానే బాగా చీకటి పడింది. బోరున వర్షం కురవ నారంభించింది. తనకోసం ఎవరూ అటు రాలేదు. ఎవరి పిలుపూ తనకు వినబడలేదు. తన పిలుపులు వారెవ్వరికీ వినబడినట్టు లేదు. ఇంక చేసేది ఏమి లేక, ఖిన్నుడై, ఆ చీకటిలో వర్షం పడుతూంటే ఆ చెట్టుకొమ్మల చాటున ఏకాకిగా ఉండిపోయాడు. కాని భయపడలేదు.

ఆ రాత్రి అతని పరివారం ఆ వర్షంలో అతనికోసం వెతికి వెతికి వేసారి గోలకొండ కోటకు వెళ్లి, పై అధికారులకు సంగతంతా విన్నవించుకొన్నారు. ఈ వార్త మా సాహెబాకు తెలిసి బెంగపెట్టుకొంది. మంత్రి వర్యులకు, సైన్యాధిపతికి కబురు చేసి పిలిపించింది. తన కుమారుని వెతికి, తీసికొని రమ్మనమని ఆదేశించింది. ఆ తర్వాత ఆమె కోటలోని తన ప్రార్థనా మందిరానికి వెళ్లి, మోకరిల్లి "అల్లా! నా కుమారుని రక్షించు. నా కుమారుని నాకు సురక్షితంగా అప్పగించు, అత డెక్కడ దొరుకుతాడో అక్కడ నీపేర ఒక మసీదును నిర్మిస్తాను. అక్కడ బాటసారుల కోసం, సన్యాసుల, ఫకీర్లకోసం ఒక ధర్మసాల నిర్మిస్తాను. అక్కడ నిత్య అన్నదానం ఏర్పాటు చేయిస్తాను. నా కుమారుని రక్షించి, నాకు సురక్షితంగా అప్పగించు" అంటూ ఆమె అల్లాను వేడుకొని మొక్కుకొంది.

తెల్లవారకముందే సైన్యసమేతంగా మంత్రి, సైన్యాధికారి రాజపరివారంతో ఆ అడవికి వెళ్లి అబ్దుల్లాకోసం వెతకనారంభించారు.

ఆ రాత్రంతా వర్షంలో చెట్టుకొమ్మల మధ్య కూర్చున్న అబ్దుల్లాకు తూర్పు దిక్కున వెలుగు గోచరించింది. దూరంగా తన మనుష్యుల పిలుపులు వినబడ్డాయి. అప్పు డతడు కొమ్మల చాటు నుండి వెలుపలికి వచ్చి, తన పరివారం కోసం ఎదురు చూస్తూ ఒక పెద్ద కొమ్మపైని కూర్చున్నాడు.

"బాబూ! అబ్దుల్లా! ఇక్కడ కూర్చున్నావా నాయనా! రాత్రంతా మేమెంత కంగారు పడ్డామో నీ కేం తెలుసు? రా బాబూ! చెట్టు దిగు! మీ అమ్మగారు మీకోసం దిగులుతో ఎదురు చూస్తున్నారు!" అన్నాడు మంత్రివర్యుడు. ఆ పరివారంలోని వారందరినీ చిరునవ్వుతో పలకరించి, చెట్టుదిగి వచ్చాడు అబ్దుల్లా. తర్వాత తడిసిపోయిన తన దుస్తులు మార్చుకొని, గుర్రమెక్కి తన పరివారంతో గోలకొండ కోట చేరుకొన్నాడు. తిన్నగా అంతఃపురానికి వెళ్లాడు. వేయికళ్లతో తనకోసం ఎదురు చూస్తున్న తన తల్లివద్దకు వెళ్లాడు. ఆనంద బాష్పాలను రాలుస్తూ మా బేగం సాహెబా తన కొడుకును కౌగిలించుకొని, ఒళ్లంతా తడిమిచూచి, "క్షేమంగా ఉన్నావా నాయనా!" అని అడిగింది.

"అడవిలో నీకు రాత్రి భయం వేయలేదా?" అని నాయనమ్మ ఖాసిం ఆగా మనుమణ్ణి అడిగింది.

"ఈ అబ్దుల్లా పాదుషా ఇటువంటి వాటికి భయపడతా దనుకొన్నావా నాయనమ్మా?" అని ఎదురు ప్రశ్న వేశాడు అబ్దుల్లా.

"రా బాబూ! అల్లాని ప్రార్థించి వద్దాం" అంటూ తల్లి మా బేగం సాహెబా అతన్ని ప్రార్థనా మందిరానికి తీసికొని వెళ్లింది.

ఆనాడు పేదలకు అన్నదానం చేసింది మా బేగం సాహెబా. తన కుమారుని వెతికి, క్షేమంగా తీసికొని వచ్చిన వారికి ఆమె ధారాళంగా బహుమతుల నిచ్చింది. అతడు దొరికిన చోటుకు వెళ్లి అక్కడ మసీదు నిర్మాణానికి, సరాయి నిర్మాణానికి శంఖుస్థాపన చేసి ఆమె వచ్చింది.

కాల చక్రం తిరుగుతూనే ఉంది. అబ్దుల్లా పెరిగి పెద్దవాడయ్యాడు. తమ వంశంలో అతనంత అందమైన వాడు ఇంతవరకు ఎవరూ పుట్టలేదని మా సాహెబా తన మనస్సులోనే ఆనందిస్తూండేది. అతని వదలంతా తడిమి అతన్ని ముద్దులతో ముంచేత్తిది. అతడు ఒంటరిగా కూర్చున్నప్పుడు అతణ్ణే తదేకంగా చూస్తూండేది; అతని ఆకర్షణీయమైన కలువ రేకుల వంటి కళ్లను, విశాలమైన ఫాలభాగాన్ని, కొనదేరిన నాసికను దూరం నుండి చూసి మురిసిపోయేది. అతడు ఏవో కలలు కంటూ, కవితా లోకంలో విహరిస్తున్నట్టుగా ఆమె ఊహించుకొనేది. అలా ఆమె చూస్తూండగనే అతనిలో యౌవనం అంకురించింది. అతని కోర్కెలు రెక్కలు విచ్చి విహరించసాగాయి. అతడు తన కోర్కెలకు నూతన భాష్యాలు చెప్పుకొనేవాడు. ఆ భాష్యాలకు ఎప్పటికప్పుడు నూతన అర్థాలు అతనికి స్ఫురించేవి. కండలు తిరిగిన తన శరీరాన్ని ఒంటరిగా అద్దంలో చూసుకొని, వివిధ భంగిమల్లో తన అందాన్ని పరీక్షించుకొని, ఏవేవో ఊహించుకొంటూ

ఉండేవాడు. ఉద్యానవనంలో విహరిస్తూ, అందమైన పుష్పాలను తిలకిస్తూ, అవేవో నూతన సందేశాలను తనకు అందిస్తున్నట్టుగా భావించి ఊహాప్రపంచంలో మునిగిపోయేవాడు. అతనికి తెలియకుండా మా సాహెబా అతన్ని గమనిస్తూండేది. అతనికి యుక్తవయస్సు వచ్చిందని ఆమె గ్రహించి, అతనికి రాజ్యభారం అప్పగించదలచింది. ఆమె అత్తగారు ఖానిం ఆగా ఆమెతో ఏకీభవించి, మంచి పిల్లను చూసి పెళ్లి చేయమంది. ఇంతలో హయాత్‌బేగం తలపెట్టిన మసీదు, సరాయుల నిర్మాణం పూర్తయింది. అక్క డొక మోట బావిని ఆమె తవ్వించింది. అక్కడ నుండి గోలకొండ కోటకు సొరంగం తవ్వించింది. ఆ మసీదుకు చుట్టూండిన అడవి అదృశ్యమయింది. కొందరు వచ్చి అక్కడ నివసించడం మొదలు పెట్టారు. కొన్నాళ్ళకు అక్కడొక పల్లె ఏర్పడింది. అక్కడివారు దానికి "హయాదాబాద్" అని పేరు పెట్టారు. మరికొన్నాళ్లకు అది హయాత్‌నగర్‌గా రూపొందింది.

అబ్దుల్లా సుఖమయ జీవితానికి అలవాటు పడ్డాడు. షికారులు, యాత్రలు అంటూ ఎక్కడెక్కడో తిరుగుతూ భోగలాలసుడై, విలాసంగా కాలం గడుపుతూ ఉండేవాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి హయాత్ బక్షీ బేగం అతనికి రాజ్యభారాన్ని అప్పగించదలచి, పేష్వా మహమదుబిన్ ఖానును రప్పించి అతనితో ఆమె సంప్రదించింది.

"మహారాణీ! విలాస జీవితం నుండి పాదుషావారి దృష్టిని రాజ్య నిర్వహణ వైపుకు మళ్ళించాలి. అందుకు మీరే తగినవారు" అన్నాడు పేష్వా.

"సరే; ఎల్లుండి అబ్దుల్లా పుట్టినరోజు. ఈ పుట్టిన రోజు పండుగను హయాదాబాద్‌లో జరిపిద్దాం. అక్కడ అన్ని ఏర్పాట్లు చేయించండి" అని మాసాహెబా ఆ మంత్రివర్యుని ఆజ్ఞాపించారు. ఇంతలో అబ్దుల్లా అక్కడికి రానే వచ్చాడు.

"అబ్దుల్లా! ఎల్లుండి నీ పుట్టినరోజు. ఆ పండుగ హయాదాబాద్‌లో ఘనంగా చేయదలచాను. రేపు అక్కడికి మన ప్రయాణం సిద్ధంగా ఉండు" అని ఆమె కుమారుని ఆదేశించింది.

ఆ మర్నాడు హయాత్ బక్షీ బేగం, అబ్దుల్లా తమ బంధువులతోను, పరివారంతోను భూగర్భ మార్గం ద్వారా హయాతాబాద్ వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేయబడిన గుడారాలలో వారు బసచేశారు. ఆ మర్నాడు అబ్దుల్లా పుట్టినరోజు పండుగ విందులు, వినోదాలతో గడిచింది. హయాత్ బక్షీ బేగం చేసిన దానధర్మాలకు లెక్క లేదు. ఎంత డబ్బు ఖర్చయిందో ఎవరూ ఊహించలేకపోయారు. అక్కడ వారంతా పక్షం రోజులు గడిపారు. ఆ పక్షం రోజులు తల్లితో గూడ అబ్దుల్లా మసీదుకు వెళ్లి రోజుకు అయిదు సార్లు నమాజ్ చేశాడు.

ఆ తర్వాత వారంతా తిరిగి గోల్కొండ చేరుకొన్నారు. వచ్చిన నాటి నుండి హయాత్ బక్షీ తనతో గూడ అబ్దుల్లాను కోటంతా తిప్పి, ఆ కోటలోని ప్రతి మహలుకు, ప్రతి ప్రాంతానికి గల ప్రాముఖ్యాన్ని, వాటిలో గల రహస్యాలని అతనికి చెప్పింది. రాచరికపు కట్టుబాట్లు, నియమ నిబంధనలు, మర్యాదలు, అతిథి సత్కారాల

గురించి వివరించింది. పరాయి స్త్రీలను ఎలా గౌరవించాలో బోధించింది. కవులు, పండితులు, శాస్త్రకారులు, కళాకారులు మొదలైనవారిని ఎలా సమ్మానించాలో అతనికి ఆమె తెలియజెప్పింది.

"ఇప్పుడు ఇవన్నీ ఎందుకు చెప్తున్నావమ్మా?" అని అబ్దుల్లా తల్లిని అడిగాడు.

"బాబూ! నీ రాజ్య భారాన్ని ఇన్నాళ్లు నేను మోస్తూ వచ్చాను. ఇంక నీ రాజ్యాన్ని నీవే చూసుకోవాలి. నేను ముసలిదా న్నవుతున్నాను. ఇంకా ఎన్నాళ్లు నా కీ భారం?"

"అమ్మా! నీ వున్నన్నాళ్ళు ఈ రాజ్యభారం నీదే నమ్మా. నన్ను స్వేచ్ఛగా ఉండనియ్యి."

"బాబూ! నాకు విశ్రాంతి కావాలి. నీవు ఏదో ఒకనాడు ఈ రాజ్యభారాన్ని స్వీకరించక తప్పదు. కనుక ఇప్పటి నుండి నీవు అలవాటుపడాలి. ఎప్పుడూ నీకు నా సలహా సంప్రదింపు లుంటాయి. అబ్దుల్లా పాదుషా మంచివాడు అన్న పేరు తెచ్చుకో. కీర్తివంతుడవౌ. అదే నా కోరిక. అదే నా ఆశయం. ఇంక కాదనకు."

అబ్దుల్లా నివ్వెరపోయి, ఒక్క క్షణం ఆలోచించాడు. తల్లివైపు తదేకంగా చూశాడు. ఆమె తన తల్లిగా గాక రాజమాతగా గోచరించింది. తల్లియెడల అతని కున్న ప్రేమ గౌరవంగా మారిపోయింది. "అమ్మా!" అంటూ అతడు తన తల్లి కాళ్లపైని పడ్డాడు. ఆమె పాదాలపైని తల పెట్టాడు.

"బాబూ ! నీ నాయనమ్మ ఖానిం ఆగా మరణించారు గదా! ఆ స్థానం నేను స్వీకరించాలి. నా స్థానంలో ఒక పట్టపురాణి త్వరలో రావాలి" అంటూ మందహాసంతో ఆమె కుమారుణ్ణి ఆశీర్వదించింది.

అరుణోదయం

తూర్పున వేగుచుక్క పొడిచింది. తొలికోడి కూసింది. అబ్దుల్లా పాదుషావారి కోటలో నగారా మోగింది. సురనావాద్యం హాయిగా, తీయగా, సుతి మెత్తగా భూపాల రాగాన్ని ఆలపిస్తూంది. గోల్కొండ పురజనులకు రోజూ అదొక మేలుకొలుపు గీతం.

ప్రేమావతి నిద్రమేల్కొని, ఆ గీతాన్ని వింటూ, మంచం మీద కూర్చుంది. సిద్ధేశ్వరీ సుగుణవతి గూడ నిద్ర నుండి లేచివచ్చి, ప్రేమావతి ప్రక్కన మంచం మీద కూర్చుంది. తారామతి నిద్రనుండి లేచి, సురనావాద్య స్వరంతో తన స్వరాన్ని కలిపి మెల్లగా పాడజొచ్చింది.

"అమ్మా! ఆ షనాయి వాద్యం ఎంత మధురంగా ఉంది! అది రోజూ మనకు మేల్కొలుపు పాడుతూంది" అంది ప్రేమావతి తల్లితో.

"అంతేకాదు; నిద్రపోతున్న వారి మనస్సుల్ని మేల్కొలిపి, అది కర్తవ్యాన్ని ప్రబోధిస్తుంది" అంది సిద్ధేశ్వరి.

"నిజంగా నీవన్నట్లు ఉదయంపూట పాడే ఈ రాగాలు మనుష్యుల్ని మత్తులో నుండి లేపి కర్తవ్యాన్ని బోధిస్తున్నాయమ్మా!" అంది తారామతి తన పాటను ఆపి.

"అందుకే రాజులు, మహారాజులు మూడు వేళలా ఈ నగారాలను ఏర్పాటు చేశారు. సరే. ఇంక లేచి, వెళ్లి మీ కాలకృత్యాలు తీర్చుకొండి. మీ సంగీతం గురువుగారు వచ్చే వేళ అయింది" అని సిద్ధేశ్వరి కుమార్తెల నిద్దరిని హెచ్చరించి, పూజా మందిరంలోనికి వెళ్లి, ప్రమిదలోని వత్తిని వెలిగించి, తన మంగళ సూత్రాలను కళ్లకద్దుకొని "శీతలదేవి" విగ్రహానికి నమస్కరిస్తూ నించుంది.

ఏడు తరాలుగా వారింట ఆడపిల్ల పుట్టలేదు. తనూ, తన భర్త పాటించిన కఠోర దీక్షల వల్ల, శీతలదేవి అనుగ్రహం వల్లను ఈ యిద్దరు కవల పిల్లలు తనకు పుట్టారు. ఆ భార్యాభర్త లిద్దరు ఎంతో ఆనందించారు. కాని యానందం అట్టేకాలం ఆమెకు నిలువలేదు. ఆ యాడబిడ్డలు పుట్టిన ఇరవై యొకటో రోజున వారికి 'తారామతి, ప్రేమావతి' అని నామకరణం చేసి తొట్టిలో వేసిననాడే ఆయన తనను అర్ధరాత్రి వేళ నిద్రలేపి "సిద్ధేశ్వరీ! నీవు సుగుణవతివి, భక్తి సంపన్నురాలివి. అమ్మవారి అనుగ్రహం వల్ల ఈ కవల పిల్లలకు తల్లివయ్యావు. వీరు సరస్వతీ దేవికి రెండు నేత్రాలు. ఒకరికి సంగీతంలోను, మరొకరికి నాట్యంలోను మంచి శిక్షణ ఇప్పించు. మనం శీతల దేవిని ఏమని ప్రార్థించామో నీకు జ్ఞాపకముండే ఉంటుంది. మన ఇంట్లో ఆడపిల్ల పుడితే ఆ తల్లి సేవకు అర్పిస్తామని మనం మొక్కుకొన్నాం. ఒకరు కాదు ఇద్దరు ఆడపిల్లలు మనకు కలిగారు. కనుక వారిద్దరినీ సంగీత నృత్య కళాకారులుగా తీర్చిదిద్ది ఆ తల్లి సేవకు అంకితం చెయ్యి. మరచిపోకు" అని అన్నాడు సిద్ధేశ్వరి భర్త.

"ఈ యర్ధరాత్రి ఇదంతా ఎందుకు?" అని సిద్ధేశ్వరి అడిగింది.

"నేనింక ఆ దేవి చింతనతో కాలం గడపదలచాను. ఇంక వెళ్తాను. ఆ దేవి కరుణిస్తే మళ్లా వస్తాను" అంటూ అతడు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. సిద్ధేశ్వరి మూగవోయి, కన్నీరు కార్చింది.

"వద్దు; కన్నీరు కార్చకు, కంట తడిపెట్టకు, ఆనందంగా ఆ తల్లి సేవకు నన్ను సాగనంపు. ఆ దేవి నిన్ను చల్లగా చూస్తుంది" అంటూ అతడు నిదురబోతున్న తన కవల పిల్లల్ని ముద్దాడి, వీధి తలుపు తెరుచుకొని, ముందుకు అడుగు వేసి చీకట్లో కలిసి పోయాడు.

ఆనాటి నుండి, ఆ కవల పిల్లల్ని సిద్ధేశ్వరి పెంచి, పెద్ద చేసింది. తన భర్త కోర్కె ననుసరించి, వారికి విద్యాబుద్ధులు చెప్పి, సంగీత నృత్యకళలు నేర్పించి, గొప్ప కళాకారులుగా తీర్చిదిద్దింది. ఆ పిల్ల లిద్దరు వినయ విధేయలతో విద్యల నభ్యసించి, యుక్తవయస్కులయ్యారు. ఆ దేవి సమక్షంలో పూనిన దీక్ష కనుగుణంగా వారిద్దర్నీ ఆ దేవికి ఆమె అంకితం చేసింది. అయితే ఈ యానందాన్ని తనతో పంచుకొనడానికి తన భర్త ఆనాటి నుండి మరి కనబడలేదు. అదే తనకున్న పెద్దలోటు.

ప్రక్కగదిలో నుండి తారామతి సంగీత సాధన ఆమెకు వినిపించింది. సరస్వతీదేవి వీణలోని మాధుర్యమంతా తారామతి కంఠంలోనికి చేరినట్లుగా ఆమె గానం వినిపిస్తూంది. ఆమె పాట తనకు తీయగా వీనుల విందుగా ఉంది.

పూజా మందిరంలో నుండి తారామతి సంగీత సాధన చేస్తున్న గదిలోకి వెళ్లి, కొంతసేపు గురువుగారు చేయిస్తున్న సంగీత సాధన పద్ధతిని గమనించి, ప్రేమావతి నృత్యసాధనను చూడడానికి ఆమె వెళ్లింది.

ప్రేమావతి చిన్న కచ్చడం ధరించి, శరీరానికి తైల మర్దనం చేసుకొని, సాము చేసి, ఒడ్డోలగం ప్రారంభించింది. ఒడ్డోలగం నర్తకులకు చాలా ముఖ్యం. చాలా అవసరం. పురుషులు ఒక విధంగాను, స్త్రీలు వేరొక విధంగాను దీనిని అభ్యసిస్తారు. దీని వల్ల నర్తకులకు అంగసౌష్టవం చేకూరుతుంది. భంగిమల్లో పొందిక, హస్త పాద విన్యాసాలలో అందం కలుగుతాయి.

ప్రేమావతి చేస్తున్న ఒడ్డోలగ సాధనను గమనించిన తర్వాత సిద్ధేశ్వరి తన గదికి వెళ్ళి గ్రంథ పఠనం మొదలు పెట్టింది. తన కుమార్తెలను సంగీత నృత్య కళలలో తీర్చి దిద్దడానికి తాను స్వయంగా సంగీత నృత్య శాస్త్ర గ్రంథాలను అభ్యసించింది. ఒక సామాన్య గృహిణిగా ప్రారంభించిన తన జీవితాన్ని స్వయంకృషితో ఒక విజ్ఞాన గనిగా తీర్చిదిద్దుకొంది. తన కుమార్తెలు కేవలం సంగీత నృత్య కచ్చేరీలు చేయడమే కాక ఆ శాస్త్రాలలో వారు నిష్ణాతులు కావాలని కోరుకొంది. సంస్కారవంతులైన కళాకారులుగా వారిని చేయాలని ఆమె నిశ్చయించుకొంది. అంతేకాక సరస్వతీ దేవికి వారిని పూజా పుష్పాలుగా అర్పించడానికి వారి ఆత్మలు పరిశుద్ధంగా ఉండేటట్టు చూసింది. తన ఆశయసిద్ధి కోసం తాను తన కుమార్తెలకు ఆదర్శంగా ఉండేటట్టు జీవిస్తూ వచ్చింది. కొన్ని కఠోర దీక్షలు పాటించింది. సుఖ సంతోషాలను త్యాగం చేసింది. ఈ దీక్షలతో,

త్యాగాలతో మానసిక తృప్తిని పొందింది. త్యాగంలో ఉన్న ఆనందం భోగంలో లేదు అని ఆమె తెలుసుకొంది. తన కుమార్తెలు కేవలం సంగీత నృత్యకళాకారులుగానే కాక గొప్ప పండితురాండ్రు కావాలని ఆమె తలచి, తొలుత ఆమే ఆంధ్రగీర్వాణ భాషలతో బాటు పారసీకం, అరబ్బీ భాషలను గూడ అభ్యసించింది.

గోలకొండ కోటకు చేరువలోనున్న అభిరామ పురంలో వారు నివసిస్తూండడం వల్ల గోలకొండ కోటకు నిత్యం వచ్చే కవి పండితులను, వర్తక వాణిజ్య ప్రముఖులను వారు చూస్తూనే ఉన్నారు. అబ్దుల్లా కుతుబ్‌షా వారి దర్బారులో నిత్యం జరిగే కవి సమ్మేళనాల గురించి, పండిత గోష్టుల గురించి, శాస్త్ర చర్చల గురించి, నృత్యగాన కచ్చేరీల గురించి వారు వింటూనే ఉన్నారు.

అబ్దుల్లా పాదుషావారు నృత్య, సాహిత్య ప్రియులని వారికి తెలుసు. అనేక మంది కళాకారులు, కవులు, పండితులు, భారతదేశ నలుమూలల నుండి వచ్చి, గోలకొండలో స్థిరపడిన విషయం గూడా వారికి తెలుసు.

మా సాహెబా ఉదార స్వభావురాలు. దయామయి, సంప్రదాయాల సంరక్షకురాలు అని నలుగురూ చెప్పుకొనగా వారు విన్నారు.

యుక్తవయస్సులో నున్న తారామతి, ప్రేమావతులు పాదుషా వారి దర్బారువైపు ఆకర్షింపబడవచ్చును. ఆదర్శవంతమైన జీవితం కన్నా ఆనందమయజీవితం గడపాలన్న కోరిక యువతీయువకులకు ఉండడం సహజం. యౌవనంలో భోగలాలస జీవితాన్ని ఆశించని వారెవ్వరుంటారు? సౌందర్యంలోను, సంగీత నాట్యకళల్లోను, సంపూర్ణత్వాన్ని పొందిన తన కుమార్తెలు పాదుషా వారి దర్బారు వైపు ఆకర్షింపబడితే తన కర్తవ్యమేమిటి? ఈ సమయంలో తన భర్తే ఉంటే వారి బాగోగులను ఆయనే చూసుకొనేవాడు. ఆయన లేడు గనుక ఆ బాధ్యతను తానే నిర్వహించాలి. తన కుమార్తెలు విద్యలు నేర్చిన గురువులు విద్యావేత్తలయినా సామాన్య సంసారులు. ఉత్తమమైన ఉన్నతాశయాల గురించి వారేమి చెప్పగలరు? అందువల్ల వారి సంపూర్ణ బాధ్యతలను ఆ సిద్ధేశ్వరీ సుగుణవతే స్వయంగా స్వీకరించింది.

తన కుమార్తెలు శీతలదేవి వరప్రసాదులు. కనుక వారు ఆ దేవి సేవలోనే వారి జీవితాలను గడపాలని ఆమె కోరిక. అయితే తా మున్న వాతావరణంలో అది సాధ్యమా? భోగలాలసలతో తులతూగుతున్న పాదుషా వారి కోటకు చేరువలో నివసిస్తున్న తను తన కుమార్తెలను త్యాగ మూర్తులను చేయగలదా? చాలా కష్టం. ఈ విషయమై సిద్ధేశ్వరి నిత్యం మథన పడుతూనే ఉంది. చివరకు దైవం మీద భారం వేసి, సాధ్విగా మారిపోయింది.

ఈ విషయంలో తనకు తగిన సలహా యిచ్చే వా రెవరా అని ఆమె ఆలోచించసాగింది.

మా సాహెబా హయాత్ బక్షీ బేగం ఉత్తమురాలు. ఆదర్శవంతురాలు. పరుల భావాలను చక్కగా అర్థం చేసుకొనగల సంస్కారవంతురాలు. అని సిద్ధేశ్వరి విన్నది. ఆ యాదర్శమూర్తిని తన కుమార్తెలతో సహా సందర్శించి, ఆమె సలహాను తీసుకొనాలని సిద్ధేశ్వరీ సుగుణవతి నిశ్చయించుకొంది.

బాసర

"అమ్మా? నేటితో మా విద్యార్థి దశ ముగిసిందని మాగురువుగారు చెప్పారు" అని తారామతి, ప్రేమావతి తల్లి సిద్ధేశ్వరితో చెప్పారు.

"సంతోషమమ్మా! మనం రేపు బయలుదేరి బాసర వెళ్దాం."

"బాసరా! అక్కడికెందుకు?" అని ప్రేమావతి అడిగింది.

"గోదావరీ నదీ తీరాన ఉన్న ఈ బాసర క్షేత్రంలో వ్యాసమహర్షి ప్రతిష్ఠించిన జ్ఞాన సరస్వతీ పీఠముంది. మీ యిద్దరికి విద్యాబుద్ధులు నేర్పి మిమ్మల్ని గొప్ప కళాకారులుగా తీర్చి దిద్దుతానని దీక్షబూని ఈ దీక్షా కంకణాన్ని ధరించాను. మీ విద్యార్జన దశ ముగిసింది. గనుక దీన్ని ఆ బాసర జ్ఞాన సరస్వతీ దేవికి సమర్పించుకొంటాను. ఆవలి ఎల్లుండి మంచి రోజు. ఆనాడు మూలా నక్షత్ర మున్న రోజు. కనుక సరస్వతీ పూజకు మంచి రోజు."

"అలాగే నమ్మా తప్పకుండా వెళ్దాం" అంది తారామతి.

"నీవు విద్యావంతురాలివి కావాలని మరి మా అమ్మమ్మ ఈ దీక్ష పూనలేదా?" అని అడిగింది ప్రేమావతి.

"లేదమ్మా, మీరు పుట్టక పూర్వం నేనొక సామన్య గృహిణిని. నే నెప్పుడు ఇంటి గడపదాటి బయటకు వెళ్ల లేదు. మీ యిద్దరి భారం నా కప్పగించి మీ నాన్నగారు వెళ్లిపోయిన తర్వాత మీరూ నాలాగ సామాన్య స్త్రీలుగా ఉండరాదని ఈ దీక్ష బూనాను. బాసర సరస్వతీ దేవి కటాక్షం వల్ల నాలో మంచి మార్పు వచ్చింది. నా చిన్నప్పుడు మా పొరుగున ఉండిన అమ్మాయిలు సంగీతం, నాట్యం నేర్చుకొంటూంటే వెళ్లి చూస్తుండేదాన్ని. నాకు వినికిడి పాండిత్యం అబ్బింది. మీరు పుట్టిన తర్వాత సంగీతం సాధన చేశాను. ఒక నాట్యాచార్యుని వద్ద నాట్యం నేర్చుకొన్నాను. ఆ తర్వాత భరత, సంగీత శాస్త్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మీ యిద్దరికి ఆ విద్యలలో సహాయపడ్డాను."

"సంగీత నృత్య శాస్త్రాలలో నీకింత పాండిత్యం ఎలా వచ్చిందమ్మా?"

"అంతా స్వయం కృషి. అంతా ఆ బాసర సరస్వతీ దేవి దయ, ఆమె కటాక్షం వల్లనే కళల విశిష్టతను, పవిత్రతను, ఆదర్శాలను గ్రహించగలిగాను. ఏదైనా విద్యను నేర్చుకొనడం కన్నా దాన్ని దానం చేయడంలో ఆనందం ఎక్కువ ఉంటుంది" అంటూ సిద్ధేశ్వరీ సుగుణవతి తన విద్యార్జన గురించి వివరంగా చెప్పింది.

తమ తల్లి కోసం చేపట్టిన దీక్ష, చేసిన త్యాగాలు ఆ యిద్దరు సోదరులు ఆ రాత్రి తలపోసుకొంటూ నిద్రకు దూరమయ్యారు.

ఆ మర్నాటి ఉదయమే ఆ ముగ్గురు జోడు గుర్రాల బగ్గీలో బయలు దేరి, ఆనాటి రాత్రి ఇందూరులో మజిలీ చేసి, ఆ మరుసటి రోజున బాసర గ్రామం చేరుకొన్నారు. అక్క డొక సత్రంలో బస చేసి విశ్రాంతి తీసుకొన్నారు.

ఆ మరుసటి ఉదయం ఆ ముగ్గురు అభ్యంగన స్నానా లాచరించి, జ్ఞాన సరస్వతీ దేవాలయానికి వెళ్లారు. ఆనాడు శుక్రవారం గనుక ఆ సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆ గుడిలోని సప్తస్వర గంటలు లయానుసారం మోగుతున్నాయి. సరస్వతీ దేవిని ధ్యానిస్తూ సిద్ధేశ్వరీ దేవి గర్భగుడికి ఎదురుగా కూర్చుంది. తారామతి ప్రేమావతులు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి వచ్చారు.

ఇంతలో సరస్వతీ దేవి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కూర్చుండబెట్టి, భక్తులు ఆ పల్లకిని మోస్తుండగా అర్చకులు గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించడం కోసం సిద్ధంగా ఉన్నారు. సిద్ధేశ్వరితో బాటు తారామతి ప్రేమావతులు గూడా ఆ పల్లకి వెంట బయలుదేరారు. పల్లకి ముందు పెద్ద మేళం వారు వారి వాద్యాలను వాయిస్తున్నారు. వారు మధ్యమధ్య ఆగుతూంటే చిన్న మేళం వారు నృత్యం చేస్తూ వచ్చారు.

ప్రదక్షిణలు ముగిసిన తర్వాత భేరీ నగారాలు మ్రోగుతుండగా, వేదఘోషలో సరస్వతీ దేవికి హారతిచ్చారు. ఆ తర్వాత ఆలయ నర్తకి నృత్యపూజ చేయగా ఆనాటి ఉదయ ఆరాధనా కార్యక్రమం ముగిసింది.

ఆ యాలయ యాచారం ప్రకారం ఆ తల్లీ కూతుళ్లు బాసర గ్రామంలోని కొన్ని ఇళ్ళకు వెళ్లి, జోగి దండుకొని వచ్చి, భోంచేసి, ఆ గుడిలో ఆనాడు విశ్రమించారు.

ఆ మర్నాడు శనివారం, మూలా నక్షత్ర యుక్త శుభ దినం. ఆనాటి వేకువనే ఆ ముగ్గురు లేచి, స్నానాలు ముగించుకొని, నూతన పట్టు వస్త్రాలు ధరించి, సూర్యోదయ సమయానికి గుడికి వెళ్లారు. క్రితం రోజున సిద్ధేశ్వరి సమర్పించిన నూతన పట్టు వస్త్రాలతో సరస్వతీ దేవిని పూజారులు అలంకరించి, పూలమాలలు వేసి, పూజకు సిద్ధంగా ఉన్నారు.

ఈ ముగ్గురి సమక్షంలో వీరి పేరిట సరస్వతీ దేవికి అర్చనలు జరిగాయి. హారతి ముగిసిన తర్వాత ఈ ముగ్గురు హారతి పుచ్చుకొని, ప్రసాదం స్వీకరించి, పూజారులకు కానుక లిచ్చి, గర్భగుడి వద్ద కూర్చొని, సరస్వతీ దేవి పైని స్తోత్రాలు చదివారు. ఒక స్తోత్ర శ్లోకాన్ని తారామతి ఆలపించగా, ప్రేమావతి అభినయించింది. ఆ యాలయ నర్తకితో బాటు పూజారులు గూడా ఆనందపరవశులయ్యారు.

ఆ తర్వాత ఆ యాలయంలోని వృద్ధ పూజారిని పిలిచి, ఆయనకు నూతన వస్త్రాలు, దక్షిణ యిచ్చి ఆ ముగ్గురు నమస్కరించి, ఆయన ఆశీస్సులను పొందారు. అటు పిమ్మట తన చేతి కున్న నవరత్నాల కంకణాన్ని తీసి, సరస్వతీ దేవి పాదాల చెంత సిద్ధేశ్వరి ఉంచింది. ఆ ముగ్గురు సరస్వతీ దేవి పాదాల వద్ద ప్రణమిల్లారు.

"అమ్మా! జ్ఞాన సరస్వతీ దేవీ! నా కర్తవ్యం నేను నెరవేర్చాను. వీరిద్దరికి సంగీత నృత్య విద్యలు

నేర్పించాను, ఈ నాటి నుండి వీరిద్దరు నా బిడ్డలు కారు, నీ బిడ్డలు. వారి బాగోగులు నీవే చూసుకో తల్లీ!" అంటూ సిద్ధేశ్వరి తన కుమార్తెలను ఆ సరస్వతీ దేవికి అప్పగిస్తూ ఆమె పాదాల చెంత మోకరిల్లింది. తమ తల్లి పలుకులను ఆలకించిన ఆ సోదరు లిద్దరు మనస్సులోనే తమ తల్లికి, తమ మాతృమూర్తికి నమస్కరించి, స్తుతించి, అశ్రునయనాలతో ఆమెనే చూస్తూ నిలబడిపోయారు.

ఆనాటి మధ్యాహ్నం బీదలకు అన్నదానం, వస్త్రదానం సిద్ధేశ్వరి చేసింది. ఆ ముగ్గురు మరి మూడు రాత్రుళ్ళు ఆ యాలయంలో కటిక నేలపైని నిద్రించి, గోలకొండ తిరిగి వచ్చారు.

వీరు ముగ్గురు బాసర వెళ్లి వచ్చినట్లు తెలిసి, తారామతి ప్రేమావతులకు సంస్కృతం నేర్పిన పండితుడు వారిని చూడ్డానికి వచ్చాడు. బాసర యాత్రా విశేషాలను అడిగి తెలుసుకొని, సంతోషించాడు. ఆ తర్వాత తారామతీ ప్రేమావతులను ఉద్దేశించి, "మీ రిద్దరూ గొప్ప కళాకారులుగా తయారయ్యారు. అబ్దుల్లా పాదుషా మంచి కళా ప్రియుడు. కనుక మీరు ఆయన్ను వివాహం చేసుకొండి. నేను వారితో మాట్లాడి ఒప్పిస్తాను" అన్నాడా పండితుడు. ఆ మాటలకు తారామతి ప్రేమావతులు నిర్ఘాంతపోయారు. "గురువుగారూ! ఎంతమాట అన్నారు? మొన్ననే మా ఆత్మలను బాసర జ్ఞాన సరస్వతీ దేవికి అర్పించి వచ్చాం" అన్నారా సోదరులు. "అయితే గోలకొండలో మీ యిరువురి స్థానమేమిటి?" అని అడిగాడు ఆ గీర్వాణ భాషా పండితుడు.

" ఆ సరస్వతీ దేవే నిర్ణయిస్తుంది" అంది తారామతి.

"గురువుగారూ! శ్రీ కృష్ణుని జీవితంలో రాధ స్థానమేమిటి?" అని అడిగింది ప్రేమావతి.

"ఆరాధన" అన్నాడా పండితుడు.

"ఆ స్థానాన్నే మేము గోలకొండలో కోరుకొంటాం" అంది తారమతి.

వీరి సంభాషణ వింటూ కూర్చున్న సిద్ధేశ్వరి వైపు ఆ పండితుడు తిరిగి "అమ్మా! సిద్ధేశ్వరీ! వీ రిద్దరి కోరికా నెరవేరాలంటే నీవు పోయి మా హయాత్ బక్షీ బేగంను దర్శించి, మాట్లాడి రావాలి" అన్నాడు.

ఈ మాటలకు సిద్ధేశ్వరి కళ్లు చెమర్చాయి. తన మనస్సులోని ఆశయం గూడా అదే అవడం వల్ల ఆమె సంతోషించి "ముక్కోటి ఏకాదశినాడు మా సాహెబా వారిని కలుసుకొని మాట్లాడతాను, గురువుగారూ" అంది.

ముక్కోటి ఏకాదశి హిందువులకు చాలా పవిత్రమైన దినం. అందువలన ఆనాడు ఎలాగైనా హయాత్ బక్షీ బేగం వారిని సందర్శించి రావాలని సిద్ధేశ్వరి నిశ్చయించుకొంది. అందువల్ల ఆనాడు వేకు జామునే ఆ తల్లీ కుమార్తెలు నిద్ర లేచి, అభ్యంగన స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, శీతల దేవిని సేవించారు.

తన కుమార్తెలతో గూడ సిద్ధేశ్వరీ సుగుణవతి నగరికి బయలు దేరింది. పెద్దల వద్దకు, పిల్లల వద్దకు వెళ్లేటప్పుడు వట్టి చేతులతో వెళ్లగూడదని సుగుణవతి తమ పెరటి చెట్టున కాసిన రెండు జంట జామి పండ్లను రెమ్మతో గూడా కోసి, చేతపుచ్చుకొని బయలు దేరింది.

వారు కోటలోని అంతఃపురానికి చేరుకొనగానే అక్కడ పరిచారికలు ఎదురు వచ్చి, సగౌరవంగా ఆహ్వానించి, సందర్శకుల గదిలో ఆసీనులను చేశారు. వారి రాకను హయాత్ బక్షీ బేగం వారికి ఎరుక చేశారు. అహమద్‌నగర్ నుండి వచ్చిన రాజవంశ సందర్శకులతో ప్రసంగిస్తున్న బేగం వారిని సాగనంపి, సిద్ధేశ్వరీ సుగుణవతిని, ఆమె కుమార్తెలను లోపలకు రమ్మనమని సెలవిచ్చారు. ఆ తల్లీ కుమార్తెలు తమ పైట చెంగులను తలపైని ముసుగులుగా వేసికొని, మా సాహెబ్ వారి సమక్షంలో వచ్చి, చేతులు జోడించి, వినయపూర్వకంగా నమస్కరించి, నిల్చున్నారు. వారిని కూర్చోమని మా సాహెబా సెలవిచ్చారు.

“మాతాజీ! మా ఇంటి పెరటి చెట్టున కాసిన తొలి జంట జామిపళ్లు ఇవి. వీటిని మీకే సమర్పించాలని తీసికొని వచ్చాను. మాపైని దయయుంచి వీటిని స్వీకరించండి” అంటూ సిద్ధేశ్వరి ఆ జంట జామి పండ్లను హయాత్ బక్షీ బేగంకు వినయంగా అందించింది.

హయాత్ బక్షీ బేగం ఆ పండ్లను చిరునవ్వుతో స్వీకరిస్తూ “ ఆ జంట ఎవరు? మీ అమ్మాయిలా? కవల సోదరుల్లాగ ఉన్నారే!” అని అడిగారు.

“మాతాజీ! నా మనసులోని మాటను తమరు చక్కగా గ్రహించారు. ధన్యురాలిని. వీరిద్దరు నా కడుపున పండిన కవలలు, ఈమె తారామతి, ఆమె ప్రేమావతి, వీరిద్దరూ నృత్య సంగీత విద్యలను సంపూర్ణంగా అభ్యసించారు.”

“వీరి గురించి వీరి గురువులు చెప్పగా విన్నాం. ఉదయమే వచ్చారు. మీ రాకకు కారణం?”

“మాతాజీ! ఆలయంలో నృత్యపూజ చేయడం అనాదిగా మన దేశంలో వస్తున్న ఒక ఉత్తమ ఆచారం. అయితే, మా సాహెబా పాదుషా వారి కీర్తిని వీరిద్దరూ బాల్యం నుండి వింటూనే ఉన్నారు. వారి ధర్మపాలన, వారి కళాపోషణ గొప్పదని మాకు తెలుసు. వీరిద్దరు సంగీత నృత్యకళలను సమానంగా అభ్యసించి వాటిలో నిష్ణాతులైనారు. నా పెద్ద కుమార్తె తారామతికి సంగీతం పట్ల మక్కువ ఎక్కువ. రెండవ కుమార్తె ప్రేమావతికి నాట్య మంటే ఎక్కువ ప్రీతి. వీరిద్దరు సరస్వతీ దేవికి రెండు కళ్లుగా వెలుగొందాలని, సరస్వతీ దేవి వీణలో ఒక తారగా తారామతి మధుర స్వరాలు పలుకుతూ జీవించాలని, ప్రేమావతి నృత్య సరస్వతి పాద రత్న మంజీరాలలో ఒక చిరుగజ్జెగా నాట్యమాడుతూ నిలిచి పోవాలని నేను అభిలషిస్తున్నాను. అదే నా కోరిక. అదే నా అభీష్టం. అదే నా ఆశయం” అంటూ చెప్పింది సిద్ధేశ్వరి.

“అయితే వీరు ఆలయన ఆచారాన్ని పాటించరా?”

"మాతాజీ! తమ కోటలోని నగారా సంగీతాన్ని మూడుపూటలా బాల్యం నుండి వీరు ఆలకిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వస్తున్న నర్తకీమణుల నృత్యాభినయాలను వీరు తిలకిస్తూనే ఉన్నారు. పాదుషావారి కళాపోషణ గురించి వీరు వింటూనే ఉన్నారు. అందువల్ల పాదుషావారి దర్బారు పట్ల వీరు ఆకర్షితులవుతున్నారు."

"అంటే మీ ఉద్దేశ్యం? వీరిని దేవ నర్తకులుగా గాక రాజ ఆస్థాన నర్తకులుగా చేయాలని మీ కోరికా?"

"సంప్రదాయ రహితమైన జీవితాలు వంశ గౌరవాలకు మచ్చలు గదా తల్లీ?"

"మరి మీ ఉద్దేశ్యం?"

"రాజపోషణ లేనిదే కళలు రాణించవు. గదమ్మా? కనుక వీరికి పాదుషా వారి పోషణ అవసరం తల్లీ! అయితే వీ రిరువురి కళలు పాదుషా వారి దర్బారుకు పరిమితం కాకూడదు. పాదుషా వారి కళాపోషణ దేశం నలుమూలలా తెలిసేటట్టుగా, వీరి కళలు అమరత్వం పొందేటట్టుగా వీరికి అవకాశం కల్పించమని తమరిని ప్రార్థిస్తున్నాను."

"అదెలా?"

"వీరిద్దరి కొరకు కోట వెలుపల ప్రత్యేక మందిరాలను ప్రభువుల వారు దయచేసి నిర్మిస్తే, అక్కడ వీరు తమ కళలను ప్రదర్శించగలుగుతారు. ప్రభువుల వారితో బాటు ప్రజలు గూడా వీరి కళలను తిలకించి ఆనందించగలుగుతారు. వీరు అమరత్వం పొంది, చిరంజీవులుగా లోకంలో నిలిచిపోతారు తల్లీ!"

మా సాహెబా క్షణకాలం ఆలోచించి, "అలాగే జరుగుతుంది" అని సెలవిచ్చారు.

"ధన్యులం తల్లీ!" అని చెప్పి, సిద్ధేశ్వరీ సుగుణవతి తన కుమార్తెలతో గూడ హయాత్ బక్షీ బేగం వారి వద్ద సెలవు తీసికొని తమ ఇంటికి మరలిపోయారు.

వసంత పంచమి

ఆనాడు గోలకొండ సామ్రాజ్య ప్రజలకు ఆనందమయమైన పర్వదినం. ప్రప్రథమంగా బాలహిస్సార్ వద్ద అబ్దుల్లాపాదుషా వారు సభ జరుపబోతున్నారు. గోలకొండ సామ్రాజ్యమంతటా లెక్కకు మించి విందులు వినోదాలు జరుగుతున్నాయి. మా సాహెబా చేస్తున్న దాన ధర్మాలకు కొదువ లేకుండా పోయింది. బీదలకు అన్నదానాలు; ఫకీరులకు, సన్యాసులకు సంతర్పణలు, శిష్టజనులకు విందు భోజనాలు, గోలకొండ పట్నంలో ఎక్కడ చూసినా కవి సమ్మేళనాలు, పండిత గోష్టులు, సంగీత, నృత్య, నాటక ప్రదర్శనలు, కవులకు, కళాకారులకు, పండితులకు, శాస్త్రకారులకు సమ్మానాలు, బిరుదు ప్రదానాలు జరుగుతున్నాయి.

పేద సాదల యెడల కరుణజూపి ఇతరుల సంస్కార సంప్రదాయాలకు విలువనిచ్చి, గౌరవిస్తున్న సహృదయురాలు మా సాహెబా. అందువల్లనే అమెను ఎవ్వరూ హయాత్ బక్షీ బేగం అని సంబోధించరు. ప్రజలందరూ ఆమెను ప్రేమపూర్వకంగా “మా సాహెబా” అంటారు.

ఆనాడు ప్రజలు వేకువ జామునే లేచి, వారి ఇళ్లముందు కల్లాపి జల్లి, రంగు రంగుల ముగ్గులు వేసి, వారి వారి వీధులను మామిడాకు తోరణాలతో అలంకరించారు. రాజవీధిని గురించి మరి చెప్ప నవసరం లేదు. ప్రతి యింటి ముందు రంగవల్లులు, ప్రతి గుమ్మానికి పూల తోరణాలు, రాజమార్గమంతటా రాజ్యపతాక తోరణాలతో అలంకరించారు. ఆ రాజవీధినంతటా అగరు, చందనం, కర్పూరం వెదచల్లేరు. వీటి సువాసనలతో గోలకొండ పట్నమంతా నిండిపోయింది.

మేళ తాళాల వారు మంగళ వాయిద్యాలను వాయిస్తూ ముందు నడవగా పాదుషా అబ్దుల్ కుతుబ్ షా వారు పాదచారులై బాలహిస్సారుకు బయలుదేరారు. గోలకొండ దివాణం సంప్రదాయానుసారం తారామతి, ప్రేమావతి, వారి తల్లి సిద్ధేశ్వరీ సుగుణవతి అలంకరించుకొని పాదుషా వారి వెంట నడుస్తూ వెళ్లారు. కోట దేవీ ఆలయం వద్ద వారు ఆగి, ఆ దేవిని పూజించి, అక్కడ తారామతి సంగీత కచ్చేరీ, ప్రేమావతి నాట్యకేళిక చేశారు. పాదుషావారు ఆనందభరితులై వారిని తగురీతిని సత్కరించారు. అక్కడ చెంతనే గల వారి ప్రత్యేక మసీదుకు పాదుషావారు వెళ్లి అల్లాకు ప్రణమిల్లి, నమాజ్ చేసి, బాల హిస్సారుకు వెళ్లారు. వారి మత గురువులు మౌల్వీలు ఆశీర్వదించిన తర్వాత వారు సింహాసనాన్ని అలంకరించారు. హైందవ పండితులు వేద మంత్రాలు చదివి వారిని ఆశీర్వదించారు. వారందరినీ పాదుషావారు ఉచితరీతిని సత్కరించి, కానుక లిచ్చారు. అక్కడ ఆశీనులైన సభికుల నందరినీ చిరునవ్వుతో పలకరించి, తమ కృతజ్ఞతలు తెల్పుకొన్నారు.

ఆ బాల హిస్సారు నుండి పాదుషా వారు నలు వైపులా దూరంగా చూశారు. వారి తాతగారు నిర్మించిన భాగ్యనగరం, చార్‌మీనారు కనిపించాయి. తన ముత్తాతగారు నిర్మించిన మూసీవంతెన కనబడింది. అంతట వారు వారిని తమ మనస్సులోనే తలచుకొని, నమస్కరించారు. తనను దీవించమని అర్థించారు. ఆ తర్వాత గోలకొండ చుట్టూ ఉన్న సస్యశ్యామలమైన పొలాలను, రంగు రంగుల పుష్పాలతో కనుల విందు గొల్పుతున్న

ఉద్యానవనాలను, పసరు చిమ్ముతున్న ఎత్తైన పచ్చని వృక్షాలను తిలకించి ఆనందపరవశులయ్యారు. ఆ తర్వాత ఒక్కసారి సభను కలియజూసి, మంత్రి వర్యుని వైపు చూశారు. ఆ మంత్రివర్యుడు సైగ చేయగా బరహాన్‌పూరు నుండి వచ్చిన నర్తకి అంగూరు బాల కులీ కుతుబ్‌షా రచించిన ఒక గజల్ ఆలపించి, నర్తన మాడి, అభినయించింది. ఆ తర్వాత ఒక హోలీ గీతాన్ని పాడి, ఆడి, సెలవు తీసికొంది. ఆమెను ఉచిత రీతిని పాదుషావారు సత్కరించారు. తర్వాత పాదుషావారు తమ తల్లి మా సాహెబా వైపు చూసి, వెంటనే ప్రేమావతి వైపు చూశారు. ప్రేమావతి నాట్య ప్రదర్శనను ఆయన గోరుతున్నట్టు ఆమె గ్రహించి, తన కుమారుని వైపు ఒక్కక్షణం చూసి, కోటకు వెనుకవైపునున్న రెండు గుట్టలవైపు ఆమె తన దృష్టిని సారించి, "అబ్దుల్లా! ఆ రెండు చిన్న కొండలపైని తారామతి, ప్రేమావతులకు సంగీత నృత్యమందిరాలను నిర్మించు. ఆ మందిరాలలోనే వారు వారి సంగీత, నృత్యాలను ప్రదర్శిస్తారు. అదే వారి కోరిక. ఆశయం. వారిద్దరి సంగీత నృత్య ప్రదర్శనలు మన దర్బారుకు పరిమితమైనవి కావు. కారాదు. తారామతి అమరగానం ఆ కొండ చరియల్లో కలకాలం ప్రతిధ్వనిస్తూ ఉండాలి. అదే ఆమె వాంఛ. ప్రేమావతి పాద మంజీరాల మధురనాదం చిరకాలం ఆ కొండ చరియల్లో వినిపిస్తూ ఉండాలి. అదే ఆమె కోర్కె. వారి తల్లి సిద్ధేశ్వరీ సుగుణవతి చేసుకొన్ని విన్నపాలు అవే. వాటిని కాదనకు" అని మా సాహెబా ఆయనకు చెప్పింది. తల్లి మాటలను అబ్దుల్లా కుతుబ్ షా శ్రద్ధగా ఆలకించారు. అవి తన తల్లి ఆదేశాలుగా భావించారు. "మా సాహెబా! తమ ఆజ్ఞలను శిరసావహించి, ఆ చిన్న కొండలపైని వారికోసం సంగీత నృత్య మందిరాలను త్వరలోనే నిర్మిస్తాను" అని ఆ పాదుషా వారు తమ తల్లికి విన్నవించుకొన్నారు.

ఆ చెంతనే ఉన్న సిద్ధేశ్వరీ సుగుణవతి, తారామతి, ప్రేమావతులు ఆ తల్లీ కొడుకుల సంభాషణ విని ఆనందభాష్పాలు రాల్చారు.

కులీకుతుబ్ షా సంస్మరణ

ఆనాడు కులీ కుతుబ్ షా వర్థంతి. సాధువులు, సన్యాసులు, మౌల్వీలు, ఫకీరులు, వర్తకులు, వ్యాపారులు, రైతులు, శ్రామికులు, బీదవారు, వారూ వీరూ అన్న భేదం లేకుండా ఎక్కడెక్కడి నుండో ప్రజలు తండోపతండాలుగా వచ్చి, కులీకుతుబ్ షా సమాధి వద్దకు చేరుకొన్నారు.

మలిదా, బిరియానీ, గారెలు, బూరెలు, పూరన్ పోలీలు, పాయసం మొదలైన పిండివంటలతో అక్కడకు వచ్చిన వారందరికీ మా సాహెబా విందు భోజనం పెట్టారు. పళ్లు పంచి పెట్టారు. వస్త్రదానం చేశారు. పేదలకు ధన సహాయం చేశారు. ఎక్కడ చూసినా విందులు, వినోదాలే. ఎటు చూసినా బాజా భజంత్రీల, మేళ తాళాల సందడులే.

తమ తండ్రి సమాధి చెంత మా సాహెబా కొంతసేపు నిశ్శబ్దంగా కూర్చుని, ఆయన ఆత్మశాంతి కోసం ప్రార్థించారు. తమ వంశ చరిత్రను మననం చేసుకొన్నారు. తమ పితామహుడు హిందువులకు ప్రీతి పాత్రుడయ్యాడు. అందుకే ఆయన్ను ఈనాటికీ "అభిరాము"దని హిందువులందరూ కీర్తిస్తున్నారని ఆమె సంతోషించారు. "మల్కి ఇభరామ్" వింతగా "అభిరాముడై" వారి హృదయాలలో శాశ్వత స్థానాన్ని ఆయన పొందినందుకు ఉప్పొంగిపోయారు.

పిన్న వయస్సులోనే ఒక శరణార్థిగా ఆయన విజయనగరం వెళ్లి, ఆ విజయనగర సమ్రాట్టులను ఆశ్రయించి కొన్ని సంవత్సరాలు ఆయన అక్కడ ఉండిపోయారు. ఆయన కోసం ప్రత్యేకంగా ఒక మసీదు ఆ మహారాజుల నిర్మించారు. మత సహనం, మత సామరస్యం అంటే ఏమిటో వీరికి వారు ప్రత్యక్షంగా చూపించారు. రాజన్నవాడు ప్రజల మనిషిగా, ప్రజల హితవు కోరి రాజ్యాన్ని పరిపాలించాలి. రాజ్యపాలనలో అభిమానాలకు, ఆత్మీయతలకు తావులేదు. జాతి, మత, కుల విచక్షణ లుండరాదు. ప్రజల శ్రేయస్సే తన శ్రేయస్సని, వారి అభిమతమే తన అభిమతమని రాజు భావించాలి. ఈ విధమైన మానవతా విలువలును, రాజ్యపాలనా ధర్మాలను, మత సహనాన్ని, మత సామరస్యాన్ని, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని విజయనగర సామ్రాజ్యంలో ప్రత్యక్షంగా చూసి, తమ తాతగారు తెలుసుకొన్నారు. హైందవ స్త్రీయైన భాగీరథీ దేవిని ఆయన వివాహమాడి, తన పట్టపు రాణిగా చేసుకొన్నారు. లోక ధర్మాన్ని పాటించి, హిందూ ముస్లింల మధ్య భేదభావం చూపకుండా ప్రజలను తన సొంత బిడ్డల్లా చూసుకొని దేశాన్ని పాలించారు. అరబ్బీ, పారసీక కవి పండిఉతలనే కాక సంస్కృతాంధ్ర కవులు, పండితులను గూడ ఆయన పోషించారు.

తన పుత్రుడు ప్రేమించిన ఒక హైందవ యువతిని అతడు కలుసుకొనడానికి వీలుగా మూసీనదిపైని ఆయన ఒక వంతెన కట్టించి, నిజమైన ప్రేమకు అడ్డు గోడ లుండరాదని ఆయన రుజువు చేశారు. ఆ హైందవ స్త్రీని తన కోడలుగా స్వీకరించి, మతాంతర వివాహాలను ప్రత్యక్షంగా ప్రోత్సహించారు. ఈ విధంగా దేశ సౌభాగ్యానికి ఆయన పాటు పడినందువల్లనే ఆయన 'అభిరాముడయ్యా'డని మా సాహెబా మననం చేసుకొన్నారు.

తన తండ్రి కులీ కుతుబ్ షా తండ్రిని మించిన కొడుకు. తన తాతకన్నా తన తండ్రి ఎక్కువ ఉదార స్వభావుడు. మానవ హృదయాన్ని అర్థం చేసుకొన్న మహామనీషి. ఒక అతి సామాన్య వనిత, భాగామతిని పరిణయమాడి, తమ పవిత్ర ప్రేమకు శాశ్వత చిహ్నంగా భాగ్యనగరాన్నే ఆయన నిర్మించాడు. ఆహా! ఎంతటి ఉదారుడు ఆయన! మానవునిలో మాధవుణ్ణి చూసిన మహనీయుడు ఆయన. హిందూ ముస్లిం మతాలను సమానంగా ఆదరించిన సంస్కర్త ఆయన. ముస్లిం పండుగలతో సమానంగా బతకమ్మ మొదలుకొని సంక్రాంతి వరకు గల వివిధ హైందవ పండుగల నన్నింటి వర్ణిస్తూ కవితలల్లిన సద్గుణ శీలుడతడు. మానవులందరూ ఒక్కటే. సర్వమానవులు సమానులే, జాతి, మత భేదం, గొప్పా బీదా వ్యత్యాసం ఉండరాదని ప్రత్యక్షంగా చూపించి, ప్రబోధించిన గొప్ప ప్రవక్త తన తండ్రి.

ఈ విధంగా ఆ సమాధి వద్ద తన తండ్రి, తాతలను స్మరించుకొంటూ మా సాహెబా కూర్చుంది. ఆ తర్వాత ఆమె లేచి, ఆ సమాధి మీద నూతన వస్త్రాన్ని కప్పి, పూలమాలలు వేసి, ధూపం వేసి, ఊదువత్తులు వెలిగించి పెట్టి, హైందవ సంప్రదాయానుసారం ఆ సమాధికి నమస్కరించి, తన తండ్రి ఆత్మ శాంతి కొరకు అల్లాను ప్రార్థించింది.

చివరగా, ఆ సమాధి పై కప్పున నున్న నాగేంద్ర శిల్పాన్ని ఆమె తదేకంగా వీక్షించింది. ఆమె వెంట నున్న పరిజనమంతా ఆమెను, ఆ నాగేంద్ర శిల్పాన్ని ఆశ్చర్యంగా చూశారు. అప్పుడు ఆమె వారిని ఉద్దేశించి, "ఈ నాగేంద్ర చిహ్న మేమిటా అని మీరు ఆశ్చర్యపోతున్నారా? దీనిని గురించి చెప్తాను. శ్రద్ధగా వినండి. హిందూ మతాచారం ప్రకారం కొడుకులు లేనివారు తమకు పుత్ర సంతానం కలగాలని నాగేంద్రుని పూజిస్తారు. నా తండ్రి కూడా ఈ హైందవ మతాచారాన్ని పాటించి, తనకు పుత్ర సంతానం కలగాలని నాగేంద్రునికి మొక్కుకొన్నారు. కాని ఆయన మొక్కు ఫలించలేదు. ఆయనకు పుత్రికగా నేను జన్మించాను. నన్నే ఆయన తన పుత్రుడుగా భావించి, పుత్రుడు చేయవలసిన విధులను నన్ను నిర్వహించమన్నారు. ఆ అధికారాన్ని ఆయన నా కిచ్చారు. ఆ యధికారానికి చిహ్నంగా ఈ నాగేంద్ర శిల్పాన్ని ఈ సమాధిపైని ఆయన చెక్కించారు. అందుకే నేను స్త్రీనైనా ఆయన ఆశయం మేరకు నా భర్త తరఫున, తర్వాత నా పుత్రుని తరఫున ఈ

రాజ్యభారం నేను స్వీకరించాను. నా కొడుకు అబ్దుల్లా రాజ్యాభిషిక్తుడైనప్పటికీ నేను విశ్రాంతి తీసుకొనకుండా రాజ్యపాలన నిర్వహిస్తున్నాను. నా జీవితకాలంలోను, అబ్దుల్లా రాజ్యకాలంలోనూ అతని సంతతి వారి కాలంలో ఈ రాజ్యం సుభిక్షంగా ఉండి, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, మత సామరస్యంతో ప్రజలందరూ అన్నదమ్ముల వలె మెలగాలని నేను అల్లాను, ఈ నాగేంద్రుని ప్రార్థిస్తున్నాను" అంటూ ఆమె మౌనంగా చేతులు జోడించి, నాగేంద్రునికి నమస్కరించింది. "మా సాహెబా! మా సాహెబా!" అంటూ అక్కడున్న వారంతా ఆమెను కీర్తించారు. ఆమె మౌనంగా అక్కడ నుండి కదలి, తమ మహల్‌కు వెళ్లిపోయారు.

ఆనాటి సాయంత్రం ఆమె "మా సాహెబా తలాబ్"కు ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంలో ఆమె ప్రసంగిస్తూ "నా తండ్రి గారు కులీ కుతుబ్ షా భాగ్యనగర నిర్మాణం గురించి తమ కవితలో "నదులలోని చేపలు దిన దిన ప్రవర్ధమానమవుతూ, నూతనోత్సాహంతో ఎలా వృద్ధి చెందుతాయో అలాగే భాగ్యనగరంలోని ప్రజలు ప్రవర్ధమానం కావాలి" అని ఆశించారు. అదే విధంగా నేను నిర్మించిన ఈ చెరువు ఈ నగర ప్రజల శ్రేయస్సుకు దోహదపడాలని నేను ఆశిస్తున్నాను. ఈ చెరువు క్రింది భూములు సస్య శ్యామలమై ప్రజలకు సుఖ సంతోషాలను చేకూర్చాలని నేను అల్లాను ప్రార్థిస్తున్నాను" అని మా సాహెబ్ అన్నారు. ఆమె ఔదార్యానికి ప్రజలు జేజేలు కొట్టారు.

భాగవతం - భాగోతులు

ఉదయం నాలుగు గంట లయింది. తారామతి సాము ముగించి, తన గదిలో విశ్రాంతి తీసుకొంటూంది. తమ మందిరంలోని పిట్టగోడ వద్ద నిలబడి, దూరంనుండి వినీ వినబడకుండా మురిపిస్తున్న భాగవతం పాటను, మద్దెల ధ్వనులను, తాళాల చప్పుళ్లను, మువ్వల నాదాలను ప్రేమావతి మైమరచి వింటూంది. తారామతి మెల్లగా అక్కడకు వచ్చి, "అమ్మదొంగా! సాము ఎగగొట్టి, ఇక్కడ నిలబడి కలలు కంటున్నావా?" అని అడిగింది.

"అక్కా! ఎండిన చర్మం ఎంత హాయిగా పలుకుతూందీ!" అంది ప్రేమావతి, తారామతి మాటను వినిపించుకోకుండా.

"నీవు వట్టి అమాయకురాలివి, తోలులో ఏముందే చెల్లీ! వాయించే వాడి చేతిలో ఉంది గాని" అంది తారామతి.

ఇంతలో అక్కడకు వచ్చి, వారి మాటలు విన్న సిద్ధేశ్వరి, "మీరిద్దరూ అమాయకులే! అది ఆ తోలులోను లేదు, వాయించేవారి చేతిలోను లేదు. అదంతా వేళావిశేషం" అంది.

రాత్రంతా పుష్పాల గూడెంలో 'జలక్రీడ' భాగవత మాడిన భాగోతులు తెలతెలవారుతుండగా వీరింటికి వచ్చి, గోపికలు చల్లలు తిప్పే దరువును కేళిక చేసి, డబ్బు యాచించారు. వారిలో ముసలి హస్యపాత్ర ధారుడు "అమ్మలూ! యశోదమ్మ వేషం కట్టిన వీరికి ఒక నూతన పట్టుచీర సెలవిప్పించండి" అన్నాడు తన హాస్యాన్ని ఒలికిస్తూ.

"తాతగారు! కొత్తదే గాని పాతది పనికిరాదా?" అని ఆ ముసలి పాత్రధారుణ్ణి అనుకరిస్తూ అడిగింది ప్రేమావతి.

"తల్లీ! అది యశోదమ్మ కోసం కదమ్మా! పాతది నప్పుతుందా, ఒప్పుతుందా తల్లీ! నీవే చెప్పు తల్లీ."

"ఒప్పిస్తే సరి! అంతా ఒప్పించడంలో ఉంది".

"అమ్మా! ఆ భాగవత ప్రదర్శనలే మా జీవితం. ఇదే మా వృత్తి. ఇదే మా జీవిత సర్వస్వం. దీనినే నమ్ముకొన్నాం. దీనినే ఆరాధిస్తున్నాం. దీనిని ఆరాధించకుండా మేం జీవించలేం. తరతరాలుగా పేదరికంతోనే మా జీవితాలు సాగుతున్నా ఈ కళనే నమ్ముకొని ఆరాధిస్తున్నాం. ఏదో మీ దయ మా ప్రాప్తం" అన్నాడా వృద్ధ కళాకారుడు.

"తమరు ఏ ఊరునుండి ఇటకు వేం చేసితిరి?" అని హాస్య ధోరణిలో ప్రేమావతి మళ్లా అడిగింది.

"ఏ వూరని చెప్పమంటావు తల్లీ! ఒక ఊరా? ఒక పేటా? దేశ సంచారం చేస్తూ, ప్రతి ఊళ్లోను, ప్రతి గ్రామంలోను ఆ శ్రీకృష్ణ దేవుని గాథలు ప్రచారం చేస్తున్నాం తల్లీ! మే కుశీలవులం తల్లీ! అంటే సంచారక కళాకారులం తల్లీ! మమ్మల్ని ఎఱ్ఱగొల్ల లంటారు తల్లీ! ఏదైనా సెలవిప్పించండి తల్లీ! ఇంకా నాలుగిళ్లు తిరగాలి తల్లీ!" అన్నాడు ఆ మేళం పెద్ద.

"అమ్మా! వీరు సామాన్యుల్లాగ లేరు. వీరు పెద్ద పెద్ద గ్రంథాలు చదివినట్టున్నారు. వీరి మాటల్లో వేదాంతం, భక్తి భావాలూ ఉన్నాయి" అంది ప్రేమావతి తల్లి సిద్దేశ్వరితో.

"గ్రంథాలే చదవనక్కరలేదు; జీవితమనే గ్రంథంలో నేర్చుకొన్న అనుభవాలు, వివిధ అంకాలుగా పరిణమిస్తూంటాయి. ఆ తల్లీ కూతుళ్లు లోపలికి వెళ్లి, శీతల దేవికి కట్టి బెట్టిన పట్టుచీర, స్వయం పాకం, ఒక హొన్ను తెచ్చి యిచ్చారు. ఆ ఎఱ్ఱగొల్ల భాగవతులు ఒక ఆశీర్వాద శ్లోకం చదివి, ఆ ముగ్గుర్నీ ఆశీర్వదించి, సంతోషంగా వెళ్ళిపోయారు.

"అమ్మా! ఇటువంటి పేద కళాకారులకు పాదుషావారు సహాయం చేస్తే బాగుంటుంది గదమ్మా!" అంది ప్రేమావతి.

"వీరికి పాదుషావారి దర్శనభాగ్యం కలగవద్దూ?" అంది తారామతి. "తగిన పోషణ లేకపోతే ఏ కళా రాణించదు. వీరిని మీరే రేపు పాదుషా వారి వద్దకు తీసుకొని వెళ్ళండి. పాదుషావారు చాలా ఉదార స్వభావులు. వీరికి తప్పకుండా సహాయం చేస్తారు" అంది తల్లి సిద్దేశ్వరి.

కబురు చేయగా ఆ గొల్ల భాగవతులు సిద్దేశ్వరి ఇంటికి వచ్చారు. వీరిని తారామతి ప్రేమావతులు కోటకు తీసుకొని వెళ్లారు. దేశ సంచారం చేస్తూ, ముతక బట్టలు ధరించి, ఒక పూట తింటే రెండోపూట గడవక పేదరికంతో జీవితాలు వెళ్ళదీస్తున్న ఈ ఎఱ్ఱగొల్ల భాగవతులు అంతవరకు ఏ పెద్ద భవంతిలోను అడుగు పెట్టి ఎరుగరు. అందువల్ల ఆ కోటలోనికి ప్రవేశించి ఆశ్చర్యచకితు లయ్యారు. ఆ కోటలోని పూతోటలు, పాలరాతి మందిరాలు, అలంకారాలు మొదలైన వన్నీ వీరికి అద్భుతాలుగా గోచరించాయి. కనుల వైభవంగా ఆ కోట తమ భాగవత కేళికలో వీరు వర్ణించే శ్రీ కృష్ణ భగవానుని మందిరంలా కనిపించింది. కృష్ణ లీలల భాగవతంలో కంస మహారాజులవారి మందిరాలను వర్ణిస్తూ నాట్యమాడుతున్నారే గాని వీరెన్నడూ ఇటువంటి మందిరాలను గురించి వినలేదు, కనలేదు. నేడు అబ్దుల్లా కుతుబ్ షా పాదుషా వారి కోటను లోపల తిలకిస్తుంటే వారి కది ఒక స్వప్న మందిరంలా ఉంది. "ఇది భూలోకమా? లేక స్వర్గలోకమా?" అని ఆశ్చర్యపోతూ, ఆ మందిరాల గురించి తారామతి ప్రేమావతులను అడిగి తెలుసుకొంటూ, మెల్లగా వారి వెంట వెళ్తున్నారు. మెరుగు పెట్టిన పాలరాతి ఫలకాలలో వారు వారి ప్రతిబింబాలను చూసుకొని మురిసిపోయారు, భ్రమసిపోయారు.

వీరందరూ పాదుషావారి దర్బారు హాలులో అడుగు పెట్టగానే గంట మోగింది. బిరుదు మిరాలులు స్తోత్ర గీతాన్ని ఆలపిస్తూ ఉండగా అబ్దుల్లా కుతుబ్ షా పాదుషావారు వేం చేశారు. ఆ దర్బారు హాలులోని సభికులందరూ లేచి నిలబడి, వంగి వంగి పాదుషా వారికి సలాములు చేశారు. ప్రభువుల వారు ఆశీనులైన తర్వాతనే సభికులు కూర్చున్నారు.

భాగవతులవారి ఆనవాయితీ ప్రకారం మద్దెల వాద్యకులు ముక్తాయి పలికించి, పాదుషా వారికి నమస్కరించారు. మిగిలిన వారు గూడ నమస్కరించారు. పాదుషా వారు తారామతి ప్రేమావతుల వైపు చూశారు. "ప్రభువులవారు చిత్తగించాలి. వీరు సాగర సీమ భాగవతులు. వీరిని ఎర్రగొల్ల భాగవతులంటారు" అని తారామతి వారిని ప్రభువుల వారికి పరిచయం చేసింది.

"ప్రభువుల వారికి ఒక కేళికను వినికిడి చేయ వీరు వచ్చారు. ప్రభువుల వారు ఆజ్ఞాపించవలసినదిగా వారు అర్థిస్తున్నారు" అని ప్రేమావతి ఉన్న విషయం ఎరుక చేసింది.

ప్రభువుల వారు సెలవిచ్చారు. శ్రీకృష్ణ లీలల్లోని గోపికలు చల్లలు చేసే దరువులో గోపిలకు యశోదమ్మకు బాలకృష్ణుని పైని ఫిర్యాదు చేసే ఘట్టాన్ని ప్రదర్శించడానికి వారెన్నుకొన్నారు. గోపికలు జలక్రీడలాడే చిత్రం గల మచిలీపట్నం – బందరు తెరను పట్టుకొని ఇద్దరు ప్రవేశించారు. మేళ ప్రాప్తి జరిగింది.

"ఎవ్వనిచే జనించు, జగమెవ్వనిలోపల..." అన్న పోతన భాగవత పద్యాన్ని బృందం నాయకుడు ఆలపించాడు. ఆ తెరకు ఇరుప్రక్కల నున్న కాగడాలవారు వారి కాగడాలను ఒక చోట చేర్చి, సాంబ్రాణిని వాటిపైని జల్లారు. మంటలు గుప్పున ఎగసేయి. తెర తొలగింది. బాలకృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు. అతనికి హారతి నిచ్చారు. ఆ కళాకారుల గాత్రాలు కిన్నెర గాత్రాల్లాగ పలికాయి. మద్దెళ్లు ఖంగుమన్నాయి. తన చిరుగజ్జెలను మోగిస్తూ ఆ బాలకృష్ణుడు ఆట మొదలు పెట్టాడు. గోపికలు జలక్రీడలు సలిపారు.

వారి ఆట మెరుపు తీగలాగ మెరిసిపోయింది.

పాదుషావారు ఆనందించారు.

మరో అయిదు నిమిషాలలో ద్వాపర సందర్శనం ముగిసింది.

పాదుషావారు వారికి సాగరసీమలోని తిమ్మాపురాన్ని ఇనామ్‌గా ఇచ్చినట్టు మంత్రివర్యుడు ప్రకటించారు. ఆ ఎర్రగొల్ల భాగవతులు ఆనంద పరవశులయ్యారు. పాదుషావారిని పాటలతో కీర్తించి, సెలవు తీసికొన్నారు. వారు నిష్క్రమిస్తుంటే వారినే పాదుషావారు ఆశ్చర్యంగా చూస్తూండిపోయారు.

పాదుషావారు ఎందుకు అలా ఆశ్చర్యంగా చూస్తున్నారో గ్రహించిన తారామతి "అవి నిజమైన బంగారు నగలు కావు, అవి చెక్క నగలు. వాటిని గనియం అంటారు" అంది.

ఇంతలో గంట మ్రోగింది. రాజమాత హయాత్ బక్షీ బేగం వారు వేం చేస్తున్నట్టు రాజభటులు వినికిడి చేశారు. పాదుషావారిని ఏకాంతంగా విడిచి, అందరూ నిష్క్రమించారు. ముఖమల్ పాదరక్షలను గుమ్మం వద్ద విడిచి, మా సాహెబా తనయుని వద్దకు వచ్చారు. పాదుషా వారు లేచి నిలబడి, వారి తల్లిగారికి పాదాభివందనం చేశారు. ఆమె కూర్చున్న తర్వాత పాదుషావారు కూడా కూర్చొని, "ఏమి సెలవు?" అని అడిగారు.

"బిడ్డా! సిరిసందలతో తులతూగుతూ ప్రశాంతంగా ఉన్నప్పుడే విందులు, వినోదాలు, కళలు, కళా పోషణలు!"

"ఔను మా సాహెబా!"

"దేశంలోని ప్రజలు భయభ్రాంతులై, తల్లడిల్లుతూంటే ఈ నాట్యా లేమిటి? ఈ వినోదా లేమిటి?"

"మా సాహెబా! మా పాలనలో ప్రజలు భయభ్రాంతు లవుతున్నారా? దేశంలో అశాంతి నెలకొన్నదా?"

"ఔను బిడ్డా! ఢిల్లీ పాదుషా ఔరంగజేబు మన పైని దాడి చేయబోతున్నట్టు వేగులవారి ద్వారా సమాచారం అందింది".

"కారణ మేమిటి మాతాజీ?'

"రాజ్య విస్తరణ కాంక్ష!"

"మరి మన కర్తవ్యం?"

"అదే ఆలోచిస్తున్నాం. ఈ తరుణంలో వారిని మనం ప్రతిఘటించరాదని మేం అనుకొంటున్నాం."

"మనం ప్రతిఘటించలేమా తల్లీ?"

"మనం ప్రతిఘటించగలం, కానీ ప్రతిఘటించి యుద్ధం చేస్తే ఎంత రక్తపాతం? ఎంత ప్రాణ నష్టం? ఎంత విధ్వంసం? ఏం లాభం? ఎవరికి మేలు?"

"మరి మన కర్తవ్యం?"

"ఒక వ్యక్తి రాజ్యకాంక్షకు లక్షలాది ప్రజలు బలి కాకూడదు."

"మరి తరుణోపాయం?"

"ఔరంగజేబ్ పాదుషావారి వద్దకు రాయబారిగా నేను వెళ్లదలచుకొన్నాను. యుద్ధ ప్రయత్నం చేయవద్దని వారిని నేను కోరదలచుకొన్నాను."

"ఆయనకు మనం తలవంచడమా?"

"ఇది తల వంచడం కాదు, సంధి చేసుకొనడం. దీనివల్ల మనకు కొంత ధననష్టం కలిగినా ప్రాణనష్ట ముండదు."

"నా బొందిలో ప్రాణమున్నంత వరకు, నా తాతగారు కులీ కుతుబ్ షా వారు నిర్మించిన ఈ సుందర సువిశాల సామ్రాజ్యాన్ని నేను రక్షించుకొంటాను. ఆ ఔరంగజేబుకు నేను తలవంచను" అంటూ అబ్దుల్లా కుతుబ్ షా ఒరలో నుండి కత్తితీసి, మళ్లా పెట్టాడు.

"బిడ్డా! తప్పని సరైతే అలాగే చేయవలసి వస్తుంది. కాని అనవసరంగా పౌరుషాలకు పోయి మనం దేశాన్ని రక్తసిక్తం చేయకూడదు. ప్రజల చావుకు, రక్త పాతానికి మనం కారకులం కాకూడదు. రాయబారిగా వెళ్లి, రక్తపాతాన్ని అరికట్ట దలచుకొన్నారు. కానీ అన్నింటికి నీవు సంసిద్ధుడవై ఉండు. మంత్రులతో సమాలోచనలు చెయ్యి. సమయం మించి పోతున్నది. ఇంక నే వెళ్లివస్తా" అంటూ మా సాహెబా నిష్క్రమించారు.

అబ్దుల్లా ఆమెనే చూస్తూ, కృతజ్ఞతా పూర్వకంగా అశ్రువులు రాల్చారు. "ఎండ కన్నెరగని తన తల్లి, ప్రాణ విభునికి తప్ప పరపురుషునికి కంటబడని తన మాతృమూర్తి ప్రజాక్షేమం కోసం, రాజ్య రక్షణ కోసం, కుతుబ్‌షాయి వంశ ప్రతిష్ఠ కోసం ఎంత సాహసం తలపెట్టింది? ఎంతటి త్యాగం చేస్తున్నది?" అని అబ్దుల్లా ఆశ్చర్యపోయి, అశ్రు నయనాలతో మనస్సులోనే ఆమెకు కృతజ్ఞతలు అర్పించుకొన్నాడు. తర్వాత వెంటనే జాగృతుడై గంట మోగించాడు. ఇద్దరు సేవకులు వచ్చారు. "ప్రధాన మంత్రివర్యులను వెంటనే రమ్మనమన్నానని చెప్పండి" అని ఆదేశించారు అబ్దుల్లా.

హయాత్ బక్షీ బేగం జీవించి యుండగా మొగల్ పతాకాన్ని గోలకొండ కోటపైన ఎగురవేయడం సాధ్యం కాదని గ్రహించిన ఢిల్లీ పాదుషా ఔరంగజేబ్ మా సాహెబా రాయబారిగా వచ్చారని తెలిసికొని, సకల మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికాడు. ఆమె సంధి ప్రతిపాదనకు అంగీకరించాడు. ఆమె పరిహారం చెల్లించడానికి అంగీకరించింది. ఔరంగజేబ్ ఆనందించాడు. గోలకొండ సామ్రాజ్యంలో శాంతికి భంగం కలుగలేదు. అబ్దుల్లా కుతుబ్‌షా కుమార్తెను ఔరంగజేబ్ పాదుషా కుమారుని కిచ్చి వివాహం చేయడానికి వారిద్దరు సమ్మతించారు.

ఆ భాగవత బృందం వారు తారామతి ప్రేమావతులను ఇంటివద్ద విడిచి వెళ్లారు. వారిద్దరూ ఇంట్లోకి వస్తూనే "అమ్మా!" అంటూ సిద్ధేశ్వరిని కౌగిలించుకొన్నారు.

"ఏమిటి మీ కింత సంతోషం?" అని తల్లి అడిగింది.

"అమ్మా! ఊరూ పేరూ లేని ఆ భాగవతులు ఎంతో చక్కగా ముస్తాబై, ఎంతో ముచ్చటగా పాదుషా వారి సమక్షంలో వారి ఆటా, పాటా, అభినయం ప్రదర్శించారమ్మా" అంది ప్రేమావతి.

"వారిని పాదుషా వారి దర్బారుకు తీసికొని వెళ్ళేముందు నాకు కొంచెం భయం వేసిందమ్మా! కాని పాదుషావారు వారి ప్రదర్శనను తిలకించి, చాలా సంతోషించారు. వారికి ఒక గ్రామాన్నే ఇనాంగా ఇచ్చారమ్మా!" అంది తారామతి.

"అమ్మా! ఆ భాగవతులు దాంతో ఉక్కిరి బిక్కిరై మమ్మల్ని ఎంతో కీర్తించడం మొదలుపెట్టారు. ఇంక ఆ భాగవతులు స్థిరంగా ఆ గ్రామంలో ఉండవచ్చు" అంది ప్రేమావతి.

"సాటి కళాకారుల్ని ఆదుకొనడమే మన విద్యుక్తధర్మం. వా రెంత పేదవారైనా, ఎంత చిన్న తరగతికి చెందిన వారైనా, వారిలోని కళలను మనం గౌరవించాలి. మనకు తోచిన సహాయం మనం చేస్తుండాలి. ఎవరి కళనూ మనం చిన్న చూపుతో చూడకూడదు. మీరిద్దరు వారికి చేసిన మేలు చాలా గొప్పది" అని సిద్దేశ్వరి సుగుణవతి తన కూతుళ్ళను మెచ్చుకుంది.

"అమ్మా! వీరు భాగవతాల్నే ప్రదర్శిస్తారా? ఏకపాత్ర కేళికలు ప్రదర్శించరా?" అని అడిగింది ప్రేమావతి.

"వీరు భాగవత కథలను నృత్యనాటకాలుగా ప్రదర్శించి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారు. ఈ నృత్య నాటికల ద్వారా వీరు మన సంస్కృతిని ప్రచారం చేస్తున్నారు. ప్రజలను విజ్ఞానవంతులను చేస్తున్నారు. ఏక పాత్రాభినయం ద్వారా ఈ భాగవత కథల్ని ప్రదర్శిస్తే ప్రజలందరు ఆకర్షితులు కారు. నృత్య నాటకాలలో వివిధ పాత్ర లుంటాయి గనుక నాటకాలంటే అందరూ మోజు పడతారు. ఆ నృత్య నాటక ప్రదర్శనలు నాట్య మేళం కిందకు వస్తాయి. మీది నట్టువ మేళం" అని వివరించింది సిద్దేశ్వరి.

"ఔనమ్మా! మా ఆటపాటలను విద్వాంసులే కాని సామాన్య ప్రజలు గుర్తించడం లేదు. వీరి ఆటపాటలను ఊర్లో అందరు మెచ్చుకొంటున్నారు" అంది ప్రేమావతి.

"అమ్మా, వీరేనా ఇంకా ఇటువంటి నాట్య మేళాలవారు వే రెవరైనా ఉన్నారా?" అని అడిగింది తారామతి.

"ప్రతి జాతిలోను, ప్రతి కులంలోను ఇటువంటి భాగవత బృందాలవా రున్నారు. వారి వారి జాతులకు కులాలకు సంబంధించిన పుట్టు పూర్వోత్తరాలను, వాళ్ల మూల పురుషుల చరిత్రలను, వారి మత విషయాలను వివిధ రకాలైన కథలుగా మలిచి, ఆట పాటలతో ప్రదర్శించి నిరక్షరాస్యులను విజ్ఞానవంతులుగా చేస్తున్నారు. ఈ కళాకారులలో చాలామందికి చదువు రాకపోయినా సంస్కార ముంది. వీరి ధారణశక్తి అమోఘం. మన సంఘంలో అతి దిగువ తెగలవారు కూడా ఉన్నారు. వారిలో కొందరిని అంటరానివారిగా మన పెద్దలు పరిగణించి, దూరంగా ఉంచారు. వారి నియమ నిష్ఠలను, వారి క్రమబద్ధమైన జీవితాలను, వారి సంఘ

సేవలను మన పెద్దలు గుర్తించడం లేదు. అది వారి దురదృష్టం. నా చిన్నప్పుడు 'జాంబవంత'కథను ఒక భాగవత బృందం వారు ప్రదర్శించారు. ఆ కథ ద్వారా వారు వారి పుట్టుపూర్వోత్తరాలను కళ్ళకు కట్టినట్టుగా ప్రదర్శించారు. అది వారి పుట్టుపూర్వోత్తరాలనే కాదు మానవ జాతి సృష్టిని తెలియజేసిందని చెప్పవచ్చును. ఈ సృష్టిని, ఈ సృష్టి క్రమాన్ని ఒక కథగా వారి కెవరు వ్రాసి యిచ్చారోగాని వారి ప్రదర్శన చాలా కళాత్మకంగా ఉంది. మరోసారి 'కురుమల బీరప్పకథ' ను వేరొక బృందం వారు ఆడగా నా చిన్నప్పుడు చూశాను. ఆ భాగవతుల వాగ్ధాటి, కథా వర్ణనలు చాలా గొప్పగా ఉన్నాయి. వారు కథ చెప్పడం మొదలు పెట్టిన తర్వాత మరింక ఎక్కడా విశ్రాంతి తీసుకోలేదు. జోడు గుర్రబ్బండికైనా అలుపు సొలుపు ఉంటాయేమో గాని వారి నోటికి అలుపుండినట్లు కనబడలేదు. వారి వాక్ప్రవాహం అలా సాగుతూ పోయింది. వారికి వారే సాటి. ఒక్కొక్కరిలో ఒక్కొక్క నేర్పుంటుంది. ఆ నేర్పునే మనం గుర్తించాలి" అని భాగవతుల వారి గురించి సిద్ధేశ్వరి చెప్పింది.

ఈ బృందంలో స్త్రీ పాత్రలను గూడ పురుషులే పోషించారమ్మా! స్త్రీలు స్త్రీ పాత్రలను ధరించి యుంటే బాగుండేది. స్త్రీలు ఈ భాగవత ఆటలలో పాల్గొనరాదని ఎవరైనా నిషేధించారా లేక శాపం పెట్టారా?" అని అడిగింది తారామతి.

"నీ కుండుండి మతి పోతూ ఉంటుంది. ఎవరూ శాపం పెట్టలేదు, నిషేధించలేదు. ఈ భాగవతులు సంచార ప్రదర్శకులు. వీరు దేశ సంచారం చేస్తున్నప్పుడు ఎన్నో కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొనవలసి ఉంటుంది. ఆ సమయంలో వీరు ఆపదలను కూడ ఎదుర్కొనవలసి వస్తుంది. అంతేగాదు స్త్రీలకు నెల ఆటంకా లుంటాయి. గర్భవతులైతే ఆడ్డం కష్టం, చూచే వారికి ఎబ్బెట్టుగా ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులు ఎన్నో ఉంటాయని పురుషులే స్త్రీ పాత్రలను గూడ ధరిస్తున్నారు. పూర్వం కొన్ని సందర్భాలలో స్త్రీలు కూడా ఉండేవారట. ఒక చిన్న జమీందారు గారి ఇంట్లో ఒక శుభకార్య సందర్భంలో వారు ఒక భాగవతం ఆట కట్టేరు. ఒక అందమైన అమ్మాయి గూడ ఆ యాటలో పాల్గొంది. ఆమె ఆటపాటలు చక్కగా ప్రదర్శించింది. ఆ జమీందారు ఆమె ఆట పాటలు చూసి, సమ్మోహితుడై, ఆమెను పొందా లనుకొన్నాడు. ఏదో నెపంతో ఆమెను దివాణంలోనికి తీసికొనిపోయాడు. ఆ తర్వాత ఆ అమ్మాయి మరి ఆ బృందం వారికి కనబడలేదు. ఏమైందో ఎవరికి తెలియదన్నారు. ఆనాటినుండి ఈ భాగవత బృందాలవారు స్త్రీలను తమతో తీసుకొని వెళ్లడం మానివేశారు. అప్పటినుండి ఎవరో ఒక యోగి పుంగవుడు స్త్రీలను నిషేధించాడని ప్రచారం చేయడం ఈ బృందాలవారు ప్రారంభించారు అంతే. కళాకారులను ఎవరూ శపించలేదు" అని సిద్ధేశ్వరి వివరించింది.

"నీకు ఇన్ని విషయాలు ఎలా తెలుసమ్మా?" అని అడిగింది ప్రేమావతి. "నా చిన్నప్పుడు మా యింటి వద్ద మా నాన్నగారు ఈ భాగవత ఆటలు, ఏకపాత్ర కేళికలు ఏర్పాటు చేయిస్తూండేవారు. ఆ బృందాల వారితో మాట్లాడి ఇలాంటి విషయాలు ఎన్నో తెలుసుకొన్నాను" అని చెప్పింది సిద్ధేశ్వరి.

"అమ్మా! మొన్న పక్క ఊరిలోని మా స్నేహితురాలి ఇంటినుండి నేను వస్తూంటే ఒక రావి చెట్టు కింద చాలా మంది గుంపుగా నిలబడి ఉన్నారు. కొంత మంది కింద కూర్చొని ఉన్నారు. ఏమిటా అని నేనూ ఆ గుంపులోకి వెళ్లి చూశాను. ఎవరో పిచ్చుక కుంట్ల వారట ఏడు రోజులనుండి ఏకధాటిగా "బాలనాగమ్మ" కథను చెప్తున్నారట! ఆనాడు కథను ప్రారంభిస్తున్న సమయానికే నే నక్కడకు వెళ్లాను. ఇంతలో ఒక వేషధారి ఒక ఏకతార తంబురా పట్టుకొని, దానిని మీటుతూ కథ చెప్పడం ప్రారంభించాడు. అతనికి ఇరుపక్కల ఇద్దరు స్త్రీ వేషధారు లున్నారు. వారిద్దరు అతని భార్యలనుకొంటాను. వారు గుమ్మెటలను వాయిస్తూ అతనికి వంతపాడడం మొదలుపెట్టారు. మాయల ఫకీరు బాలనాగమ్మను చెరలో బంధించి, హింసించడం అతడు వర్ణించి చెప్తూంటే; కరుణ రసం ఒలికిస్తూ వారు అభినయం చేస్తూంటే అక్కడున్న ప్రేక్షకులందరూ కంట తడి పెట్టారు. నిజంగా నాకూ దుఃఖం వచ్చింది. ఎవరూ చూడకుండా బగ్గీలో కూర్చొని నేను ఏడ్చేశాను. కథలోని సన్నివేశాలకు తగినట్టుగా వారు రాగాలను ఎన్నుకొని పాడారు. రోజుల తరబడిగా వారు ఏకధాటిగా అలా పాడుతున్నారంటే వారి ధారణాశక్తిని మనం మెచ్చుకొనాలి. వారి కంఠాలు కంచు గంటల్లాగ మోగాయి" అని తాను చూసిన పిచ్చుక కుంట్ల వారి ప్రదర్శనను వివరించింది తారామతి.

"ఇలాంటి కళాకారులు మన దేశంలో చాలామంది ఉన్నారు. కాని వారికి సరైన పోషణ లేక వారికి పూట గడవడమే కష్టంగా ఉంది", అంటూ సిద్ధేశ్వరి బాధపడింది.

"అప్పుడు తార ఏం చేసిందో చెప్పనా అమ్మా!" అని తారామతి వైపు చూసింది ప్రేమావతి.

"ఏం చేసింది?" అని అడిగింది సిద్ధేశ్వరి.

"వారికి ఒక బహుమతి ఇచ్చింది" అంది ప్రేమావతి.

"ఏం లేదమ్మా! నా చేతి కున్న బంగారం గాజు తీసి బహుమతిగా వారికిచ్చానమ్మా" అంది తారామతి.

"తల్లికి తగ్గ తనయ" అంది ప్రేమావతి.

"నన్ను క్షమించమ్మా!" అంది తారమతి.

"మంచిపని చేశావు కళారాధనే కాదు, కళాపోషణ కూడా మనం చేస్తూండాలి" అంటూ సిద్ధేశ్వరి తారామతిని కౌగిలించుకొంది.

"బతకమ్మ ఆటకు రమ్మన్నారు దొరసానిగారు. వెళ్ళివస్తామమ్మా" అంటూ తారామతి, ప్రేమావతి ఇంటినుండి బయలు దేరారు.

సంధ్యా రాగం

సంధ్యాసమయం. నౌబత్ నగారా మృదు మధురమైన సంగీతాన్ని ఆలపిస్తోంది. బాల హిస్సార్ పైని కూర్చుని మా సాహెబా, అబ్దుల్లాలు రమణీయమైన ప్రకృతి దృశ్యాలను తిలకిస్తూ, ఆనందిస్తున్నారు. రెండు గుట్టలపైన వెలిసిన సంగీత నృత్య మందిరాల పైని చెట్ల సందులలో నుండి సంధ్యా కిరణాలు పడి వారిద్దరినీ మురిపింప జేస్తున్నాయి. అబ్దుల్లా హృదయం పులకించి పోయింది. మా సాహెబా ఆ మందిరాల శోభను చూసి పరవశురాలైంది.

"మాతాజీ! కొంత కాలం ఎక్కడికీ వెళ్ళకుండా ఇక్కడే ఉండి సంగీత శాస్త్రం, భరతశాస్త్రం, రసశాస్త్రం అభ్యసించా లనుకొంటున్నాను" అన్నాడు అబ్దుల్లా.

"అబ్దుల్లా! జీవితమంటే కేవలం విందులు, వినోదాలు, దేశ పర్యటనలే కావు. సంగీత నృత్య ప్రదర్శనలు చూడ్డం మాత్రమే కాదు. జ్ఞాన సముపార్జన జీవితంలో చాలా ముఖ్యం. వివిధ శాస్త్రాలను అధ్యయనం చేస్తే వాటిలోని లోతు పాతులు నీకు బాగా అవగతమౌతాయి. వాటిలోని మంచి చెడ్డలను నీవు గ్రహించి, వాటిని నీవు ఇంకా బాగా ఆనందించగలుగుతావు. ఈ విషయం నీవు గ్రహించినందుకు చాలా సంతోషంగా ఉంది".

ఆనాటినుండి రోజూ అతడు తన తల్లి మందిరానికి వెళ్లి ఆమెతో రాజ్య పాలనా విషయాలను, రాజకీయాలను చర్చించడం మొదలు పెట్టాడు. తీరిక సమయాలలో భారతీయ నృత్య, సంగీత అలంకార శాస్త్రాలను అభ్యసించడం ప్రారంభించాడు. తారామతి ప్రేమావతుల సంగీత నృత్య మందిరాలకు వెళ్లి సంగీత నృత్య కళలను ఆరాధించడం అతని దైనందిన కార్యక్రమ మయింది.

కవులు, పండితులు, శాస్త్రజ్ఞులు, కళావేత్తలు, విద్యావేత్తలు మొదలైన వారందరికి ఆ రెండు మందిరాలు సరస్వతీ మందిరాలైనాయి. ఆ రెండు కళా నిలయాలను దేశవిదేశ రాయబారులు సందర్శిస్తూ ఉండేవారు.

సంగీత, నృత్య ప్రదర్శనలకు తగినట్టుగా తారామతి గానమందిరం, ప్రేమావతి నృత్య మందిరం నిర్మించబడ్డాయి. పలువురు కవులు పలు భాషలలో రచించిన భక్తి గీతాలను, శృంగార పదాలను తారామతి పాడుతుంటే ఆమెతో పోటీపడుతున్నట్టుగా ప్రేమావతి వాటికి నర్తనమాడి, వాటిని అభినయిస్తూ ఉండేది. ఒకర్ని మించి ఒకరు వారి విద్యలను ప్రదర్శిస్తూ వచ్చారు.

ఎవరి విద్యలో – తారామతి అమర గానంలోనా? ప్రేమావతి అద్భుత నర్తనంలోనా? – తమ కవితలు ప్రాణం పోసుకుంటున్నాయో తెలియక కవులు, పదకర్తలు ఉక్కిరి బిక్కిరి అయ్యేవారు.

ఉత్తరాది, దక్షిణాది సంగీత, నృత్య బాణీలు ఆ మందిరాలలో విలసిల్లుతూ వచ్చాయి. దేవగిరి సారంగ దేవుని సంగీత రత్నాకరం, ఓరుగల్లు జాయప గీత, వాద్య రత్నావళుల పైని ఆధారపడిన నూతన సంగీత రీతులు, వాద్య విశేషాలు, భరతుని నాట్యశాస్త్రం, నందికేశుని అభినయ దర్పణం, జాయప నృత్య రత్నావళులపైని ఆధారపడిన నృత్య, అభినయాలు ఆ మందిరాలలో నూతన రీతులలో వెల్లివిరిశాయి.

ఈ యిద్దరు జంట కళాకారులు ఉత్తరాది, దక్షిణాది సంగీత సమ్మేళనమైన "దక్కిణీ" భాణీలో వారి సంగీత నృత్య కళలను ప్రదర్శిస్తూ వచ్చారు. ఉత్తరాది, దక్షిణాది సంగీత నృత్య శాస్త్రవేత్తలు వీరి ప్రదర్శనలను తిలకించి ఆశ్చర్యచకితులై ఆనందపరవశులవుతూ వచ్చారు. నృత్య సంగీత వికాసాలకు అబ్దుల్లా రాజ్య కాలం ఒక నూతన శకంగా పరిణమించింది. అభిరాముని కాలంలో ప్రారంభమైన సాంస్కృతిక సామరస్య సమ్మేళనం అబ్దుల్లా కాలంలో ఒక సంపూర్ణ రూపాన్ని దాల్చినట్లు శాస్త్రవేత్తలు భావింపజొచ్చారు.

పార్సీ, అరబ్బీ, సంస్కృతం, ఆంధ్ర భాషలను ఆ సోదరి లిద్దరు చక్కగా అభ్యసించి, అధ్యయనం చేసి, చక్కని శబ్దోచ్చారణతో ధ్రుపదలు, పదాలు, గజళ్లు, టుమ్రీలు, జానపదాలు ఆలపించి, నర్తనమాడుతుంటే నర్తనవాణి, సంగీత సరస్వతి తమ సమక్షంలో నృత్య సంగీత కచ్చేరీలు చేస్తున్నట్టుగా సందర్శకులు భ్రమ పడుతూ ఉండేవారు.

అంతవరకు రాజదర్బారులకే పరిమితమై యుండిన శాస్త్రీయ సంగీత నృత్యాలను సామాన్య ప్రజలు కని, విని ఆనందించడం మొదలు పెట్టారు. సశాస్త్రీయమైన ఈ సంగీత నృత్యాలు వారికి సరిగ్గా అర్థం కాకపోయినా వారి యెదుట గంధర్వులు పాడుతున్నట్టు, అప్సరసలు నాట్య మాడుతున్నట్టు వారు అనుభూతులు పొందుతూ వచ్చారు. ఈ సదవకాశం వారికి కలిగినందుకు మాసాహెబాను, అబ్దుల్లా కుతుబ్ షాను వారు వేనోళ్ల కీర్తించసాగారు. గోలకొండ ప్రాంతంలో మూగ పశుపక్ష్యాదులు ఆ సంగీత నృత్యాలకు పరవశమౌతూ వచ్చాయి. అలనాటి బాలకృష్ణుని మురళీ గానానికి యమునా నది ఉప్పొంగి, పొరలి ప్రవహించినట్టుగా తారామతి, ప్రేమావతులు సంగీత నృత్యాలకు మూసీనది తరంగాలు గలగల లాడుతూ నాట్యం చేయడం ప్రారంభించాయి.

"మా రాజ్యంలో తారామతి, ప్రేమావతుల రూపంలో సంగీత, నృత్య సరస్వతులు కవలలుగా జన్మించి, మా కీర్తిని దేశవిదేశాలలో చాటుతూ గోల్కొండకు అమరత్వం చేకూరుస్తున్నారు. ఇటువంటి కళారత్నాలను కన్న నీవు చాలా అదృష్టవంతురాలివి సిద్ధేశ్వరీ!" అని ఒకసారి మా సాహెబా సిద్ధేశ్వరిని మెచ్చుకొన్నారు.

"ఇదంతా తమరి చలవే గదా! తల్లీ! మీ ఆదరణే లేకపోతే వా రెక్క డుండేవారో!" అంది సిద్ధేశ్వరి వినయంగా.

“మేము నిమిత్త మాత్రులం సిద్ధేశ్వరీ! అంతా ఆ అల్లా దయ!” అన్నారు మా సాహెబా.

ఈ కవల సోదరీమణుల కీర్తి ప్రతిష్ఠలు దేశ నలుమూలలకు వ్యాపించాయి. వీరి కళా ప్రదర్శనలను ప్రత్యక్షంగా చూడాలని దేశ విదేశాలనుండి కవులు, పండితులు, కళాకారులు, శాస్త్రవేత్తలు మొదలైన వారు గోల్కొండకు రానారంభించారు. ఈ విధంగా దక్షిణాపథంలో ఒక నూతన సాంస్కృతిక వికాసం ప్రారంభమైంది. ప్రజలలో ఒక నూతన చైతన్యం వచ్చింది. సమత మమత పెనవేసుకొన్నాయి. ప్రభువులు వేరు, ప్రజలు వేరు అన్న భావం పోయింది. అందరిలోను సమానత్వం, సమభావం, సమదృష్టి చోటు చేసుకొన్నాయి. మత సామరస్యం ఏర్పడింది.

మహమ్మదీయులతో బాటు హిందువులు కూడా మొహరం మొదలైన పండుగలు చేసుకొనడం ప్రారంభించారు. అనేక మంది హిందువులు పీరులయ్యారు. పీరులెత్తి అగ్నిగుండాలను తొక్కుతూ వచ్చారు. భక్తి ఆవేశాలతో ప్రజలు ఆ సంబరాలలో పాల్గొంటూ వచ్చారు.

భక్తితో నరసింహస్వామికి మహమ్మదీయులు కానుకలు సమర్పించడం ప్రారంభించారు. శ్రీ రామనవమి, దసరా, వసంతోత్సవాలలో హిందువులతో సమానంగా ముస్లింలు పాల్గొనడం ప్రారంభించారు.

హిందూ ముస్లింల మధ్య ‘నీ, నా’ భేదం పోయింది. సాంస్కృతికంగా వీరిరువురు ఏకమై సౌభ్రాతృత్వంతో కలసి మెలసి జీవింపజొచ్చారు.

గోలకొండలో క్షేత్రయ్య

సాయంత్ర మయింది. సూర్యు డస్తమిస్తున్నాడు. ఆకాశంలో పలచని మేఘాలు ఆవరించి ఉన్నాయి. సన్నని చిరు జల్లులు ఉండుండి పడుతున్నాయి. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంది.

తారామతి ప్రేమావతులు తమ మందిర గవాక్షం వద్ద నిలబడి దూరాన పురివిప్పి ఆడుతున్న నెమళ్ళ నర్తనాన్ని తిలకిస్తూ ఆనందిస్తున్నారు. ఆడ నెమళ్లు ముచ్చటగా కూర్చొని మగనెమళ్ల నర్తనాన్ని తిలకించి పరవశం చెందుతున్నాయి.

"అక్కా ! ఈ నెమళ్లకు నాట్యం ఎవరు నేర్పారో గాని పులకించిన దేహాలతో పురులు విప్పి ఎంత రమణీయంగా ఆడుతున్నాయో చూడు" అంది ప్రేమావతి.

"కోవెలలకు సుమధురమైన పాట ఎవరు నేర్పారంటావ్? ప్రేమా! అది ప్రకృతి ధర్మం! అది ఋతుధర్మం! అది ప్రేమానుభూతి! అది ప్రాణికోటికి సహజం! పుట్టిన ప్రతి జీవి కోర్కెలతో జీవిస్తుంది. ఆ కోర్కెలు తీరగానే, తనువు చాలిస్తుంది. ఈ ఋతువులో వీటిని సంతాన కోర్కె కలుగుతుంది. ఆ కోర్కె వాటి ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది. ఆ ఉత్సాహంతో మగ నెమళ్లు పురివిప్పి తమ ప్రియురాండ్రను ఆకర్షించడానికి ఆనందంగా నాట్యమాడతాయి" అని వివరించింది తారామతి.

"సృష్టి రహస్యమంటే ఇదేనా?" అని అడిగింది ప్రేమావతి.

ఇంతలో అలంకార శాస్త్రాన్ని వారికి బోధించిన అయ్యావారు అక్కడికి వచ్చారు. కాని ఆయన్ను గమనించే స్థితిలో ఆ సహోదరు లిద్దరు లేరు. ఈ యిద్దరు తన్మయులై నెమళ్ళ నాట్యాన్ని తిలకిస్తున్నారు. "ఏమిటమ్మా? ఏదో ఋతుధర్మాలను, సృష్టి రహస్యాలను చర్చించుకొంటున్నారు?" అని ఆ అయ్యావారు అడిగారు.

"గురువుగారు, క్షమించండి. మీ రాకను మేం గుర్తించలేదు" అంటూ వారిద్దరూ ఆయన పాదాలను నమస్కరించి, " ఆ ప్రకృతి రమణీయ దృశ్యానికి తన్మయులైనాం" అంది తారామతి.

"తన్మయీ భావమంటే ఇదేనమ్మా! తమ్ముతాము మరచుట, సర్వమును మరచుటయే తన్మయీ భావము.".

"ఆచార్యా! తమరు వేళకాని వేళ వచ్చారు!" అంది ప్రేమావతి.

"తంజనగర విజయరాఘవేంద్రుని ఆస్థానములోని కవుల నందరిని ఓడించి మన గోలకొండ పాదుషావారి ఆస్థానానికి మధుర పదకవి, గొప్ప వాగ్గేయకారుడైన క్షేత్రయ్య వేంచేశారు. తులసిమూర్తి గారితో వాదుసల్ప వచ్చారట! సంగీత నృత్య సరస్వతులను ఆరాధిస్తున్న మీ రిరువురు రేపటి సభకు రావలెనన్న కోరికను ప్రభువుల వారు వెల్లడించారు" అని ఆ గురువుగారు వారికి చెప్పారు.

"గురువుగారు నిలబడే ఉన్నారు. రండి లోన కూర్చొని మాట్లాడుకొందాం" అంది తారమతి.

"ఈ విషయం మీకు చెప్పి వెళ్దామని వచ్చాను. నాకు వేరే పను లున్నవి నే వెళ్లవలయును".

"గురువర్యా! రేపు సభకు తప్పకుండా వస్తాం. ఉద్దండులైన ఇరువురు వాగ్గేయకారులు పద కవితలో జరిపే సంవాదం చూసే అవకాశం దొరుకుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది" అంది తారామతి.

"గురువర్యా! నాకు కొన్ని చిన్న సందేహా లున్నాయి. వాటిని మీరే తీర్చాలి" అంది ప్రేమావతి.

"ఏమిటమ్మా అవి?"

"క్షేత్రజ్ఞులను తంజనగరంలో పండితులు హేళన చేశారట గదా?!"

"ఆయన ప్రజ్ఞ తెలియక వారట్లు చేసిరి."

"మరి క్షేత్రజ్ఞులు మిన్నకున్నారా?"

"ఆయన గొప్ప మేధావి. ఆయన ఎవరినీ తూలనాడక, తాను రామేశ్వరము వెళ్లుచుండినట్లు ఆ సభలో రాజావారి ముందు ప్రకటించి, "మహారాజా! ఒక నూతన పదములో రెండు చరణములు ముగించితిని. మూడవ చరణము గూడ సగము వ్రాసితిని. కాని పూర్తి చేయలేకపోతిని కనుక నేను రామేశ్వరమునుండి తిరిగి వచ్చులోపల మీ ఆస్థానకవులు పూరించిన యెడల సంతసింతును" అని ఆయన చెప్పి తంజనగరము నుండి రామేశ్వరము వెళ్లి, కొద్దిరోజుల తర్వాత తిరిగి వచ్చెను. కాని తంజనగర ఆస్థాన కవులలో ఎవ్వరును ఆ పదమును పూరించలేకపోయిరి. అప్పుడు క్షేత్రయ్య ఆ కవులను చూసి, మందహాసము చేసి, తృటికాలములో ఆ పదమును ముగించినారు. ఆస్థాన కవులు తమ ఓటమిని అంగీకరించిరి. అంతటి ఘనులు క్షేత్రజ్ఞులు."

"ఆయన ముగించలేకనే రామేశ్వరం వెళ్లారా!" అంది ప్రేమావతి.

"ఆయన ముగించలేక కాదమ్మా! ఆయన విజ్ఞుడు కనుక ప్రత్యక్షముగా సవాలు చేయక పరోక్షముగా సవాలు చేసెను."

"అంతే నంటారా?" అని అడిగింది తారామతి.

"క్షేత్రజ్ఞులు కవి శ్రేష్ఠులు, మహిమాన్వితులు. పద కవిసమ్రాట్టు!"

"అంతేనంటరా?" అంది ప్రేమావతి.

"అంటరా ఏమిటి? అంతే మరి!"

"గురువుగారు క్షమించాలి. తంజనగర ఆస్థాన కవులు పురుషహృదయంతో ఆలోచించి, ఆ పదాన్ని పూరించాలని అనుకొని ఉంటారు. క్షేత్రజ్ఞులు స్త్రీ హృదయంతో ఆలోచించి ఉంటారు" అంది ప్రేమావతి.

"చిరంజీవి ప్రేమావతీ! నిన్నే మని దీవించవలయును? నీవు భావనిధివమ్మా!"

"మీ ఆశీర్వాదానికి ధన్యురాలిని."

"ఈ విధముగా మనము చర్చించుకొనుచు కూర్చుండిన యెడల దినములు మాసములు గడచిపోవును. నే వెళ్లెదను."

ఇంతలో సుగుణవతి సిద్ధేశ్వరి దేవి సంధ్యపూజ ముగించి వచ్చి గురువుగారికి పళ్లూ తాంబూలము ఇచ్చింది. గురువుగారు వెళ్లిపోయారు. సిద్ధేశ్వరి దీపాలు వెలిగించి, గూళ్లలో అమర్చడానికి వెళ్లింది.

తల్లికి సహాయం చేసి తారమతి తిరిగి వచ్చేలోగా ప్రేమావతి ఆలోచనలలో మునిగిపోయింది.

"ప్రేమా! ఏమిటా పరవశం? అభినయ మనగానే ఈ లోకాన్నే మరిచిపోతావు. తన్మయత్వంలోకి వెళ్లిపోతావు!"

"ఏం లేదక్కా!"

"క్షేత్రజ్ఞులు ఎంతో మేధావులు. చాలా గొప్పవారు."

"నిజమేనక్కా కాని..."

"కాని?"

"క్షేత్రజ్ఞులు రచించిన ఏ పదం చూచినా స్త్రీకి సంబంధించిన కైశికీ వృత్తి గల శృంగార పదంగా ఉంటున్నది. వాటిలో కన్య, ముగ్ధ, ప్రౌఢ వీరిని గురించే కనిపిస్తుంది. మధ్య వయస్సు స్త్రీల గురించి ఆయన వర్ణించినట్టు కనబడదు. ఎందువల్లనంటావు? ఆయనకు 'లోల' గురించి తెలియదా?" అప్పుడు సిద్ధేశ్వరి కలుగజేసుకొని, "మానవ జీవితంలో బాల్య, కౌమార, యౌవన దశలు ముఖ్యమైనవి. ఆ తర్వాతి దశలు ఆధ్యాత్మిక చింతన గలవి. తెలిసీ తెలియని దశ బాల్యం, కౌమార దశను కన్య, ముగ్ధ, ప్రౌఢ, నవోఢలుగా అలంకారికులు వర్ణిస్తారు. ఆ తర్వాత వచ్చేది యౌవనం. ఈ దశలో మానవులు తమ జీవితాలను సంపూర్ణంగా అనుభవిస్తారు. ఆ అనుభూతుల్నే కవులు వివిధ నాయికల రూపాలలో వర్ణిస్తారు. ఈ యౌవన దశే అనుభవ యోగ్యమైంది. ఆకర్షణీయమైంది. శారీరకంగా, మానసికంగా మానవులు పరిపక్వం చెందే దశ ఇది. శరీరం, మనస్సు ఈ దశలో శక్తివంతమై ఉంటాయి. ఇక నీవడిగిన "లోల" దశలో శరీరానికి, మనస్సుకు సంఘర్షణ వస్తుంది. మనస్సు పరిపరి విధాలుగా పరుగెత్తినా, శరీరం అందుకు అనుకూలించదు. శరీరం సౌందర్యం, బిగి పోకుండా ఉండాలని ఆమె కోరుకొన్నా వయస్సు మీద పడడం వల్ల శరీరం వదలిపోక తప్పదు. సడలిపోక తప్పదు. తుమ్మెద రెక్కల్లాంటి ఆమె నల్లని శిరోజాలలో తెల్లని వెండి తీగలవంటి వెంట్రుకలు వెక్కిరిస్తూ బయట పడతాయి. ఆమె చెంపలు తెల్లబడతాయి. అవి ఆమె వయస్సును ఆమెకు గుర్తు చేస్తుంటాయి. వయస్సును దాచి పెట్టాలని ఆ తెల్లవెంట్రుకలను కాటుకతో కప్పి ఉంచడానికి ప్రయత్నిస్తే, అవి ఆమె అమాయకత్వాన్ని చూచి, నవ్వి మళ్లా కనిపిస్తాయి. దానిమ్మ గింజలవంటి ఆమె పలువరసలలో అక్కడక్కడ వెలితి కనబడుతుంది. ఉచ్చారణలో స్పష్టత తగ్గుతుంది. ముడతలు పడుతున్న శరీరానికి కస్తూరి, పునుగు జవ్వాది లేపనాలు ఎన్ని అలిమినా అది తాత్కాలిక ప్రయత్నమే అవుతుంది. వయస్సుతో పాటు బుద్ధి వికసించినా, ఆరమగ్గిన పండులా శరీరం వదలిపోతుంది. దాని ఆకర్షణ తగ్గిపోతుంది. అందువల్లనే కవులు తమ కవితలకు, ముఖ్యంగా శృంగార కవితలకు యౌవనుల చేష్టలనే వస్తువులుగా ఎన్నుకొంటారు. క్షేత్రజ్ఞుని పద కవితలు ఈ భావవికాసం గొప్పగా కలవి. ఈ భావ వికాసంలో క్షేత్రయ పదాలకు మించినవి ఎక్కడా లేవు. అభినయిస్తే వాటినే అభినయించాలి. వీటి అభినయాన్ని చూసే రసిక జనులు ఆనందానుభూతిని పొందుతారు. రేపు సభకు వెళ్లండి. మీకే తెలుస్తుంది" అని వివరించింది సిద్ధేశ్వరి.

అబ్దుల్లా కుతుబ్‌షా వారి దర్బారు

క్షేత్రయ, తులసిమూర్తి, గణనాథుడు, కవి పండిత గాయకులు, తారామతి, ప్రేమావతులు ఇతర కళాకారులతో అబ్దుల్లా కుతుబ్‌షా వారు కొలువు తీరి యున్నారు.

క్షేత్రయ గోలకొండ కేతెంచి మూణ్ణాలాయెను. ఆయన నుండి ఒక చిన్న పదం కూడా వెలువడలేదు.

ఆనాటి సాయంత్రం సూర్యు దస్తమిస్తున్నాడు. విరహంతో ఏడ్చి, ఏడ్చి యుండిన విరహోత్కంఠిత నాయిక నేత్రంలా సూర్యబింబం ఎర్రగా ఉంది. కవితా గోష్ఠిని ప్రారంభించమన్నట్టు పాదుషావారు క్షేత్రయ వైపు చూశారు.

అప్పుడు వెంటనే “మువ్వగోపాలుడు మోడి చేసుకొన్నాడు. మొన్నటాలనుండి రాడు నీ తోడు, నే నెవ్వరి నంపుదు, ఏలాగు తాళుదు” అంటూ భైరవీ రాగం, త్రిపుట తాళంలో క్షేత్రయ్య పదాన్ని ఆలపించాడు. వెంటనే తారామతి, “చెంతనేనుండగా చింతింతువేలనమ్మా!” అంటూ ఆలపించి ప్రేమావతి వైపు చూసింది. అప్పటికే క్షేత్రజ్ఞుని పదభావానుభూతిని పొందిన ప్రేమావతి సహజరీతిలో సాత్త్వికభావ ప్రదర్శనను మొదలు పెట్టింది. విస్మయానందాలను పొందిన క్షేత్రయ్య నిశ్చేష్టుడై విప్పారిన నేత్రాలతో ప్రేమావతిని చూస్తుండిపోయాడు. దైన్యం, శంక, ఆవేదనలను ప్రేమావతి ప్రదర్శించింది. “చెంతనేనుండగా చింతింతువేలనే” అని తారమతి పాడగా, ఉత్సాహం, ఆనందం ప్రదర్శించి, ఆనంద భాష్పాలతో ప్రేమావతి అభినయాన్ని ముగించింది.

“భళిరా! ఎవ్వరీ జవ్వనులు? ఇంతవరకు నేనెరుగ నిట్టివారిని. మువ్వగోపాలనుని ముద్దు మోహనాంగులవలె నున్నారు.”

“శీతలాదేవి వరప్రసాదులం

సిద్ధేశ్వర సుగుణవతీ పుత్రికలం

తారామతి, ప్రేమావతులం – ఆర్యా చిత్తగించండి.”

“సుందరవదనులారా! మీ కీ పాండితీ ప్రతిభ ఎట్లు వచ్చినది?” అని క్షేత్రయ ఆశ్చర్యంతో అడిగారు.

“మా మాతృమూర్తిని సేవించిన ఫలితం ఇది” అంది ప్రేమావతి.

“నా నాయిక నా హృదయంలో ఉండగానే సంగీత అభినయాలతో మీరెట్లు ఆమెను అలంకరించగలిగినారు?”

"ఆర్యా! చెప్పమంటారా? నిజం చెబుతున్నందుకు మీరు మమ్మల్ని మన్నించాలి."

"తారామతీ! ఇది పండితసభ, కవితాగోష్ఠి కనుక నీవు నీ అభిప్రాయాన్ని నిర్భయంగా చెప్పవచ్చును. చర్చించవచ్చును" అన్నాడు తులసిమూర్తి. తారామతి ప్రేమావతి వైపు చూసింది.

"ఆర్యా! మీరు ఎంత చక్కని పదం చెప్పినా, స్త్రీల భావాలను, స్త్రీల హృదయంతో మీరు ఆలోచించి చెప్పినా, అది మీ పురుష హృదయంలో నుండి వచ్చినదే కదా!" అంది ప్రేమావతి.

"తారామతీ! నీ అభిప్రాయం?" అడిగాడు క్షేత్రయ్య.

"ఆర్యా! మా తనువులు వేరైనా, మా హృదయాలు ఒక్కటే!" అంది తారామతి.

"అంటే మీరిద్దరు కవలలా?"

"మా మాతాపితరుల తపః ఫలం శీతలా దేవి వరప్రసాదులం" అంది ప్రేమావతి.

"ప్రేమావతీ! మధ్యలో అడ్డువచ్చినందుకు చింతిస్తున్నాను. నీ అభిప్రాయం పూర్తిగా చెప్పు." అన్నాడు క్షేత్రయ్య.

"ఆర్యా మేము స్త్రీలం గదా! అందువల్ల మీ భావాలను మేం స్త్రీ హృదయంతో అనుభూతిని పొందాం" అని వివరించింది ప్రేమావతి.

"భేష్! ఇట్టి సభకొరకే నేనింతకాలం వేచి యున్నాను."

"మీ వంటి మహానుభావుల దర్శనంకొరకై మేమూ వేచి యున్నాం. ఈనాడు మేం ధన్యులమయినాం" అన్నారు తారామతి ప్రేమావతులు. వారిరువురు క్షేత్రయ్యకు పాదాభివందనం చేశారు.

"ఆర్యా! తులసిమూర్తిగారూ! ఈ సభ ఇకమీదట వాదసంవాదముగా గాక కవితా గోష్ఠిగా, నాట్య కచ్చేరిగా మార్చుకొనెదమా?" అని అడిగాడు క్షేత్రయ్య.

"నాకు సమ్మతమే" అన్నాడు తులసిమూర్తి.

ఆనాటి నుండి ఆ పండితగోష్ఠి ఒక విద్వత్సభగా మారి, ఆ యిరువురి కవితా గోష్ఠితోను, తారామతి సంగీతంతోను, ప్రేమావతి అభినయంతోను నలభై రోజులు దిగ్విజయంగా కొనసాగింది.

ఆనాడు ఆ విద్వత్సభకు చివరిరోజు. కవులకు, పండితులకు, కళాకారులకు సత్కారాలు జరగనున్నరోజు.

"క్షేత్రజ్ఞుల వారికి చిన్న మనవి" అంది తారామతి.

"చెప్పమ్మా!" అన్నాడు క్షేత్రయ్య.

"మనవి కాదు చిన్న సందేహం" అంది ప్రేమావతి.

"అడగండి."

"మీరు మా సందేహాన్ని తీర్చకపోతే భావితరాలవారు ఈ సందేహంతో అనేక వింత వింత కథలు అల్లగలరు."

"మంచిది. అడగండి".

"ఆర్యా! తమకు ఒక ప్రేయసి - మోహనాంగి ఉందట కదా! ఆమె ప్రేరణతోనే మీరు ఈ పదాలు ఇంత చక్కగా కూర్చగలుగుతున్నారని విన్నాము. ఆమె దర్శనం మాకు ఇప్పించగలరా?"

క్షేత్రయ కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. అతని నేత్రాలనుండి సహజ కాంతి తొలగిపోయి ఒక దివ్యకాంతి చోటు చేసుకుంది. అతని తనూలతలో అనేక భావానుభూతులు తారామతి ప్రేమావతులకు గోచరించాయి. క్షేత్రయ్య మెల్లగా, సన్నగా, తీయగా బిలహరి రాగం ఆలపించాదు:

"ఇంత తెలిసి యుండి ఈ గుణమేలరా?

పంతమా మువ్వగోపాల! నా సామిగ ॥ఇంత॥

అలుక చేసి ఇంటికి రావైతివి నెనరైన

చెలికత్తెలున్నారా? పిలువ వచ్చేరా?

చెలికత్తెవైన నీవే - చెలువుడవైన నీవే

తలచి చూడ నా పాలి దైవము నీవే ॥ఇంత॥

"చాలు! స్వామి చాలు. కవిరాజా చాలు! మీలోని స్త్రీ హృదయానికి మా జోహార్లు. ఆ మోహనాంగిని మీలోనే మేం దర్శించాం. మీరు మహా పురుషులు గనుకనే ఇంతటి మహత్తరమైన పదాలను రచించగలిగారు. భావితరాల వారు బాగుగా మీ భావాల అర్థ మెరిగి, మీ పదాల నాలపించి, అభినయించి, రసిక హృదయాల మురిపింపజేయాలని బాసర సరస్వతికి భక్తితో ప్రణమిల్లుతున్నాం" అన్నారు ఆ సోదరీమణులు.

క్షేత్రయార్యుడు గోలకొండ నుండి వెడలిపోయే దిన మాసన్నమైంది. ఆనాటి ఉదయమే తారామతి, ప్రేమావతి, మాతృమూర్తి సుగుణవతీ సిద్ధేశ్వరితో కలిసి వెళ్లి, క్షేత్రజ్ఞుని దర్శించి, "మీ పాద ధూళితో మా మందిరాన్ని పావనం చేయండి" అని కోరారు.

సంగీత విద్వాంసుల మేళతాళాలతో ముత్యాల పల్లకీలో క్షేత్రయ్య సిద్దేశ్వరి మందిరానికి వెళ్లాడు. వెండి చెంబుతో పన్నీరు పట్టుకొని ఆ తల్లీ కూతుళ్లు ఆయనకు ఎదురేగి, ఆయన పాదాలను పన్నీరుతో కడిగి, పట్టు వస్త్రాలతో వత్తేరు.

పల్లకీనుండి ఇంటి గుమ్మం వరకు రజకులు పరచిన తెల్లని చలువ వస్త్రాలపైన నడిపించి, క్షేత్రజ్ఞుని వారి మందిరంలోనికి ఆహ్వానించారు. వెండి గొలుసుల తూగుటుయ్యాలలో ఆయనను కూర్చుండబెట్టి, కస్తూరి, పునుగు, జవ్వాది, అగరు, చందన లేపనం ఆయన పాదాలకు అలిమి, పుష్పాలతో పూజించి, "స్వామీ! చివరి సారిగా ఒక్కసారి ఆ మువ్వగోపాలునిని సందర్శనం మాకు కలుగజేయండి" అని వారు క్షేత్రయ్యను ప్రార్థించారు.

క్షేత్రయ చిరుమందహాసంతో-

"శ్రీనిధే - మువ్వగోపాల చేపట్టి

న న్నేలుటకు

నా చెలు లున్నారా! నమ్మిక ఇచ్చేరా!

నా చెలువైన నీవే ! నమ్మిక ఇచ్చిన నీవే!

అనగా బల్మెద నా ఆనందము నీవే!" అని ఒక పదాన్ని ఆలపించారు.

"స్వామీ! మా జన్మలు తరించాయి"

అంటూ ఆ సోదరీమణు లిద్దరు క్షేత్రయ్యకు హారతి ఇచ్చారు.

క్షేత్రయ్య వారిద్దరిని ఆశీర్వదించి, దక్షిణాదేశానికి బయలుదేరి వెళ్లాడు.

క్షేత్రయ్య పాద ధూళి రాలిన వస్త్రాలను భద్రంగా మడిచి తెచ్చి ఆ సోదరీమణులకు రజకులిచ్చారు. ఆ వస్త్రాలలోని పాద ధూళిని ఆ సోదరీమణులు సేకరించి తలపైని కొద్దిగా నుంచుకొని వెండి భరణిలో వేసి, పూజామందిరంలో దాచుకొన్నారు.

యశోధరా దేవి

టుమ్రీ గానానికి వారణాసి ప్రసిద్ధిగాంచింది. టుమ్రీలనే గాక టప్పా, ఖ్యాల్, దాదర, కజరీ, జూలా మొదలైన ఇతర గీతాలను కూడా అక్కడి గాయకులు చక్కగా పాడతారు.

ఒకనాడు వారణాసి గాయకురాలైన యశోధరా దేవి గాన కచ్చేరీని సిద్ధేశ్వరీ సుగుణమతి తన ఇంట ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఉత్తరాది అలంకారాలతో మేలు ముసుగు వేసికొని, తూగుటుయ్యాలలో కూర్చుని ప్రేమావతి కూనిరాగం తీస్తూ ఊగుతూంది. వాద్యకారులు శ్రుతి చేసి, మేళవించుకొంటూండగా యశోధరాదేవి తన వాద్య బృందంతో వచ్చింది. ఆమె వెంట సిద్ధేశ్వరీ సుగుణమతి, తారామతి గూడ ఉన్నారు. వీరిద్దరు యశోధర బసకు వెళ్ళి సకల మర్యాదలతో ఆహ్వానించి ఆమెను తీసుకొని వచ్చారు. ప్రేమావతి యశోధరకు ఎదురు వెళ్లి ఆమెను సాదరంగా తీసుకొని వచ్చి, కూర్చుండబెట్టింది.

ఆ హాలంతా అత్తరువుల సువాసనలతో ఘుమఘుమలాడింది. వాద్య బృందంవారు వారి వాద్యాల శ్రుతులను సరిచేసుకొన్న తర్వాత "ఏమి గానం చేయమంటా" రని యశోధరా దేవి అడిగింది.

ప్రేమావతి ఆమెకు కర్పూర సుగంధ తాంబూల మిచ్చి "జూల గీతంతో మీ కచ్చేరీ ప్రారంభించండి" అని కోరింది.

"అదంటే మీ కిష్టమా?" అని యశోధర అడిగింది.

"అది నా యభిమానగీతం. అందుకే ముందుగా దానిని పాడమని మిమ్మల్ని కోరుతున్నా"నంది ప్రేమావతి. ఆమె కింకా బాల్యం పోలేదని గ్రహించి, ముసి,ముసిగా నవ్వుతూ జూల గీతం పాడదానికి యశోధరాదేవి తన కంఠాన్ని వాద్యాల శ్రుతితో కలుపుతూ రాగం ఆలపించింది.

అది ద్వాపరయుగం. అది రేపల్లె గ్రామం. చిన్నికృష్ణుని ఊయలలో పడుకోబెట్టి, అతన్ని నిద్రపుచ్చుతూ యశోదమ్మ పాడిన గీతమది. అదొక కథ. అది రామకథ. చిన్నికృష్ణుడు ఆ గీతాన్ని వింటూ, 'ఊ' కొడుతూ నిద్రలోకి జారిపోతున్న ముచ్చట అది.

"పూర్వం అయోధ్యానగరంలో దశరథు డనే రాజుండేవాడు. అతనికి ముగ్గురు భార్యలు. పెద్ద భార్య కౌశల్య. శ్రీరాముడు ఆమె కుమారుడు. కిలకిల నవ్వుతూ, తల్లిని చూస్తూ, యశోదా తనయుడు "ఊ" అన్నాడు కథను కొనసాగించమన్నట్లు. ఆ రాముడు పెరిగి, పెద్దవాడైనాడు. శివుని విల్లు విరిచి, సీతను పెండ్లాడాడు. అప్పుడు ఆ బాలకృష్ణుడు ముచ్చటగా చప్పట్లు కొట్టి 'ఊ' అంటూ కథను ముందుకు సాగించమని

తొందర పెట్టసాగాడు. ఆ శ్రీరాముని పట్టాభిషేకానికి అన్ని ఏర్పాట్లు దశరథుడు చేశాడు. రాముని సవతి తల్లి పట్టాభిషేకానికి అడ్డు తగిలింది. ఆమె కోర్కె ప్రకారం రాముడు పద్నాలుగు సంవత్సరాలు అడవిలో ఉండడానికి వెళ్లాడు. ఆ బాలగోపాలుడు ఖిన్నుడయ్యాడు. ఆ యడవిలో సన్యాసి వేషంలో రావణాసురుడు వచ్చి సీతను అపహరించుకొని వెళ్లిపోతున్నాడు. అప్పుడు వెంటనే ఆ చిన్నికృష్ణుడు, "లక్ష్మణా! విల్లుతే, విల్లుతే" అని గట్టిగా ఆదేశించాడు.

అంతవరకు మైమరిచి వింటూ ఆ గానామృతాన్ని గ్రోలు తుండిన ఆ కళాకారులందరూ ఆ చిన్ని కృష్ణుని కేకకు ఉలిక్కిపడి, స్వాప్నికావస్థనుండి మేల్కొన్నారు, ఆనందాశ్రువులు రాల్చారు. "భేష్ భేష్" అంటూ వారందరూ చప్పట్లు కొట్టారు.

ఆ తర్వాత యశోధరాదేవి తనకు ప్రియమైన ఒక టుమ్రీని సున్నితంగా ఆలపించింది. "శ్యామసుందరుని దర్శనం కోసం నా హృదయం తల్లడిల్లుతోంది" అన్నది ఆ టుమ్రీలోని భావం. శ్రీకృష్ణుని దర్శనం కోసం తపించి, తపించి, తల్లడిల్లిన తపస్విని భక్త మీరాబాయి ఆ కాస్సేపు యశోధరాదేవిలో వారి కనులకు సాక్షాత్కరించింది. ఇంతలో ఒక పరిచారిక వచ్చి తంజావూరు నుండి వచ్చిన ఒక వార్తాహరుని ప్రవేశపెట్టింది. ఒక లేఖను సిద్ధేశ్వరీ సుగుణమతికి అత దండజేశాడు. దాంతో యశోధరాదేవి గానకచ్చేరి ముగిసింది. ఆమెను మర్యాద పూర్వకంగా సాగనంపి, తాపీగా ఆ లేఖను సిద్ధేశ్వరి చదివి తన కుమార్తెకలు చదవమని ఇచ్చింది.

రఘునాథ భూపాలుని ఆస్థాన కళాకారులు జయలక్ష్మి, ఆమె కుమార్తెలు ధనలక్ష్మి, వరలక్ష్మి, అక్బర్ షా రచించిన "శృంగారమంజరి" ని అధ్యయనం చేసినవారు. ఆ రసశాస్త్ర గ్రంథంలోని నాయికా ప్రకరణలతో క్షేత్రయ పదాలను సమన్వయ పరచడం గురించి తారామతి ప్రేమావతులతో చర్చించడానికి వారు ప్రత్యేకంగా గోలకొండ వచ్చినట్లు ఆ లేఖలో ఉంది.

తంజనగరం కళాకారులు

వెంటనే మేనా తెప్పించుకొని ఈ తల్లీ కూతుళ్లు, ఆ తల్లీ కుమార్తెలను చూడడానికి వారి బసకు వెళ్ళారు. వీరు వచ్చినట్లు తెలిసి ఆ తంజావూరు కళాకారులు ఎదురుగా వచ్చి స్వాగతం పలికి, సాదరంగా ఆహ్వానించారు.

"క్షేమమా శతలేఖిని శుకవాణి మధురవాణి?" అని తారామతి వారిని అడిగింది.

"ఆంధ్ర గీర్వాణ భాషలందు సమముగా కవిత లల్లిన రఘునాథనాయకుని మన్ననలు బడిసి, అతని సరసను ఏనుగు నెక్కి ఊరేగిన రామభద్రాంబ భద్రమా?" అని సిద్ధేశ్వరి అడిగింది.

"ముద్దుగా ముత్యాల పల్లకిలో నమరి, స్తోత్రగానములను ఆలపించు బిరుదు మిరారులు ముందు నడువ, పగటి దివిటీల వారు వెంటరాగ, రఘునాథ భూపాలసభ కేగి, ప్రేరణ కేళికలు చేయు ముద్దు చంద్రరేఖ ముచ్చట లేమి?" అని ప్రేమావతి అడిగింది.

"భగవంతుని కృపవల్ల అందరూ క్షేమమే" వయస్సులో కొద్దిగా పెద్దవారయ్యారు" అని చెప్పి,

"తము దామె వత్తు రర్థులు

క్రమమెరిగిన దాత కడకు, రమ్మన్నారా

కమలంబు లున్నచోటికి

భ్రమరంబుల నచ్యుతేంద్ర రఘునాథభూపాలా" అంటూ రఘునాథ భూపాలుని సభలో ప్రవేశించి, పదముల నల్లి, క్షేత్రయ్య సభికులను సమ్మోహితులను చేశారు. అతని పదములలోని భావములను చక్కగా అభినయిస్తూ, మీ కళా జీవితములను తరింప జేసుకొంటున్న మీ మువ్వురు క్షేమమే గదా?" అని జయలక్ష్మి వీరి కుశల మడిగింది.

ఈ విధంగా ఒకరి నొకరు ప్రశ్నల వర్షంతో ముంచెత్తుతూంటే అవి మల్లెల పూజల్లులై వారందర్నీ ఆనంద పరవశుల్ని చేశాయి.

"పెద్దలు, పండితులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, మిమ్మల్ని కళానిధులుగా మెచ్చుకొంటూంటే విని, మీ కళా విజ్ఞానంలో పాలుపంచుకొనాలని మేం ఇంతదూరం వచ్చాం" అంది ధనలక్ష్మి.

"ముఖ్యంగా అక్బర్ షా వారు రచించిన శృంగారమంజరి గురించి వివరంగా మీ వద్ద తెలుసుకొనాలని వచ్చాం. ఆయన పారశీకులు. మత భావాలతో పెరిగినవారు. హైందవకళా జీవన విధానానికి చెందిన ఆ యమర గ్రంథాన్ని వారెలా రాయగలిగారు?" అని వరలక్ష్మి అడిగింది.

"మతం మారినా, భాష వేరైనా, ప్రాంతం అన్యమైనా మానవ హృదయం ఒక్కటే గదా? ఎండ కన్నెరుగనీయకుండా, ముద్దుగా పెంచి, పెళ్లిచేసి, తన కుమార్తెను అత్తవారింటికి పంపించే రాజమాత హృదయం, పేదరికంతో పూరిగుడిసెలో జీవిస్తూ, ఎండవానలకు ఓర్చుకొంటూ, ఆకలితో అలమటిస్తూ, పెంచి, పెద్దచేసి, పెళ్లి చేసి, తన కుమార్తెను అత్తవారింటికి పంపించే పేదరాలి హృదయం ఒక్కటే గదమ్మా? మానవ హృదయాన్ని, ప్రత్యేకంగా స్త్రీ హృదయాన్ని చక్కగా అర్థం చేసుకొన్నవారు అక్బర్‌షా వారు. అందుకే అంత గొప్ప అలంకార శాస్త్రగ్రంథాన్ని వారు వ్రాయగలిగారు. అమర కవి కాళిదాసు శకుంతలకు వీడ్కోలు చెప్పిన ఘట్టంలో కణ్వ మహర్షి నోటంట చెప్పించిన శ్లోకాలు నాలుగే కదా? ఆ నాలుగు శ్లోకాలే ఆయనకు అమరత్వం చేకూర్చాయి" అని సిద్ధేశ్వరి వివరించింది.

"క్షేత్రయ్యది శృంగార కవిత్వం. నాయికా నాయకుల విరహ వియోగాలను వర్ణించే ప్రణయ కవిత్వం ఆయనది. అయితే అది కేవలం శారీరక శృంగారానికి సంబంధించిన కవిత్వం కాదు. ఆధ్యాత్మికంగా ఆ యెడబాటును ఓర్చుకొనలేక, పరిపరివిధాలుగా పరితపిస్తూ, పరమాత్మ సంయోగాన్ని కోరుకొంటుంది. ఇదే క్షేత్రయ పదాలలోని అంతరార్థం అని మనం గ్రహించాలి" అని ప్రేమావతి వివరించింది.

"అందుకే కైశికీవృత్తి ప్రధానంగా గల నాయకీనాయకుల శృంగారాన్ని సంభోగ శృంగారం, విప్రలంబ శృంగారం అని రెండు విధాలుగా శాస్త్రకారులు పేర్కొన్నారు. అయితే విప్రలంబ శృంగారంలో విజృంభించినంతగా అభినయంలో మనం ప్రత్యక్షంలో విజృంభించలేం," అంటూ ఇంకా ఏమో చెప్పబోయింది వరలక్ష్మి.

"మీ మాటలకు అడ్డువస్తున్నందుకు క్షమించండి. మీరు అభినయ మంటున్నారు. అభినయాన్ని ఆంగీకం, వాచకం, ఆహార్యం, సాత్వికం అని నాలుగు విధాలుగా భరతాచార్యుడు, నందికేశుడు విడదీశారు. మరిప్పుడు చెబుతున్నది ఆంగీక సాత్వికాల గురించేనా?" అని ప్రేమావతి అడిగింది.

"ఆంగీకం అర్థాభినయాన్ని తెలియజేస్తుంది. ఇది పిల్లలాట. భావాభినయం గొప్పది. దీనినే మనం సాత్విక మంటున్నాం. ఇందులో శుద్ధసాత్వికం ఇంకా శ్రేష్ఠమైనది" అంది జయలక్ష్మి.

"మీ భావాన్ని ఇంకాస్త విపులీకరించండి" అంది తారామతి. "ముఖరాగ, ముఖాభినయాల్లో మనస్సులోని భావం స్పందించినప్పుడు ముఖఛాయలు మారతాయి గదా? ఈ భావ ప్రకటన చాలా గొప్పది. ఇది గొప్ప కళాకారులకే సాధ్యం. శ్వాసనిశ్వాసలకు గూడ తాళలయలను పలికిస్తూ, భావస్పందనలను తెలియజేయడమే ఉత్తమోత్తమమయిన అభినయకళ" అంది జయలక్ష్మి.

"ఈ యనుభూతి కొరకే గదా మన ఋషులు ఏళ్లతరబడి తపస్సులు చేస్తూ వచ్చారు" అంది తారామతి.

"అందుకే గదమ్మా, తాళాలన్నింటిలోను, త్రిపుట తాళానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చి క్షేత్రయ్య తన పదాలను రచిచాడు" అంది జయలక్ష్మి.

"ఇతర తాళాలతో గూడ ఆయన నాయికులను సృష్టించాడు గదా?" అంది ప్రేమావతి.

"సృష్టించాడు. సృష్టించకపోలేదు. ఇతర తాళాలు చిన్నబుచ్చుకొంటాయోమోనని ఇక్క డొకటి, అక్కడొకటి రచించాడు. అవి చిలకకొట్టులు" అంది జయలక్ష్మి. అందరూ నవ్వుకొన్నారు.

"ఎందువల్ల నంటారు?" అని అడగింది ప్రేమావతి. అందరూ ఒక క్షణకాలం నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"మానవ శరీరానికి ఒక బాహ్యరూపమున్నట్లు తాళానికి గూడ ఒక రూపముంది. ఆ రూపాన్ని మనం అర్థం చేసుకొనగలిగితే దానిలోని రసాన్ని మనం ఆస్వాదించగలుగుతాం. దీని ఆధారంతో ఆ ధ్వనిలోని భావసౌందర్యాన్ని వాద్యకులు వెల్లడి చేయగలుగుతారు. ఈ ధ్వని ప్రభావాన్ని అనుసరించే మన ప్రాచీన శాస్త్రవేత్తలు వివిధ రాగాలను, తాళాలను నిర్ణయించారు" అని సిద్ధేశ్వరి సుగుణమతి వివరించింది.

ఆమె పాండిత్య ప్రతిభకు అందరూ ముగ్ధులయ్యారు.

"శృంగారానికి ఇంత ప్రాముఖ్యాన్ని పదకర్తలు ఎందుకు ఇచ్చారంటారు అమ్మా" అని తారమతి అడిగింది.

"కైశికి, ఆరభటి, భారతి, సాత్వతి అని వృత్తులు నాలుగు అన్న విషయం మీ అందరికీ తెలుసు. వీటిలో కైశికి వృత్తి లాస్యనర్తనంలోని శృంగారాభినయంలో ఎక్కువ ప్రాధాన్యం వహిస్తుంది" అంది సిద్ధేశ్వరి.

"ఎందువల్ల నంటారు?" అని జయలక్ష్మి అడిగింది.

"సృష్టికి మూలం శృంగారం. శృంగారం లేకపోతే కోరిక లుండవు. కోరికలు లేకపోతే సృష్టికార్యం జరగదు. పురుషుడు బీజశక్తి, స్త్రీ పదార్థశక్తి. వీటి పరస్పర ఆకర్షణే శృంగారం. బీజశక్తి పదార్థశక్తిని చేరినపుడు పదార్థశక్తి దానిని తనలో ఇముడ్చుకొంటుంది. తన గర్భంలో బీజశక్తిని పోషించి, పెంచి, దినదినాభివృద్ధిని గావించి ఒక నూతన రూపాన్ని ఆ పదార్థశక్తి లోకానికి అందజేస్తుంది. ఆ రూపం లోకంలో పెరిగి, పెద్దదై వివిధ వయస్సుల్లో వివిధ అనుభూతుల్ని అనుభవించి, సృష్టిని పెంచి, అనంత వాయువు వాయువుల్లో కలిసిపోతుంది. ఈ సృష్టికి క్రియను తమ శాస్త్రగ్రంథాలలో పండితులు వివరించారు. కవులు తమ కవితలలో వర్ణించారు. సంతానాభివృద్ధికి మూలం సంసారులు. సన్యాసులు జన్మిస్తారు కాని సృష్టికి తోడ్పడరు. తాము తరించాలనే సన్యాసులు నిత్యం ఆలోచిస్తుంటారు. కాని సృష్టిని గురించి తలంచరు" అని సృష్టి క్రియను గురించి సిద్ధేశ్వరి వివరించింది.

"అయితే సన్యాసులు స్వార్థపరులు" అంది తారామతి.

"కారు; వారిని అలా అనడానికి వీలు లేదు. ఎందుకంటే తరించాలనుకొనడం వారి లక్ష్యం" అంది సిద్ధేశ్వరి.

"వీటిలో ఏది ఉత్తమం?" అని ప్రేమావతి అడిగింది.

"రెండు ఉత్తమమైనవే, ఒకదాని నొకటి కించపరచనంతవరకు" అంది సిద్ధేశ్వరి.

"మనం రసచర్చనుండి వేదాంతంలోకి వెళ్లిపోతున్నాం" అంది జయలక్ష్మి.

"ఇవి జీవిత సత్యాలు. వీటిని తెలుసుకొంటే కళల పరమార్థాన్ని గ్రహించగలుగుతాము జగజ్జనని. ఆదిశక్తి అయిన స్త్రీమూర్తిని సర్వసంగ పరిత్యాగులైన యోగి పుంగవులు గూడ "మాతృదేవోభవ!" అని అభివర్ణిస్తారు" అంది సిద్ధేశ్వరి.

"సర్వదుఃఖాలకు స్త్రీయే హేతువని కొంద రంటారు" అంది వరలక్ష్మి.

"ఈ రెండు రకాల అభిప్రాయాలు గల ఉభయులు ఆ స్త్రీ గర్భంనుండి జన్మించినవారే గదా?" అంది జయలక్ష్మి.

"ఎన్నో జన్మల తపఃఫలం ఈ మానవజన్మ. మానవజన్మల తపఃఫలంగా మనం కళాకారులుగా జన్మించాం. కనుక మనం మన జన్మలను సార్థకం చేసుకొనాలి" అంది సిద్ధేశ్వరి.

ఆమె ఆధ్యాత్మిక బోధనకు అక్కడున్న కళాకారులందరు ఆశ్చర్యచకితులయ్యారు.

"మరి, కొందరు కళలను కాసులకు అమ్ముకొంటారు గదా?" అని వరలక్ష్మి అడిగింది.

"అది భుక్తికోసం, కాని కాసింత సుఖం కోసం కళలను అమ్ముకొనకూడదు. జన్మరాహిత్యం కోసం మనం పాటుపడాలి" అంది సిద్ధేశ్వరి.

"అంతకు మించిన పరమార్థమేమైనా ఉందా?" అని అడగింది ధనలక్ష్మి.

"అంతకు మించిన పరమార్థం ఆత్మానందం. దైవారాధనలో మనం పూజాపుష్పాలం కావాలి. విజ్ఞాన వంతులకు మన కళలతో మనం విందుచేయాలి. నిరక్షరాస్యులకు మనం జ్ఞానప్రబోధం చేసి, వారి జీవితాలను తరింపజేయాలి. కళారాధనలో నిజమైన పరమార్థం ఇదే" అని సిద్ధేశ్వరి వివరించింది.

"భేష్! మీరు అక్షరాల సిద్ధేశ్వరులే. మీ వంటివారిని కలిసి, సంభాషించినందుకు మేము ధన్యులం. మీ వంటి విద్యావంతురాలు, సుగుణవంతురాలు తల్లియైనందుకు తారామతి ప్రేమవతులు ఎంతో అదృష్టవంతులు. మీ విద్వత్తుకు మనసారా నమస్కరిస్తున్నాను" అంది జయలక్ష్మి.

ఇంతలో నాదస్వర, శృంగభేరి వాయిద్యాలతో అంబాలయ పూజారి అక్కడకు వచ్చి, "సిద్ధేశ్వరీ! నేడు దేవికి ప్రత్యేకంగా శుక్రవారం పూజ లున్నాయి. దేవి సన్నిధిని ప్రేమావతి నృత్యకేళిక ఏర్పాటు చేయబడింది" అని చెప్పి వెళ్లాడు.

ప్రేమావతి నృత్యకేళికను చూసే సదవకాశం కలుగుతున్నందుకు తంజావూరు కళాకారులు సంతోషించారు.

తంజనగర నర్తకీమణుల నృత్యప్రదర్శన

దర్బారులో పది రోజులు నృత్యకేళికలు చేసి, అబ్దుల్లా కుతుబ్‌షా వారిని మెప్పించిన తంజనగర నర్తకీ మణులను ప్రత్యేకంగా సన్మానించదలచి మా సాహెబా తమ అంతఃపురంలో వారి కచ్చేరీని ఏర్పాటు చేశారు. దానికి సిద్ధేశ్వరి, తారామతి, ప్రేమావతులను గూడ ఆహ్వానించారు. ఆనాడు ఈ తంజనగర కళాకారులు నృత్తనృత్యాలనే గాక భారతీయ నృత్యకళలకు జీవమయిన అభినయాన్ని గూడ ప్రదర్శించారు.

"మీ అభిమానం చాలా ఉత్తమోత్తమమైనదిగా ఉంది. మీ తంజనగరంలో అదెలా వృద్ధిపొంది, వికసించ గలిగిందో మీరు చెప్పగలరా?" అని మా సాహెబా వారిని అడిగారు.

"మాది ద్రవిడ సంప్రదాయానికి చెందిన విద్య. చోళ రాజులు, అటు పిమ్మట తెలుగు రాజులు మా దేశాన్ని పాలించినందువల్ల ఆంధ్ర ద్రవిడ సంప్రదాయాల మేలికలయికతో, అపూర్వరీతిలో మా సంప్రదాయం వృద్ధి చెందింది" అని జయలక్ష్మి వివరించింది.

"మా గోలకొండ నృత్యకళను గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని మా సాహెబా అడిగారు.

"మీ సామ్రాజ్యంలో మతాలు వేరైనా, భాషలు వేరైనా, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సామాజిక దృక్పథాలు భిన్నమైనవైనా ఇక్కడి నృత్యకళ ఒక చక్కని బాణీలో రూపొందింది" అని వరలక్ష్మి గోలకొండ నృత్య కళను మెచ్చుకొంది.

"ప్రాచీన సంస్కృత సాహిత్యంలోని ఒకే శ్లోకాన్ని మీలో ఎవరైనా ఒకరు, మా ప్రేమావతి అభినయిస్తే, మీ అభినయాలలో గల తేడాను నాకు చూడాలని ఉంది" అని మా సాహెబా వారిని కోరారు.

"అలాగే మహారాణీ" అంటూ తంజావూరు వరలక్ష్మి ఒక శ్లోకాన్ని రాగయుక్తంగా పాడి, ఈ క్రింది విధంగా వ్యాఖ్యానిస్తూ అభినయించింది.

అదొక ముచ్చటైన తామరకొలను. ఆ కొలనులోని నీరు నిశ్చలంగా, నిర్మలంగా ఉంది. నీటి అడుగున రంగు రంగుల రాళ్లు రత్నాల్లా మెరుస్తున్నాయి. ఆ నీటిలో తోటమాలి జల్లిన తామర విత్తులు పొట్టలు విచ్చుకొని, మొలకెత్తి, నీటిపైకి వచ్చాయి. కొలనంతా ఒక నూతన శోభతో వెలుగొందుతూంది. ఆ కొలను గర్భంలో విశ్రాంతి తీసుకొంటున్న మండూకాలు గుంపుగా ఈదుకొంటూ నీటిపైకి వచ్చి, ఇలా చర్చించుకొంటున్నాయి.

"ఆ చిన్న తామర విత్తులు మొలకలై, పెరిగి పెద్దవై, ఆకులు, మొగ్గలు తొడిగినంతవరకు వాటిని ఎన్ని రాత్రుళ్లు, పగళ్లు మనం కాపాలా కాయలేదు? వాటిని ఎన్ని క్రిమికీటకాలనుండి రక్షించలేదు? వాటి

శత్రువులనుండి వాటిని కాపాడడానికి వాటి చుట్టు ప్రతిదినం మనం ఎన్నో ప్రదక్షిణలు చేశాం. ఆ మొగ్గలు విచ్చుకొని పూవులుగా వికసించాయి. వాటి అందాలను చూసి మనం మురిసిపోయాం. వాటి మెత్తని సువాసనలను ఆఘ్రాణించి, తృప్తి చెందాం. ఎందుకు? ఆ పుష్పాలు పూర్తిగా వికసించిన తర్వాత వాటిలోని మకరందాన్ని గ్రోలాలనే ఆశతో. కానీ చివరకు ఆ పద్మాలు ఎన్నిసార్లు మనల్ని మోసగించలేదు? మనం చూస్తుండగానే వాటి రేకులు రాలిపోయేవి. అవి మోడులయ్యేవి. వాటిలో నుండి విత్తులు మళ్లా ప్రత్యక్షమయ్యేవి. ఏనాడో ఎప్పుడో తేనెటీగలు ఆ పూలలోని మకరందాన్ని అపహరించుకొని పోయేవి. చివరకు మనకు నిరాశ, శ్రమ మిగులుతూ వచ్చాయి. ఈసారైనా ఇలాంటి మోసానికి మనం గురికాకూడదు. మనం తెలివిగా ప్రవర్తించాలి", అని అవి ఒక నిర్ణయానికి వచ్చి, రాత్రనక, పగలనక, ఆ పువ్వుల చుట్టూ తిరుగుతూ అతి జాగ్రత్తగా కాపలా కాస్తూ వస్తున్నాయి కానీ, ఆ తామర మొగ్గలు పరువానికి వచ్చి, విచ్చి, వికసించి, ఎక్కడో దూరంగా ఉన్న భ్రమరాలను తమ సువాసనలతో ఆకర్షించాయి. ఆ భ్రమరాలు ఎంతో హాయిగా, చక్కగా పాడుతూ, ఆ పూవుల్ని మరింత పులకింపజేసి, ఆ పూవులను చేరాయి. ఆ భ్రమరాల సంగీతం ఈ మండూకాలకు ఎలా అర్థమౌతుంది? అవి నిశ్చింతగా, నీళ్లలో ఈదుతూ, ఆడుకొంటున్నాయి. ఆ తరుణంలో ఎక్కడినుండో ఒక భ్రమరం వచ్చి, ఆ పద్మాల అందాన్ని చూసి మురిసిపోయింది. ఆ పూరేకులతో కాస్సేపు ఆడుకొంది. ఆ తర్వాత ఒక పూవు హృదయంపై వాలి, దానిలోని మకరందాన్ని గ్రోలసాగింది. అలా ఎంతో సమయం గడిచిపోయింది. తనివి తీరని ఆ భ్రమరం మత్తెక్కి, తనని తాను మరచి, ఆ పూవు హృదయంపైని నిదురపోయింది. పొద్దుగుంకింది. ఇతర భ్రమరాలు తమ గూళ్లకు చేరుకొన్నాయి. తన నాథుడు ఇంటికి తిరిగి రాలేదని భ్రమరి తన భర్త రాకకోసం వేచి, చూసి, చూసి ఆ తామర కొలనుకు వెళ్లింది. ఘీంకార నాదాలు చేస్తూ తన నాథుణ్ణి పిలిచింది. చివరకు తన ప్రియుడు ఆ పూవులో నున్నట్లు గ్రహించి, దాని చుట్టూ తిరుగుతూ, పిలిచి, పిలిచి, అలిసిపోయింది. సొలసిపోయి ఒక తామరాకు పైని వాలిపోయింది. తెల్లవారింది. ఆ తామర పూవు మళ్లా విచ్చుకుంది. ఆ పూవు హృదయంపైని తన నాథుణ్ణి ఆ భ్రమరి చూసి, ఎగిరి గంతేసింది. ఆనందంతో ఝుంకార ధ్వనులు చేసింది. ఆ భ్రమరం లేచింది. ఆ రెండూ కలిసి, ఎగిరి వెళ్లిపోయాయి" అంటూ వరలక్ష్మి తన అభినయాన్ని ముగించింది.

మా సాహెబా ఆమెను అభినందించి, ప్రేమావతివైపు చూశారు. ప్రేమావతి తారామతి వైపు చూసింది. తారామతి రాగాన్ని ఆలపించి, పాడుతుంటే ప్రేమావతి అభినయించడం ప్రారంభించింది. భాషకు అతీతంగా ఆమె భావాలను ప్రదర్శించింది. ఆ భావాలు ఆ శ్లోకంలో లేవు. తన కళాహృదయంలోని అనుభూతులు సంచారులుగా వికసించాయి. సాత్వికంలోని సంచారులకు సాహిత్యంతో సంబంధ ముండదు. అవి సెలయేటి తరంగాల లాగ వికసిస్తుంటాయి. ఒక చోట నిశ్చలంగా నిలబడకుండా ప్రవహించే సెలయేటి నీరంతా ఒక్కటే, అయినా అది వివిధ రీతుల్లో వివిధ గతుల్లో, వివిధ ఛాయల్లో, క్షణకాలం ప్రేక్షకుల కళ్లను మిరుమిట్లు

గొలుపుతూ ఎలా ప్రకాశించి, ప్రవహించి పోతూ ఉంటుందో అదే విధంగా సంచారీ భావ ప్రకటన పరంపరలుగా వికసిస్తూ ఉంటుంది. సంచారీ భావాలను అభినయించడం చాలా కష్టం. ఆ యనుభూతులను చూసి, అర్థం చేసుకొని ఆనందించడానికి ప్రేక్షకులు గూడా సంస్కారవంతులై ఉండాలి. లేకపోతే ఆ యభినయమంతా వృధా అవుతుంది.

హృదయ లోతులలో నుండి పైకి ఉబికే భావ ప్రకటనా పరంపరలను ముఖరాగం ద్వారా ప్రకటింపజేయడమే సాత్వికం. దీనినిమించి అభినయించి, పరాకాష్టకు నర్తకి చేరుకుంటే అది శుద్ధ సాత్వికమౌతుంది. దీనిని మించిన అభినయం మరింక లేదని నాట్యశాస్త్రవేత్తల, కవుల, పండితుల అభిప్రాయం. వివిధ కాంతులతో సువాసనలను వెదచల్లుతూ కవి భావాన్ని అభినయించడమే శుద్ధ సాత్వికం. ఇది కళాకారుల హృదయ భాష. హృదయ వికాస మున్నవారే ఈ భాషను అర్థం చేసుకోగలరు, ఆనందించగలరు. తమ ఇంటి వేల్పయిన శీతలాదేవి వరప్రసాదం వలన ఈ యభినయ కళ ప్రేమావతికి అబ్బింది.

ప్రేరణతో ప్రేమావతి అభినయాన్ని ప్రారంభించింది. ఓంకారంతో సమ్మిళితమైన నాదాన్ని ఆ అక్క చెల్లెళ్లు రాగాలతో ఆలపించారు. వారి నాభిస్థానాల నుండి వెలువడిన నాదం అది. క్రమంగా ఆ నాదం సభాస్థలినంతటా వ్యాపించింది. ప్రేక్షకుల నందరినీ అది ఒక నిశ్చల స్థితికి గొనివచ్చింది. ప్రేమావతి ప్రదర్శించిన వివిధ భావాలు, వివిధ దిశలలో సంచరించి, అవన్నీ ఒక్కటై ఆమె హృదయంలో ఒక్కచోట నిలిచిపోయాయి. ఆమెకు ఏకాగ్రత చేకూరింది.

వివిధ గమకాలతో, వివిధ స్వరగతులతో, వివిధ లయరీతులతో, ఆరోహణ, అవరోహణలతో తారామతి రాగాలాపన చేసింది. త్రిస్థాయిలలో ఆమె రాగాన్ని ఆలపించింది.

"వేకువ జామున సూర్యరశ్మికి ఆ తామర పూవు రేకులు విచ్చుకోగానే ఆ పద్మంపైని వేచియున్న భ్రమరి తన నాథుణ్ణి చూసింది. తన నాథుడు అన్యస్త్రీ పొందులో తనని తాను మరచి ఉన్నాడని, ఆమె గాఢ పరిష్వంగణంలో ఆనందిస్తున్నాడనీ, అతని చేష్టలను, ఆంతర్యాన్ని, అతని హృదయాన్ని తెలుసుకొని, దండించాలని ఆ భ్రమరి నెమ్మదిగా, నిశ్శబ్దంగా అతనికి చేరువగా వెళ్లింది. అతని చెవి దగ్గర మెత్తని ఝుంకార నాదాన్ని ఆలపించింది. తర్వాత కరకుగా పాడింది. ఆ తర్వాత కర్కశంగా పాడింది. ఈర్ష్య, ద్వేషం, అసూయ, అసహనం, ఉగ్రత మొదలైన ఎన్నో సంచారులను శంక వితర్కాలతో ప్రారంభించి, ఎన్నో భావ పరంపరలను వరుసగా ప్రకటించి, ప్రదర్శించింది. అయినా తన భర్తలో చలనం కలుగలేదు. కేవలం శారీరక సంగమంలోనే ఇంత మైమరుపా అంటూ ఆ భ్రమరి తన భర్తను గిచ్చింది. తర్వాత పొడిచింది, ఇటు అటు అతన్ని ఊపింది. అయినా అతడు చలించలేదు. అతడు తనను లెక్కసేయక విదిలించినట్లు ఆ భ్రమరి భ్రమించింది. ఉగ్రతతో కళ్లు ఎర్రజేసింది. కోపంతో ఆమె కంపించిపోయింది. ఆమెకు ఇంక సహనం

పోయింది. పరస్త్రీ సంగమం నుండి తన నాథుణ్ణి విడదీయడానికి అతన్ని తన కాళ్లతో పట్టి లాగింది.

క్రితం రాత్రి ఆ తామర పూవు ముడుచుకొన్నప్పుడు, ఆ పూవులో అతడు ఉండిపోయినందువల్ల ఊపిరాడక ప్రాణాన్ని విడిచిన అతడు ఆ భ్రమరిపై వాలి పడ్డాడు. తన నాథుడు మరణించాడని ఆ భ్రమరి గ్రహించి, ఆ వియోగాన్ని భరించలేక ఆమె అతనిపైని పడి ప్రాణం విడిచింది. ఇద్దరి శరీరాలు ఒక్కటయ్యాయి. వారి ఆత్మలు అనంతవాయువుల్లో కలిసి, పయనించాయి".

ఈ విధంగా భావవికాసంతో, సాత్విక, శుద్ధసాత్విక అభినయాలతో ప్రేమావతి ఆ శ్లోకాన్ని ప్రదర్శించింది. ప్రేక్షకులందరూ చేష్టలుడిగి ఒక క్షణకాలం ఉండిపోయారు. "చాలు, బేటీ! ఇకా చాలు. ప్రేమా! ఇంక చాలు" అంది మా సాహెబా. జయలక్ష్మి వెళ్లి ఆమెను కౌగిలించుకొంది.

"మహారాణీ! మేం అర్థాభినయానికి ప్రాధాన్యమిస్తాం. వర్ణనాత్మకంగా, ఆంగికం ద్వారా మేం అభినయిస్తున్నాం. మీ గోలకొండ కళాకారులు భావాభినయాన్ని సంచారుల ద్వారా ప్రదర్శిస్తారు. అందుకే వీరి పాటలలోను, అభినయంలోను సహజంగా భావావేశం అధికంగా గోచరిస్తుంది. మా సంప్రదాయంలో ఒడ్డోలగం ప్రాధన్యం వహిస్తుంది" అంటూ దాపరికం లేకుండా తన అభిప్రాయాన్ని జయలక్ష్మి వెల్లడించింది.

అందుకు మా సాహెబా చాలా సంతోషించి, హంస అంచుల గద్వాల పట్టు చీరలను ఆ తంజావూరు కళాకారులకు ఇచ్చి సత్కరించారు.

"మాతా! సిద్దేశ్వరీ దేవీ! ధన్యురాలివి! నీ కుమార్తెలు రత్నవైఢూర్యాలు. వారికి వారే సాటి. వీరువురు ధృవతారల్లాగ వెలిగిపోతూ మన దేశ కళాచరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారు. మీరు ముగ్గురూ మా తంజనగరం సందర్శించండి. ఇదే మా ఆహ్వానం. అక్కడ సరస్వతీ మహల్లో మళ్లా కలుసుకొందాం" అంటూ జయలక్ష్మి ఆ ముగ్గుర్నీ కౌగలించుకొని ఆనంద భాష్పాలు రాల్చింది. వారందరూ మా సాహెబా వద్ద సెలవు తీసుకొని మేనాలు ఎక్కి వెళ్లిపోయారు.

శనిగరం

అదొక చిన్న గ్రామం. దానిపేరు శనిగరం. ఆ గ్రామంలో నరసింహస్వామి వెలిశాడు. ఆ దేవుని దయవల్ల ఆ గ్రామానికి దేశంలో మంచి పేరు వచ్చింది. ఆ నరసింహస్వామివారి శిల్పం చాలా సుందరమైనది. ఆ విగ్రహానికి ఆ గ్రామ ప్రజలు ఒక చిన్న ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయంలో నిత్య ధూప, దీప, నైవేద్యాలు సక్రమంగా జరుగుతున్నా అంగరంగ భోగాలకు నిధులు కరువైనాయి. అందుకా గ్రామ ప్రజలు అబ్దుల్లా కుతుబ్‌షా ప్రభువులకు విన్నవించుకొన్నారు. ఆ గ్రామ ప్రజల కోర్కెను తీర్చదానికి పాదుషా వారు సపరివారంగా ఆ శనిగరం గ్రామానికి పయనమైనారు.

ఆ ఆలయానికి కొద్ది దూరంలో ఆ ప్రభువుల కొరకు ప్రత్యేక గుడారాలు వేశారు. వారి వెంట వచ్చిన అశ్వ, గజ, పదాతి దళాల వారి కోసం గూడా వేర్వేరు గుడారాలను వేశారు. వారందరూ ఆ గుడారాలలో విడిశారు.

ఆ మరుచటి ఉదయం ఆ గ్రామంలోని చెరువు గట్టున ఒక శిలాశాసనాన్ని పాదుషావారు వేయదలచారు.

బ్రాహ్మణులు వేద మంత్రాలను చదువుతూండగా, భేరీ, నగారా, నాదస్వర, శృంగవాద్యాలు మోగుతుండగా అబ్దుల్లా కుతుబ్ పాదుషా వారు ఆ చెరువు గట్టుకు సపరివారంగా, పల్లకిలో వచ్చారు. అక్కడ స్థలపూజ జరిగింది. శాసన ప్రతిష్టాపూజా నర్తనాన్ని తారామతి పాడగా ప్రేమావతి నాట్యం చేసింది. ప్రభువులు ఒక శాసనాన్ని ప్రతిష్టించారు. ఆ రాత్రి ఆ నరసింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు ఘనంగా జరిపించారు.

ఆ తర్వాత వారు విడిసియుండిన గుడారంలో బరహాన్‌పురం నుండి వచ్చిన నర్తకి "ముజరా" నర్తనం ప్రదర్శించింది. పేదలకు ఆ ప్రభువులు అన్నదానం, వస్త్రదానం చేశారు. వేద పండితులకు కానుక లిచ్చి సమ్మానించారు. నర్తకికి నజరానా ఇచ్చారు. ప్రముఖ ప్రజలతో వారు విందులు వినోదాలతో గడుపుతుండగా ఆకాశం మేఘావృతమైంది. మెరుపులతో చినుకులు పడనారంభించాయి. తర్వాత కుంభవృష్టిగా వర్షం కురిసింది.

తెల్లవారే సరికి ఆకాశం నీలంగా నిర్మలంగా ఉంది. ఆలయంలో మంగళ వాద్యాలు మోగుతుండగా పాదుషావారు తమ గుడారంలో నుండి బయటకు వచ్చారు. చెరువువైపు చూశారు. చెరువు నీటితో నిండుగా ఉంది. లేలేత సూర్యకిరణాల తాకిడికి తామరలు వికసించి, పాదుషా వారిని పులకరింపజేశాయి.

"ప్రేమావతీ! తారామతీ! చూశారా ఒక రాత్రి వర్షానికే ఆ చెరువు ఎలా నిండిందో! ఈ గ్రామ ప్రజలు అదృష్టవంతులు. సుఖశాంతులతో ఇక మీదట ఈ ప్రజలు జీవించగలరు" అన్నారు పాదుషావారు.

"అమృతతుల్యులు ప్రభువుల వారు! ఇదంతా తమ చేతి చలువ. తమరు వేసిన శాసనంతో ఈ చెరువు నిండింది. తమ పాదధూళితో ఈ నేలలో ఇక మీదట బంగారం పండుతుంది" అంది ప్రేమావతి.

"భగవంతుడు కరుణామయుడు. తమర్ని ఆ భగవంతుడు చల్లగా చూడాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అంది తారామతి.

"ఇదంతా ఆ అల్లా కటాక్షం!" అంటూ కళ్లు మూసుకొని అల్లాను ప్రార్థించి, జగత్ప్రభువుకు ఈ గోల్కొండ ప్రభువు కృతజ్ఞతలు చెప్పుకొంటున్నారు" అన్నారు అబ్దుల్లా కుతుబ్‌షా.

బాగ్‌లింగంపల్లి

వర్ష ఋతువు ప్రారంభానికి సూచనగా శనిగరంలో వర్షం పడింది. ఆనాటి నుండి తరచుగా ఆకాశం మేఘావృత మవుతూ వచ్చింది. ఉరుములు మెరుపులతో ప్రకృతి పరవశించడం ప్రారంభించింది.

వర్షాకాల ఆశ్రయంగా బాగ్‌లింగంపల్లిలో పాదుషా వారు ఒక భవనాన్ని నిర్మించుకొన్నారు. ఆ భవనం చుట్టూ పెద్ద పెద్ద చింత చెట్లు విరివిగా ఉన్నాయి. ఆ రాజభవనానికి కొలది దూరంలో తారామతి, ప్రేమావతుల కొరకు ప్రత్యేకంగా ఒక భవనాన్ని పాదుషా వారు ఏర్పాటు చేశారు.

ఒకనాడు అబ్దుల్లా కుతుబ్‌షా వారు బాగ్‌లింగంపల్లిలోని వర్షాకాల నివాసానికి బయలుదేరారు. వారి వెంట మంత్రులు, సైన్యాధికారులు ఇతర పరివారమే కాక తారామతి, ప్రేమావతులు గూడా వెళ్లారు. పరివారం కోసం ఆ చింత తోపులో గుడారాలు వేశారు. దూరదేశాల నుండి వచ్చే అతిథుల కోసం ప్రత్యేకంగా కొన్ని గుడారాలు ఏర్పరచారు. అంతవరకు నిశ్శబ్దంగా ఉండిన ఆ చింత తోపు ప్రభువుల వారి రాకతో కళకళ లాడింది. దానికొక నూతన కళ వచ్చింది. గోల్కొండే అక్కడకు తరలి వచ్చినట్లు ప్రజలకు భ్రమ కలిగింది.

విందులు వినోదాలకు ఆ బాగ్‌లింగంపల్లి వర్షాకాలంలో కాణాచిగా మారిపోతూ ఉంటుంది. వర్షం కురియని సాయం సమయాలలో పాదుషా వారికి వినోదం చేకూర్చడానికి ఆ గుడారాలలో విడిసిన నర్తకీ జనం చక్కగా అలంకరించుకొని, ప్రభువుల ఆజ్ఞ కొరకు వేచి ఉంటారు. ప్రభువుల ఆజ్ఞ ఇవ్వగానే ఆ బృందాల వారి వాద్యాలు ఒక్కసారే మ్రోగుతాయి. పరివారం వెంటరాగా ప్రభువుల వారు ఒక్కొక్క బృందం వద్దకు వెళ్లి, వారి నర్తనాలను తిలకించి, ఆనందించి, సముచితంగా వారిని సత్కరించి రావడం వారి ఆచారం.

ప్రతి రాత్రి వారి భవనంలో విందులు, వినోదాలు పరిపాటిగా జరిగేవి. తమ తల్లిగారు రాచకార్యాలు నిర్వహిస్తూండడం వల్ల అబ్దుల్లా కుతుబ్‌షా వారు ఏ చీకూ చింతా లేకుండా విందు వినోదాలతో అక్కడ కాలం గడిపేవారు.

ఒకనాటి సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని నర్తకీ జనమున్న గుడారాల వద్దకు పాదుషావారు వెళ్లారు. చక్కగా ముస్తాబయిన నర్తకీమణులు వారి వారి విద్యలను ప్రదర్శిస్తున్నారు. తారామతి ప్రేమావతులు వారి భవనం పై నుండి ఆ నాట్య దృశ్యాలను పరికిస్తున్నారు.

"అక్కా! అక్బర్ పాదుషా వారు స్త్రీల నమాయిషీకి మారు వేషాలలో వెళ్లేవారట. మన పాదుషావారు స్వేచ్ఛగా వెళ్లివస్తున్నారు. మన పాదుషావారు వారి భవనంలోనే కూర్చుని, దూర్భిణి పెట్టుకొని ఈ నమాయిషీలను తిలకించవచ్చు గదా?" అని ప్రేమావతి తారామతిని అడిగింది.

"చెల్లెమ్మా ! జీవితమంటే కేవలం నృత్యసాధన, అభినయ ప్రదర్శనలే కాదు. నీవు లోకం గురించి బాగా తెలుసుకొనాలంటే గ్రంథపఠనంతో బాటు లోకం పోకడను గూడా గమనించాలి. మానవుడు హద్దు మీరితే అతని కోరికలు గొంతెమ్మ కోరిక లవుతాయి" అంది తారామతి.

"మన పాదుషావారు వట్టి స్త్రీ లోలుడు. ఇరవై వేలమంది నర్తకీ జనంతో, నృత్యగానాలతో జీవితం గడిపే ఈ ప్రభువు ఆదర్శ పురుషుడు కాగలడా? అని సామాన్య ప్రజలు అనుకోరూ?" అని ప్రేమావతి తన సందేహాన్ని వెలిబుచ్చింది.

"పదహారు వేలమంది గోపికలతో రాసలీలలు జరిపిన శ్రీకృష్ణుడు ఆదర్శ పురుషుడు కాడా? ఆయన దేవుడు కాడా? భగవానుడు కాడా?" అంది తారామతి.

ప్రేమావతి ఆలోచిస్తూ ఉండిపోయింది.

ఒకనాటి మధ్యాహ్నం సిద్ధేశ్వరీ సుగుణమతి విందారగించి తూగుటుయ్యాలలో కూర్చుని తాంబూలం సేవిస్తూ తారామతితో కబుర్లు ఆడుతూండగా ప్రేమావతి పరుగుపరుగున అక్కడకు వచ్చి తల్లిపైన వాలిపోయి, వాటేసుకొంది.

"ఏమైంది ప్రేమా? అలా వగరుస్తున్నా వెందుకు?" అని సిద్ధేశ్వరి అడిగింది.

"అమ్మా, అమ్మా ! మరేమో, మొన్న ప్రభువుల వారు గద్దె యెక్కినపుడు నర్తనమాడిన అహమద్‌నగర్ చంపాకలి బాయ్, జేబునిసా అహమద్ నగరి అయిందట!"

"అంటే మతం మారిందా?" అని తారామతి అడిగింది.

"ఔను; నిజంగానే మతం మారింది."

"ఆర్యమతంలో పుట్టి, ఆర్యమతంలో ఇన్నాళ్ళు పెరిగి, ఇప్పుడు మతం మారిందా? ఆర్యమతం గురించి ఆమె కేం తెలుసు? ఇప్పుడు ముస్లిం మతం గురించి ఆమె తెలుసుకోబోయేది ఏముంది?" అంది తారామతి.

"మతంలో ఏ ముందమ్మా! అంతా బుద్ధిలో ఉంది. మనుష్యుల బుద్ధి సరిగ్గా ఉండాలి?" అంది సిద్ధేశ్వరి.

వర్షాకాలం ముగిసిన తర్వాత అబ్దుల్లా కుతుబ్‌షా వారు తమ పరివారంతో తిరిగి గోల్కొండ చేరుకొన్నారు. చింతలతోపు చిన్నబోయింది.

పర్యటన ప్రియుడు

తన తల్లి హయాత్ బక్షీ బేగం రాజ్యభారం వహిస్తున్నందువల్ల రసిక హృదయుడైన అబ్దుల్లా కుతుబ్‌షా విలాసంగా జీవితం గుడుపుతూ, తన సామ్రాజ్యంలోని కోటలు, పేటలు, మసీదులు, మందిరాలు, వనాలు, ఉద్యాన వనాలు పర్యటిస్తూ, తన ప్రజల జీవిత విధానాలను, సామాజిక కట్టుబాట్లను పరిశీలిస్తూండేవాడు. దీని వల్ల తన కుమారునికి మంచి లోకజ్ఞానం కలిగి, భావిలో అతడు రాజ్యాన్ని బాగా పాలించగలడన్న ఉద్దేశ్యంతో దేశం నలుమూలలా పర్యటించి రమ్మనమని ఆమె అతనిని ప్రోత్సహిస్తూండేది.

వర్షఋతువు గడిచిపోయి హేమంత ఋతువు ప్రవేశించింది. పచ్చని పసరు చిమ్ముతూ, వింత శోభతో ప్రకృతి పరవశించి పోతూంది. ఒకనాటి ఉదయం బాలసాహిలో నిల్చుని, పరిసరాలను అబ్దుల్లా నిశితంగా పరిశీలించాడు. కోటకు చేరువలో నున్న రెండు మెట్టలపైని తారామతి, ప్రేమావతుల మందిరాల నిర్మాణం ముగింపుకు వచ్చినట్టు గ్రహించి, సంతోషించాడు.

ఆ మందిరాలకు కొద్ది దూరంలో మూసీనది ప్రశాంతంగా ప్రవహిస్తూంది. పక్షులు కలకలరవాలు చేస్తున్నాయి. అవి చెట్లపై నుండి గుంపులు గుంపులుగా ఎగురుతూ ప్రకృతికి వింత శోభను చేకూరుస్తున్నాయి. అబ్దుల్లా ఆ దృశ్యాలను చూసి పరవశించి పోయాడు.

తను రోజూ చూస్తున్న ప్రాంతమే అది. కాని ఆనాడు అది తనకు శోభాయమానంగా గోచరించింది. వివిధ ఋతువుల్లో వివిధ రకాలుగా ఆ ప్రాంతం నిత్యనూతనంగా అతనికి కనబడుతూ ఉంటుంది. ఇటువంటి రమణీయమైన దృశ్యాలు తెలుసుకొనాలనుకొన్నాడు. తన దేశ నలుమూలలకు వెళ్లి రావాలని నిర్ణయించుకొన్నాడు. వెంటనే గంట మోగించాడు. పరిచారకుడు వెంటనే వచ్చాడు. "మంత్రిగారిని తక్షణం రమ్మనమని చెప్పు" అని ఆయన ఆజ్ఞాపించాడు. అక్కడి నుండి తిన్నగా తన తల్లి మందిరానికి ఆయన వెళ్లి తన కోర్కెను తెలియజేశాడు. ఆమె సరే నంది. ఇంతలో మంత్రి వర్యుడు వచ్చాడు. "అనంతగిరి ప్రయాణానికి ఏర్పాట్లు చేయండి" అని ఆయన ఆ మంత్రిని ఆదేశించాడు.

ఆనాటి మధ్యాహ్నం తన పరివారంతో అబ్దుల్లా కుతుబ్‌షా గోల్కొండ నుండి బయలుదేరాడు. సాయంత్రానికి ఆయన తన పరివారంతో పానగల్లు చేరుకొన్నాడు. ఆ పుణ్యక్షేత్రంలోని చాయల సోమేశ్వర, పచ్చల సోమేశ్వర ఆలయాలను ఆ మర్నాటి ఉదయం ఆయన సందర్శించాడు. ఆ ఆలయాల నిర్మాణంలో శిల్పి ప్రదర్శించిన నైపుణ్యానికి, చాతుర్యానికి అబ్దుల్లా ముగ్ధుడయ్యాడు. అక్కడ నుండి వెంటనే బయలు దేరి, కోదాడ మీదుగా మధ్యాహ్నానికి ఆయన అనంతగిరి చేరుకొన్నాడు.

అనంతగిరి దుర్గం చిన్నదే అయినా చాలా పురాతనమైంది. ఆ ప్రాంతం చాలా ఆరోగ్యవంతమైనదని విని, అక్కడ కొన్నాళ్ళు అబ్దుల్లా గడపదలచాడు.

ఒకనాటి ఉదయం రాజ పరివారంతో కలిసి వెళ్లిన సిద్ధేశ్వరి తారామతి ప్రేమావతులు అనంతగిరి దుర్గమంతా తిరుగుతూ, అక్కడి వింతలు, విశేషాలు పరికిస్తున్నారు. ఒకచోట ఒక విచిత్రమైన చిన్న కట్టడం కనిపించింది. దానికి ఇనుప గొలుసులున్నాయి. ఒక చక్రానికి అవి అతికించబడి ఉన్నాయి. "ఆ చక్రాన్ని వింతగా చూస్తూ, ఏమిటమ్మా ఇది?" అని ప్రేమావతి అడిగింది. "ఏమోనమ్మా!! రాజ దుర్గాలలో అనేక రహస్య నిర్మాణా లుంటాయి." అని తల్లి సిద్ధేశ్వరి చెప్పింది. ఆమె వారిస్తున్నా వినక ప్రేమావతి కుతూహలంగా ఆ చక్రాన్ని తిప్పింది. వెంటనే ప్రక్కనున్న రాతి తలుపు తెరుచుకొంది. లోపల ఏముందో వారికి తెలియరాలేదు. అంతా చీకటిమయం. అందులో నుండి నీటి గలగలలు వారికి వినబడ్డాయి. పాముల బుసబుసలు వారికి వినబడ్డాయి. రెండు గబ్బిలాలు ఆ ద్వారంలో నుండి వచ్చి, వారి తలలమీదుగా ఎగిరి వెళ్లాయి. ఆ ముగ్గురు భయకంపితులయ్యారు. సిద్ధేశ్వరి వెంటనే ఆ చక్రాన్ని వెనుకకు తిప్పింది. తలుపు మూసుకొంది "అమ్మయ్యా!" అంటూ ఆ ముగ్గురూ నిశ్వసించారు.

"అమ్మా ! నాకు చాలా భయం వేసింది!" అంది తారామతి.

"అందుకే మనకు సంబంధం లేనివాటి జోలికి మనం పోకూడదు" అంది సిద్ధేశ్వరి ప్రేమావతి వైపు చూస్తూ.

"ఇంకెప్పుడూ ఇలాంటి అనవసరపు పనులు చేయనమ్మా!" అని లెంపలు వాయించుకొంది ప్రేమావతి.

"అదేమిటమ్మా?" అని ఒక ద్వారం వైపు చూపిస్తూ తారామతి అడిగింది.

"అదొక రహస్య మార్గమై యుండవచ్చును. లేకపోతే అది శత్రువులను శిక్షించడానికి నిర్మించిన కారాగారమై యుండవచ్చును. ఇలాంటివి ప్రతికోటలోను, ప్రతి దుర్గంలోను ఉంటాయి. ఇవి అతి రహస్యమైన నిర్మాణాలు. వీటిని గురించి అందరికీ తెలియదు. ఆపద్సమయాలలో శత్రువులకు చిక్కకుండా ఇటువంటి రహస్య భూగర్భమార్గాల ద్వారా రాజులు, రాణులు, వారి పరివారం తప్పించుకొని పారి పోతారు. చేజిక్కిన శత్రువులను ఇటువంటి చీకటి కారాగారాల్లో పడవేస్తారు. ఆ శత్రువులు ఈ కారాగారాల్లోని విష జంతువులకు బలైపోతారు. లేకపోతే గాలి, నీరు, తిండి లేక పస్తులు పడి చనిపోతారు."

"శత్రువులను ఇంత క్రూరంగా శిక్షిస్తారా?" అని ప్రేమావతి ఆశ్చర్యపోయింది.

"గొప్ప విజ్ఞానవంతుడు, మేధావి, దయామయుడు అని పేరు పొందిన అక్బర్ పాదుషా అన్యము, పుణ్యము ఎరుగని ఒక అమాయకపు అబలను అన్యాయంగా సజీవ సమాధి చెయ్యలేదూ? తను ప్రేమించిన ఒక పురుషుని పెళ్ళి చేసుకొంటానన్నందుకే అంత ఘోరమైన శిక్ష ఆమెకు విధించబడితే, శత్రువులకు ఇంకా ఎంత పెద్ద శిక్షలను ఈ పాదుషాలు విధించగలరో మనం ఊహించలేము" అంది తారామతి.

"అంతటి మహనీయుడైన అక్బర్ పాదుషాకు మానవత్వ విలువలు తెలియవా? ఆ ప్రేమకు గల అనురాగ హృదయాన్ని తెలుసుకోలేక పోయాడా?" అని అడిగింది ప్రేమావతి.

"ప్రభువుల చిత్త ప్రవృత్తులు విచిత్ర మైనవి. వాటిని తెలుసుకొనడం చాలా కష్టం" అంది సిద్ధేశ్వరి.

"సూది మొనపైన నాట్యం చేయవచ్చును కాని ప్రభువుల చిత్తం తెలుసుకోలేమంటావు!" అంది ప్రేమావతి.

"మరి మన గోల్కొండ సామ్రాజ్యాధిపతి మహమ్మద్ అభిరామ్ పాదుషా వారు అలా చేయలేదు గదామ్మా?" అంది తారామతి.

"అందరి మనోభావాలు ఒక్కలాగుండవు గదా! హిందూ ముస్లిం ప్రేమ పాశాలను ముడివేయడానికి మూసీ నదిపైని ఆయన వంతెన నిర్మించాడు. పరమతానికి చెందిన ఒక సామాన్య యువతి భాగామతిని తన కుమారుడు వివాహమాడడానికి, ఆమెను గోల్కొండ సామ్రాజ్యానికి మహారాణిని చేయడానికి ఆయన సమ్మతించాడు. ఆయన ఉదార స్వభావుడు. అందుకే ఆయన అభిరాముడయ్యాడు. అక్బర్ పాదుషా అలా చేయలేకపోయాడు. ఇద్దరూ సర్వ స్వతంత్రులైన సమ్రాట్టులే కాని వారి మనస్సులు భిన్నమైనవి. అందువల్లనే అనార్కలీ సజీవ సమాధి అయింది. భాగ్యవతి ఒక చక్రవర్తికి అర్ధాంగి అయింది. ప్రేమ, దయ వంటిదే పరమత సహనం. ఇవి అత్యంత ఉత్తమమైనవి. అందరూ అలవరచు కొనవలసినవి" అని సిద్ధేశ్వరి చెప్పింది.

ఇలా వారు ముచ్చటించుకొంటూండగా ఒక సేవకుడు వచ్చి "అమ్మా! గదవాలు ప్రభువుల వారి ఆతిథ్యాన్ని స్వీకరించడానికి మన ప్రభువుల వారు వెళ్లడానికి సిద్ధమౌతున్నారు. మీరు కూడా త్వరగా సిద్ధం కావాలి" అని చెప్పాడు.

కృష్ణానది దాటి గద్వాలు వెళ్లాలి. కృష్ణానది మధ్య ఒక జలదుర్గ ముంది. అందులో రెండు మూడు రోజు లుండి, వెళ్లాలని అబ్దుల్లా కుతుబ్‌షా నిర్ణయించుకొన్నాడు. సేవకులు కొందరు ముందుగా ఆ దుర్గానికి వెళ్లి వసతి ఏర్పాట్లు చేశారు. ఆనాటి సాయంత్ర సమయానికి పాదుషా వారు తమ పరివారంతో అక్కడికి చేరుకొన్నారు. బంగారు సాయంసంధ్య సూర్యకాంతిలో కృష్ణానదీ జలాలు తళతళ మెరిసి పోతున్నాయి. నది మధ్యనున్న ఆ జలదుర్గం రక్తవర్ణకాంతులతో కనుల పండువగా ఉంది. ఆ దృశ్యాలను చూసి అబ్దుల్లా కుతుబ్‌షా వారు ఆనంద పరవశులయ్యారు.

తమ పరివారంతో పాదుషా వారు పడవలలో బయలుదేరి ఆ జలదుర్గాన్ని చేరుకొన్నారు. అంగరక్షకులు ముందు నడవగా పాదుషావారు ఆ దుర్గంలో ప్రవేశించారు. వారి వెనుకనే సిద్ధేశ్వరీ, తారామతి ప్రేమావతులు గూడా వెళ్లారు.

దుర్గం లోపల ఒక చావడిలో వారి కొక చిన్న మంట కనబడింది. దానివద్ద ఒక సూఫీ కళ్లు మూసుకొని ధ్యాన నిమగ్నుడై యున్నాడు. మెల్లగా, చప్పుడు చేయకుండా ఆ సూఫీ వద్దకు పాదుషా వారు వెళ్లారు. వారి వెంట సిద్ధేశ్వరి తారామతి-ప్రేమావతులు కూడా వెళ్లారు. ఇతర పరివారమంతా దూరంగా నిలబడ్డారు. ఆ సూఫీ కళ్లు తెరిచి, పాదుషా వారిని చూసి, కూర్చొనమని పాదుషా వారికి కనులతో సైగ చేశాడు. అందరూ ఆయనకు నమస్కరించి, నిశ్శబ్దంగా కూర్చున్నారు.

అక్కడి అగ్నిలో నుండి వస్తున్న అగరు, ధూపం సువాసనలను వెద్దచల్లుతూంది. ఆ సూఫీ మళ్లా కళ్లు మూసుకొని ధ్యాన నిమగ్నుడై కొన్ని గీతాలను ఆలపించి, కళ్లు తెరిచి, పాదుషా వారిని తేరిపారి చూసి, "రాజా! మానవాళినంతా ఒకటిగా చూసి, ప్రేమవాహినులను ప్రవహింప జేయి?" అని ఆశీర్వదించాడు.

"చిత్తం!" అన్నట్టు అబ్దుల్లా కుతుబ్‌షా తలవంచారు.

ఆ తర్వాత ఆ సూఫీ ప్రేమావతిని చూసి, "ప్రేమ పవిత్రమైనది, శాశ్వతమైనది. కాని ప్రేమింపబడే పదార్థం శాశ్వతమైనది కాదు" అని చెప్పాడు. తర్వాత ఆ మంటలో నుండి విభూది తీసి, ప్రేమావతి నుదుట పెట్టాడు. తర్వాత మళ్లా ధ్యానంలో నిమగ్నుడయిపోయాడు. ప్రేమావతి అతనికి సాష్టాంగ నమస్కారం చేసింది.

అబ్దుల్లా కుతుబ్‌షా తన పరివారంతో వెనుకకు మరిలాడు.

అవధూత శ్రీ రాజరాజేశ్వరి

"దత్త దత్త దాత్త దేవ దత్త దాత్త" అన్న నామోచ్ఛారణ దత్తాత్రేయ మఠం నుండి వినిపిస్తూంది. ఆ నామోచ్ఛారణకు ఆకర్షితురాలైన ప్రేమావతి ఆ మఠానికి బయలు దేరింది.

మాతా రాజేశ్వరికి నడివయస్సు దాటింది. ఆమె బాల్యంలోనే సన్యసించి, మహారాష్ట్ర దేశానికి వెళ్ళి, పశ్చిమ కనుమల్లో ఒక దత్త ఉపాసకుల వద్ద ఉపదేశం పొంది, తిరిగి తన స్వస్థలమైన గోలకొండకు వచ్చి ఈ దత్తాశ్రయాన్ని స్థాపించింది. ఆమె దత్తనామాన్ని ప్రచారం చేస్తూంది. కచ్చబోసి ధోవతి కట్టుకొని, నిలువు టంగీ ధరించి, శిరోజాలను పైకి దువ్వి, శిరస్సుపైని ముడివేసి, ఒక శాలువ కప్పుకొని, చేత ఒక దండాన్ని ధరించి, పాంకోళ్లతో ఠీవిగా పురుషునిలాగ నడుస్తూంటే ఆ దత్తప్రభువే దివి నుండి భువికి దిగి వచ్చాడా అన్నట్టు అందరికీ అనిపిస్తుంది. ఆమె ముఖంలో పవిత్రమైన వర్చస్సు గోచరిస్తుంది. ఆమె ముఖ కాంతిలో ఒక విధమైన తేజస్సుంది. అందుకే ఆమె యెడల అందరూ ఆకర్షితులౌతున్నారు.

భక్త తుకారామ్, నామదేవ్, జ్ఞానేశ్వర్, సక్కూబాయి మొదలైన సంతుల, భక్తివర్యుల జీవితాలను, వారి బోధనలను, వారి ప్రవచనాలను ఆమె అందరికీ చదివి వినిపించి, తెలుగులో వాటికి వ్యాఖ్యానం చెబుతూంటే అందరూ తన్మయులై వింటూంటారు. ఆమె భాషణలు వినడానికి నిత్యము భక్తులు ఆ మఠానికి వస్తూంటారు.

ప్రతి పౌర్ణమినాడు ఆ యవధూత శ్రీ రాజరాజేశ్వరీ మాతకు పాదపూజ జరుగుతూ ఉంటుంది. ఆ పూజకు వచ్చే భక్తులు దత్త ప్రభువుల వారి నామ సంకీర్తన చేస్తూంటే ఆమె జ్ఞాన సమాధిలోకి పోయి, కొన్ని గంటల సేపు నిశ్చలంగా ఉండిపోతుంది. అప్పుడామె ముఖం ఒక దివ్య తేజస్సుతో వెలిగిపోతుంది. ఆ తర్వాత ఆమె తన యధాస్థితికి వస్తుంది.

ఆ దివ్య తేజస్సుకు ఆకర్షితురాలైన ప్రేమావతి తన తీరిక సమయాలలో ఆ దత్తాత్రేయ మఠానికి వెళ్తూంటుంది. ఆ యవధూత మాత గురించి కొందరు వేరే విధంగా చెప్పుకొంటూండినా చాలా మంది ఆమె దివ్యత్వం గురించే చెప్పుకొంటూంటారు. అందువల్ల ఒకనాడు సమయం చూచుకొని ఈ విషయాన్ని ఆమెతో ప్రేమావతి ప్రస్తావించింది. అప్పుడు ఆమె తన గురించి చెడ్డగా ప్రచారం చేస్తున్న వ్యక్తులను పిలిపించి, "నాయనలారా! నా గురించి, నా భక్తి, నా జపం, నా యోగ సాధనల గురించి మీరెందుకు తర్జన భర్జనలు చేస్తూ కాలాన్ని వృధా చేసికొంటున్నారు? కొంత కాలం మీరు ఓపిక పట్టండి. నేను సమాధిలోనికి వెళ్ళి, సిద్ధిని పొందాలనే ఈ జపతపాలు చేస్తున్నాను. మీరు నాకోసం ప్రత్యేకంగా ఒక సమాధిని నిర్మించండి. అందులో వివిధ రకాలైన పూవులు వేసి, నన్ను పద్మాసనంలో కూర్చోబెట్టి , నా శరీరాన్ని పలురకాల పూవులతో కప్పండి. తర్వాత ఆ సమాధిని మూసివేయండి. ఆరు నెలల తర్వాత ఆ సమాధిని తెరిచి చూడండి. పంచభూతాలతో నిర్మితమైన ఈ నా శరీరం ఇప్పటివలెనే చెక్కు చెదరకుండా ఉంటే నా యోగ సాధన ఫలించిందని భావించండి. నా శరీరం క్షీణించి పోతే నేను మాయ వేష ధారిణినని,

మోసగత్తెనని తెలుసుకొండి. ఇకమీదట అనవసరంగా నా గురించి దుర్భాషలాడి కాలం వృధా చేసుకోకండి. నా తపః ఫలం, దాని మహిమను ఆనాడు మీరు తెలుసుకోగలుగుతారు." అని వారికి ఆమె చెప్పింది. ఆ తర్వాత ఆ సమాధిని నిర్మించడానికి ఆమె ఒక ముహూర్తం పెట్టింది. ఆమె మోసగత్తె అని రుజువు చేయడానికి మంచి అవకాశం దొరికిందని కొందరు, ఆమె కోర్కెను నెరవేర్చాలని కొందరు భక్తులు కలిసి ఒక సమాధిని నిర్మించారు. ఆమె తాను సమాధిలోనికి వెళ్లే సుముహూర్తాన్ని నిర్ణయించుకొని, భక్తులకు వెల్లడించింది. ఆ సుముహూర్తం దత్తపౌర్ణమి.

నిత్యం ఆ యవధూత మాతకు పూజలు, భక్తులు జరుపుతున్నారు, జపాలు చేస్తున్నారు. దీక్షలు పూనుతున్నారు. ఆమె దర్శనం చేసుకొనాలని దేశం నలుమూలల నుండి దత్త భక్తులు, సాధువులు, సన్యాసులు ఆ మఠానికి చేరుకొంటున్నారు. రుద్రాక్ష, తులసి పూజల మాలలనే కాక నూలు జపమాలలను గూడా ధరించి, దత్తనామ సంకీర్తనలలో పాల్గొంటున్నారు. వారికి దత్తనామ స్మరణ, సంకీర్తన తప్ప వేరొక ధ్యాస లేదు. రోజు రోజుకు ఆమె భక్తుల సంఖ్య వందలు, వేల సంఖ్యలో పెరుగజొచ్చింది. ఈ విషయం తెలిసి అబ్దుల్లా కుతుబ్‌షా వారు సందర్శకులకు వసతి, భోజనాల ఏర్పాట్లు ఘనంగా చేయించారు.

ఆమె మాయాజాలం చూడాలని ఆమె వ్యతిరేకులు గూడా పెద్ద సంఖ్యలో వచ్చారు.

"మాతా! ఎవరితోనూ సంబంధం లేకుండా, ఎవరినీ ఏమీ అర్థించకుండా, ఎవరికీ ఏ హానీ తలపెట్టకుండా మీ మట్టుకు మీరు దత్తనామాన్ని స్మరిస్తూ, సన్మార్గంలో నడవమని ప్రజలకు ప్రబోధిస్తుంటే మీపైన కొందరు కక్షతో ఎందుకు చెడు ప్రచారం చేస్తున్నా"రని ఒకనాడు ప్రేమావతి ఆ మాతను అడిగింది.

"ప్రేమావతీ! ఆకసాన్న ఎగిరే పక్షులు ఏం అపకారం చేస్తున్నాయని కొందరు వాటిని బాణం వేసి చంపుతున్నారు?" అని ఆ మాత అడిగారు.

"బహుశా వారి స్వార్థం కోసం వారలా చేస్తూండవచ్చును."

"అయితే ఈ చెడు ప్రచారంలో గూడ వారి కేదో స్వార్థం ఉండి ఉండవచ్చును. పనిలేక, పొద్దుపోక, ఇతరుల మంచితనాన్ని చూసి ఓర్వలేక, దత్తనామ సంకీర్తనంలోని మహిమను తెలుసుకొనలేక, మూఢులై కొందరు నా గురించి చెడు ప్రచారం చేస్తూండవచ్చును. మనం దానిని పట్టించుకోనవసరం లేదు. వారికి మేలు జరగాలని, వారికి శుభం కలగాలని నేను దత్త ప్రభువుల వారిని ప్రార్థిస్తాను" అంటూ ఆమె చిరుమందహాసంతో సమాధానం చెప్పింది.

ఆనాడు దత్త పూర్ణిమ; అవధూత శ్రీ రాజరాజేశ్వరీ దేవి సమాధిలోకి వెళ్లే సుముహూర్త దినం; అందరూ ఆత్రుతగా ఎదురు చూస్తున్న దినం. మధ్యాహ్నానికి దత్త పూజలు ముగిసాయి. భక్తులు దత్త ప్రసాదం స్వీకరించారు. ఇంతలో సాయంత్రమయింది. అవధూత శ్రీ రాజరాజేశ్వరీ దేవి తెల్లని నూలు వస్త్రాలు ధరించింది. తారామతి ప్రేమావతులు ఆమె శిరోజాలను పైకి దువ్వి శివుని జటాఝూటంలా ముడివేశారు. మల్లెపూవులతో దానిని అలంకరించారు; ఆమె మెడలో మల్లెపూదండలు వేశారు.

భక్తులు వచ్చి, ఆమె నొక ఉన్నతాసనంపైని కూర్చుండ బెట్టి, ఆమెకు పూజ చేయడం మొదలు పెట్టారు. దూరం నుండి వెటకారాలు, వెక్కిరింతలు విన వచ్చాయి. కాని ఈ భక్తుల చెవికి అవి సోకలేదు. వారి పూజలో వారు నిమగ్నులైపోయారు.

అవధూత రాజరాజేశ్వరి నిశ్చలంగా కూర్చుని పూజలందుకొన్నారు. క్రమంగా ఆమె ధ్యాన నిమగ్నులై కళ్లు మూసుకొన్నారు. దత్తనామ సంకీర్తన మిన్ను ముట్టింది. ఆ మాత దీర్ఘ సమాధిలోకి, దివ్య సమాధిలోకి వెళ్లి పోయారు. ఈ లోకంతో సంబంధం లేని సమాధిలోకి వెళ్లిపోయారు. ఆమె కోరిక ప్రకారం, ఆమె కోరిన రీతిని ఆమెను ఆమె భక్తులు సమాధి చేశారు. ఆమె భక్తులు, ఆమె వ్యతిరేకులు కూడా ఆ సమాధి వద్ద రాత్రీ పగలు కాపలా కాశారు.

ఆరు నెలలు ఇట్టే గడిచిపోయాయి. తన సమాధిని తెరవడానికి ఆమె నిర్ణయించిన సుముహూర్తం ఆనాడు. ఆత్రుతతో ఆమె భక్తులు, వ్యతిరేకులు గూడ ఆ సమాధి వద్దకు చేరుకొన్నారు. అందరి సమక్షంలో ఆమె భక్తులు ఆ సమాధిని తెరిచారు. ఆశ్చర్యం! ఆ మాత వదనం ఎప్పటిలాగే ప్రశాంతంగా ఉంది. ప్రసన్నంగా ఉంది. ఆమె శరీరం చెక్కు చెదరలేదు. ఆమె ధరించిన మల్లెపూవులు వాడలేదు. అందరూ ఆమెకు నమస్కరించారు. ఆ సమయంలో ప్రేమావతి అక్కడే ఉంది. ఆమె కూడా ఆ మాతకు నమస్కరించింది.

ఈ వార్త గోల్కొండ పట్నమంతా నిమిషాల మీద పాకింది. తండోపతండాలుగా ప్రజలు అక్కడకు పరుగెత్తుకొని వచ్చారు. ఈ విషయం తెలిసి, రాజభటులు వచ్చి ఆ సమాధిని మళ్లా మూయించి వేశారు. వచ్చిన ప్రజలు ఆ సమాధికే నమస్కరించి వెళ్లిపోయారు.

ఇంటికి వచ్చి ప్రేమావతి మంచం మీద వాలి పోయింది; ఆ మాతనే ధ్యానిస్తూ పడుకొంది. ఆ మాత ముఖ వర్చస్సు, దివ్య తేజస్సు ప్రేమావతి కళ్లను వీడిపోలేదు. ఆమె మనస్సులో ఆ పవిత్రమూర్తి నిలిచిపోయింది.

"ఈ శరీరం అశాశ్వతమైంది. ఎప్పుడో ఒకప్పుడు ఇది పంచభూతాలలో కలిసిపోతుంది. ఒక సిద్ధాంతాన్ని విశ్వసించి, చేసే తపస్సే అత్యంత ఉత్తమమైంది" అని ఆమె భావించింది. ఆనాటి నుండి ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది. ప్రతి రోజూ ఉదయాన్నే ఆ మాత సమాధి వద్దకు వెళ్ళి, రెండు పూవులు దానిపైని భక్తితో ఉంచి రావడం మొదలు పెట్టింది.

ఆత్మా - పరమాత్మ

"ఈ మేను జీవునకు ఎంత ప్రియమాయెనో

భామరో నాస్వామి కౌగిటలేని" ॥ఈమేను॥

నా ప్రాణసఖుని నెడబాసి, ఒంటరిగ ఈ తాపమెటుల సైతు

ఎన్నడు నా స్వామిని జూచెనో, ఎన్నడు వానిలో ఎగసి

సుఖము నుభవించెనో" ॥ఈమేను॥

నిండు పున్నమి వెన్నెలలో, అమ్మవారి ఆలయంలోని పాలరాతి తిన్నెపైని కూర్చుని ఈ పదాన్ని తారామతి పాడుతూంటే ప్రేమావతి అభినయిస్తూంది. ఆమెకు కొలది దూరంలో అబ్దుల్లా కుతుబ్‌షా పండిత పరివారంతో కూర్చుని ఆమె అభినయాన్ని తిలకిస్తున్నారు. విరయబూచిన పొగడ వృక్షం కుప్పలు కుప్పలుగా పూవులను వారిపైని రాలుస్తూంది. ఆ పొగడ పూవులు సువాసనలను వెదచల్లుతున్నాయి. ఆ మనోహర వాతావరణంలో ప్రేమావతి ప్రదర్శిస్తున్న ఆ ఉన్నతాభినయాన్ని వారంతా కనులార్చకుండా వీక్షిస్తున్నారు. ఏదో పోగొట్టుకొన్నట్లు, దానిని వెతుకుతున్నట్లు, ఏదో తనని వీడిపోయినట్లు, తాను వంటరి అయినట్లు, ఏమి తోచక తత్తర పడుతున్నట్లు ఆమె అభినయిస్తున్నట్లు పాదుషా వారికి తోచింది. ఆమె ఇలా అభినయించడం ఇదివరకెన్నడు వారు చూడలేదు.

చల్లని చంద్రకిరణాలు వారిని బాణాలలాగ తీక్షణంగా బాధిస్తున్నట్టు వారికి కనిపించింది. ఇదే అనుభూతిని అక్కడున్న ఇతరులు కూడా పొందారు. వారి హృదయాలు చేష్ట లుడిగి ఉండిపోయాయి. ఇంతలో తారామతి పాట ఆగిపోయింది. ప్రేమావతి అభినయం ముగిసింది. అంతటా నిశ్శబ్దం ఆవరించింది. ఎవరి స్థానాలలో వారు కదలకుండా ఉండిపోయారు. ఇంతలో మెల్లగా అడుగులు వేసుకొంటూ ఒక సూఫీ ప్రేమావతి వద్దకు వెళ్లి, ఒక్క క్షణం ఆమెను తదేకంగా చూసి "బిడ్డా! నీ కోర్కె త్వరలో సిద్ధిస్తుంది!" అని ఆమెను ఆశీర్వదించి, మరి ఎవ్వరినీ చూడకుండా మెల్లగా అడుగులు వేసికొంటూ వెళ్లిపోయాడు.

అమావాస్య - ఆఖరి సందర్శనం

ఆనాడు మహాలయ అమావాస్య, పితృదేవతల సంస్మరణ దినం, హిందువులకు అతి పవిత్రమైన దినం. పితృదేవతలకు తర్పణాలు అర్పించే దినం. పితృ దేవతల యెడల తమ కున్న భక్తిని వెల్లడించే దినం. మహమ్మదీయులకు మొహరం ఎంత పవిత్రమైన పుణ్యదినమో హిందువులకు అంత పవిత్రమైన పుణ్యదినం ఈ మహాలయ అమావాస్య. ఈ బాహ్య భౌతిక దేహాలను విడిచిపెట్టి, అనంత విశ్వంలో కలిసిపోయి, పితృ లోకానికి వెళ్లిపోయిన వారి ఆత్మలను తరింపజేసి, వారికి మోక్షాన్ని ప్రసాదించమని, వారి ఆత్మలకు శాంతిని చేకూర్చమని పరమేశ్వరుని ప్రార్థించే పుణ్యదిన మిది.

ఇన్నాళ్లూ వారినందరిని విడిచి వెళ్లి, ఎక్కడో దైవ చింతనలో గడిపి, ఆనాటి ఉదయాన్నే తన పాద ధూళితో వారి గృహాన్ని పవిత్ర మొనరించినందుకు సిద్ధేశ్వరీ దేవి తన భర్త పాదాలను తన ఆనందాశ్రువులతో అభిషేకించింది. తలవని తలంపుగా తమ తండ్రిని దర్శించే భాగ్యం కలిగినందుకు తారామతి ప్రేమావతులు నోటమాట రాక తమ తలితండ్రులను తదేకంగా చూస్తూండిపోయారు. తమ జీవితాలు ధన్యమైనాయని వారు మురిసిపోయారు. ఆ తర్వాత వారు స్పృహలోకి వచ్చి, ఒక చోట చేరువుగా నున్న తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. తన పుత్రికలు వృద్ధిలోకి వచ్చారని తెలుసుకొని ఆయన ఆనందభాష్పాలు రాల్చాడు. ఆ యశ్రువులు ఆ సోదరులు ఇద్దరి శిరస్సులపైని ఆయన దీవెనలుగా రాలాయి. తర్వాత ఆయనకు పాలు పండ్లు వారు సమర్పించుకొన్నారు. అయితే ఆ యానంద ఘడియలు అట్టే సేపు లేవు. ఆయన వెంటనే ధ్యాన నిమగ్నుడై "ఈ జన్మ మిక దుర్లభమురా నరుడా! సహజన్మ సహకార సద్గురుని గనరా!" అంటూ ఒక తత్వాన్ని ఆలపించసాగాడు. వెంటనే తారామతి తన తంబూరాను మీటుతూ, వంత పాడడం ప్రారంభించింది. ఆ పాటకు అనుగుణంగా ప్రేమావతి అభినయించడం మొదలు పెట్టింది. తన అశ్రునయనాలతో ఆ తత్వాన్ని వింటూ, ఆ యభినయాన్ని సిద్ధేశ్వరీ సుగుణమతి చూస్తూ నిలబడి పోయింది. ఆయన పాట నిలుపు చేశాడు. తంబూరా నాదం నిలిచి పోయింది. అభినయం ఆగిపోయింది.

"శీతలా దేవి వరప్రసాదులారా! ఇంక నాకు సెలవు. నే నా తల్లి సేవలో తరించడానికి వెళ్తున్నాను" అంటూ ఆయన లేచి వీధి గుమ్మంవైపు వెళ్లాడు. ఆ తల్లీ కూతుళ్లు ముగ్గురు నిశ్చేష్టులయ్యారు. ఆయనను వారించడానికి వారి నోట మాట రాలేదు. అప్రయత్నంగా వారి చేతులు మోదికి లేచాయి. ఆయనకు వారు నమస్కరించారు. ముగ్గురి కళ్లు నిండు నీళ్ల కుండ లయ్యాయి. ఆయన వీధి తలుపు తీసికొని, వీధిలోకి వెళ్లాడు. తర్వాత కనుమరుగయ్యాడు. వీరు ముగ్గురు కాస్సేపు ఆయన వెళ్లిన వైపే చూస్తూ నిల్చుండి పోయారు. తర్వాత ఇంట్లోకి వచ్చి, వీధి తలుపు వేసి, ఆయన్నే తలుచుకొంటూ ఉండిపోయారు. తారామతి ప్రేమావతుల మనస్సులలో వివరించడానికి వీలులేని ఒక అనుభూతిని వారి తండ్రి రాక కలిగించింది.

తన గత జీవితాన్ని మననం చేసుకొంటూ ఆ రాత్రి సిద్ధేశ్వరీ దేవి పూజా మందిరంలో నిద్రలోకి జారి పోయింది. దేవతా విగ్రహాల వద్ద వెలుగుతున్న ప్రమిదలలోని వత్తులను సరిచేసి, నూనె వేసి, తారామతి ప్రేమావతులు నృత్యమందిరానికి వెళ్లడానికి సిద్ధమయ్యారు.

ఆ యర్ధరాత్రి సమయంలో వారు కస్తూరి, పునుగు జవ్వాదులతో తయారు చేసిన లేపనాన్ని వారి శరీరాలకు అలుముకొని, సన్నని నీలిరంగు వలువలు ధరించి, మేలి ముసుగులు వేసుకొని ఇంటి నుండి బయలు దేరారు. తారామతి తన తంబూరాని చేత ధరించింది. ప్రేమావతి ఒక ప్రమిద దీపాన్ని పట్టుకొని ముందు నడిచింది. అలవాటైన ఆ దారిని వెళ్లడానికి ఆ అర్ధరాత్రి చీకటి వారిని ఆటంకపరచలేదు. వారిద్దరూ ప్రేమావతి నృత్యమందిరాన్ని చేరుకొన్నారు. అక్క డంతా చీకటిగా ఉంది. అక్కడ గూళ్లో నున్న ప్రమిదలను ఒక్కొక్కటిగా వారు వెలిగించారు. ఆ దీపకాంతులలో వా రిద్దరు దేవకన్యల్లా మెరిసిపోయారు. నాట్యరంగం మధ్య వారిద్దరూ ఆశీనులయ్యారు. తారామతి తన తంబూరాను మెల్లగా మీటుతూ సారంగ కేదార రాగాలలో ఒక పదాన్ని పాడ నారంభించింది. ఆ పదంలోని భావానికి తగినట్టుగా ప్రేమావతి అభినయించడం ప్రారంభించింది. ఆ గానం, ఆ యభినయం వారిద్దరికే పరిమితమైన సమయ మది. అందుకే వా రక్కడకు ఆ సమయంలో వెళ్లారు.

అదొక అద్భుతమైన పదం. ఆత్మ పరమాత్మలు వేరు వేరైనా వైనా, వాటిని సూక్ష్మదృష్టితో పరికిస్తే, అవి పరస్పరం ఒకదానిపైని ఒకటి ప్రభావితమై ఉన్నాయని తెలుస్తుంది. ఈ భావాన్ని క్షేత్రయ్య ఆపదంలో పొందుపరచి, శృంగార పరంగా వర్ణించి రచించాడు. “గోపాలా! నీ నా భేదాలు ఈ భౌతిక శరీరాలకే గాని ఆత్మలకు లేవు. ఆత్మలు ఒక్కటై నప్పుడు అనుభూతులు ఒక్కటే గదా? తిలకించు! నిన్న రాత్రి నీవు వినోదాలతో కాలం గడిపావు. నిద్రలేక నీ కన్నులు ఎర్రబడ్డాయి. అది సహజమే, కాని నా నేత్రాలు గూడా ఎర్రబడ్డాయి. నీకు అగరు చందనాలను ఎవతె అలమిందో కాని ఆ సువాసనలు నన్ను తాకుతున్నాయి. ని న్నెవ్వతో విలాసంగా గిల్లింది. నా బుగ్గ ఎర్రబడి ఉబ్బింది. మా ఇద్దరి తనువులు ఒక్కటైనందుకు నా ఆత్మ ఉల్లాసంతో ఉప్పొంగింది” అంటూ క్షేత్రయ్య వర్ణించాడు.

తారామతి వీనుల విందుగా గానం చేస్తూంటే , ప్రేమావతి కనుల పండువుగా వివిధ భావాలను అభినయిస్తూంది. భావానుగుణమైన ఆ గానం కోటలో హంసతూలికా తల్పంపైని నిదురిస్తున్న అబ్దుల్లా కుతుబ్ షాను మేల్కొలిపింది. ఆ పాట ఎవరిదో ఆయనకు తెలుసు. అందువల్ల ఆయన దిగ్గున లేచి దుస్తులను సవరించుకొని, ఆ గానం వినిపిస్తున్న దిశగా వెళ్లి ప్రేమావతి నృత్య మందిరాన్ని చేరుకొన్నాడు.

ఆ నృత్య మందిరంలోని ప్రమిద దీపాలు ఒక్కొక్కటీ ఆరిపోతున్నాయి. క్రమంగా ఆ మందిరమంతా చీకటి అలుముకొంది. ఆ చీకటిలో తారామతి, ప్రేమావతుల మేనులపై నున్న నీలాలు ప్రకాశిస్తూ వెలుగునిచ్చాయి.

పాదుషావారు నృత్య మందిరంలోనికి ప్రవేశించారు, పాదరక్షలను దూరంగా విడిచి, మెల్లగా, నిశ్శబ్దంగా వచ్చి ప్రేమావతికి ఎదురుగా ఆశీనులయ్యారు. ఆమెను తదేకంగా చూశారు. అలా ఆమె నేత్రాలలోకి చూస్తూ ఆయన ఉండిపోయారు. ఆ తర్వాత ఆయన అనాలోచితంగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొన్నారు. అప్పుడామె పాదుషావారి వైపు చూసింది. ఒకర్ని ఒకరు కనులార్పకుండా చూస్తూండిపోయారు. తారామతి వీరిద్దర్ని గమనించకుండా, తన గానాన్ని ఆపకుండా, గానామృతాన్ని అలా కురిపిస్తూనే ఉంది.

ప్రేమావతి, పాదుషాల తనువుల ఒక్కటై – తనువులను వీడి వారి మనస్సులను ఒక్కటై – మనస్సులను వీడి ఆత్మలు ఒక్కటైన అనుభూతిని వారిరువురు పొందారు.

తూర్పున వేగు చుక్క వెలిసింది. దూరాన్న తొలికోడి కూసింది. తూర్పు దిక్కు తెల్లవారుతూంది. తారామతి తన గానాన్ని ఆపి, కళ్లు తెరిచింది. ఎదురుగా ప్రేమావతీ, పాదుషా వారూ ఆమెకు శిలా మూర్తుల్లా గోచరించారు. వారిద్దరూ ఒకర్ని ఒకరు తదేకంగా చూసుకొంటున్నారు. ఒకరి దృష్టిలో వేరొకరి దృష్టి చేరి ఉంది.

"ఇదే జీవిత సత్యం, పరమ సత్యం, పరాకాష్ఠ" అని అనుకొంది తారామతి.

అబ్దుల్లా పాదుషా

కాలచక్రం గిర్రున తిరుగుతూనే ఉంటుంది. దానిని ఎవరూ ఆపలేరు. గతించిన కాలం తిరిగి రాదు. భావి కాలం ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. కాల ధర్మాన్ననుసరించి "మా సాహెబా" గతించారు. మరి కొంత కాలానికి ప్రేమావతి నృత్య సరస్వతి పాదాల చెంతకు చేరుకొంది. ఆమె నృత్య మందిరంలో మంజీరాల మృదు మధుర నాదం మూగబోయింది. రాజ మహల్లో క్రుంగి పోయిన మనస్సుతో అబ్దుల్లా కుతుబ్‌షా జీవితాన్ని గడుపుతున్నారు.

ఆయన పాదుషా కనుక రాచకార్యాలు నిర్వహించక తప్పడం లేదు. అవి నిత్య పరిపాటిగా జరిగిపోతున్నాయి. ఆయన ఏకాంతంగా ఉన్నప్పుడు ఆయన ముఖంలో విషాద ఛాయలు అలుము కొంటున్నాయి. దుఃఖాశ్రువులతో ఆయన నేత్రాలు నిండిపోతున్నాయి. ఆయన హృదయం ఆవేదనా భరితమవుతూంది. ఆయన జీవితంలో తీరని లోటు ఏర్పడింది. తీరిక సమయాలలో తన మహల్ పై అంతస్తులోని గవాక్షం వద్ద నిలబడి, ప్రేమావతి నృత్య మందిరాన్ని తదేకంగా చూస్తూ, గంటల తరబడి ఆయన కాలం గడుపుతున్నారు. ఆయన మనో నేత్రాలలో ఏవేవో సుందర నాట్య దృశ్యాలు మెదలుతూ ఉన్నాయి. ఆ మందిరం నిండా ఆయనకు మువ్వల సవ్వడి వినవస్తూనే ఉంది.

అదంతా ఆయన భ్రమ. ఆయనకు అదొక సుందర స్వప్నం. ఆ కల కరిగిపోగానే ఆయనకు అంతా చీకటిగా గోచరిస్తూంది. ఆయన చమర్చిన కనులతో ప్రేమావతి నృత్యమందిరాన్ని చూస్తూ "ప్రేమావతీ! నీవు స్వర్గంలో స్వర్ణ కమలానివి!" అనుకొంటూ ఉండేవారు.

ఇలా గంటలు దినాలుగా, దినాలు వారాలుగా, వారాలు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా గడచిపోసాగాయి. ప్రేమావతిని తలచుకొంటూ ఆయన ఒకనాడు ఉద్యానవనంలో విహరిస్తూ ఉండగా ఒక గులాబి పూవు ఆయన్ని ఆకర్షించింది. ఆ పూవులోకి ఆయన తదేకంగా చూశారు. అందులో ప్రేమావతి ముఖం ఆయనకు గోచరించింది. ఆయన వెంటనే ఆ పూవును కోసి, కళ్ళకు అద్దుకొని, హృదయానికి హత్తుకొన్నారు; "ప్రేమావతీ! నీవు స్వర్గంలో స్వర్ణకుసుమానివి" అని అనుకొన్నారు.

"అక్కా! మనం జంటగా జన్మించాం"; జంటగా కలిసి జీవిస్తున్నాం; మనం జంటగానే చనిపోదాం" అన్న తన చెల్లెలు ప్రేమావతి తనను వీడి ముందుగానే వెళ్లిపోయినందుకు తారామతి దుఃఖించని ఘడియ లేదు. కవలల్లో ఒకరు మరణిస్తే రెండవ వారు కూడా మరణిస్తారని ఆమె వింది, కాని అలా జరగలేదు. "నాకు మరణం ఎందుకు రాలేదు? ప్రేమావతితో గూడ నేనెందుకు చనిపోలేదు? ప్రేమమూర్తి, ఆదర్శవంతుడైన పాదుషా వారి ఋణం తీర్చుకొనడానికే నన్ను మృత్యువు ఆహ్వానించలేదు కాబోలు!" అని తారామతి భావిస్తూ వచ్చింది.

పాదుషా వారి మనోవేదనను రాణి వాసం వారు, రాజ దర్బారు లోని వారు గమనించినా గమనించక పోయినా తారామతి గమనిస్తూనే ఉంది. ఆమె హృదయ తంత్రులు విషాద గీతాలను ఆలపిస్తూనే ఉన్నాయి.

తన అమృత గానంతో పాదుషా వారిని మళ్లా ఒక మనిషిగా చేయాలని ఆమె నిశ్చయించుకొని, భారతీయ సంగీతంలోని ప్రతి రాగాన్ని కమ్మగా ఆలపిస్తూ తమ ప్రభువుల వారిని ఆనందింప జేయాలని ప్రయత్నిస్తూనే ఉంది.

వీలయినప్పుడల్లా తారామతి తన మందిరంలోని మిద్దెపైన నిల్చుని, పాదుషా వారి కోట వైపు చూస్తూ "ప్రభూ! మీ హృదయం అంధకార బంధురం కాకూడదు. మా హృదయాల నెరిగి, మా ఆదర్శాలకు విలువ నిచ్చి, మా కోర్కెలను మన్నించి మాకు మీ హృదయంలో ఒక ప్రత్యేక స్థానా న్నిచ్చారు. మీ ఋణం నేను తీర్చుకొంటాను. అందుకే, నా చెల్లెలు మనల్ని వీడి పోయినా నేను జీవించి ఉన్నాను. మీరు ఏ పాట పాడమంటే అది పాడతాను. మీరు ఏ రాగం ఆలపించమంటే ఆ రాగమే ఆలపిస్తాను. రంభలా నర్తన మాడమంటే అలా నర్తన మాడతాను, పాడతాను. సుతి మెత్తని గులాబి సువాసన లాగా పాడతాను. ప్రభూ! మీరు బాధని మరచి పొండి. మళ్ళీ మామూలు మనిషి కండి. మీ చిరునవ్వును మీ ముఖంలో చూడాలని ఉంది. పూర్వంలా నా గానం ఇప్పుడు లేదా ప్రభూ! పూర్వం నా గానాన్ని మెచ్చుకొనేవారే! ఇప్పుడు నా గానాన్ని మెచ్చుకోరా! చూడండి, మీరు నా గానాన్ని మెచ్చుకొనేటట్టు చేస్తాను" అంటూ ఆమె తంబూరా శ్రుతి చేసింది.

ఆనాడు పౌర్ణమి. నిండు చంద్రుడు పండు వెన్నెల కాస్తున్నాడు. తన మందిరం నుండి పాదుషా వారి కోట వైపు చూస్తూ తారామతి కొంత సేపు నిలబడింది. ఎలాగైనా పాదుషా వారి మనస్సుకు ఊరట గలిగించాలని ఆమె నిశ్చయించుకొంది. తన రాచరికపు దుస్తులను విడిచి, మల్లెపువ్వులాంటి తెల్లని దుస్తులు ధరించింది. దేవ కన్యలా ముస్తాబై తన మందిరంలో కూర్చుని, తంబూరా మీటుతూ గంధర్వ కన్యలా కొంతసేపు గానామృతాన్ని కురిపించింది. కాని పాదుషా వారు చలించినట్టు ఆమెకు గోచరించలేదు.

చంద్రుడు నడినెత్తి మీదకు వచ్చాడు. తన చల్లని కిరణాలను వెదచల్లుతున్నాడు. తారామతి తన తంబూరాను చేతపుచ్చుకొని తన మందిరం నుండి బయలు దేరింది. తిన్నగా ప్రేమావతి నృత్య మందిరానికి వెళ్ళింది. ప్రేమావతి నర్తన మాడిన వేదిక పైని కూర్చుంది. గత పదేళ్లు తన హృదయంలో దాచుకొన్న ఆవేదనను తన చెల్లెలుతో చెప్పుకొనా లనుకొంది. తంబూరా మీటుతూ గానం చేయసాగింది.

ఆ రాత్రి పాదుషా వారికి నిదుర రాలేదు. ప్రేమావతినే తలచుకొంటూ, తన మందిరంలో ఒంటరిగా తన తల్పంపైని కూర్చుని ఆలోచిస్తున్నారు. ఆ యాలోచనలతో ఆవేదనతో వారి హృదయం బరువెక్కింది. ఒంటరిగా బయలు దేరి ప్రేమావతి సమాధి వద్దకు ఆయన వెళ్లారు. తమ భుజం పైని ఉన్న పట్టు శాలువాను తీసి, సమాధిపై నున్న నల్లరాయి పైని ఆయన కప్పారు. ఒక పర్షియా గులాబి పుష్పాన్ని ఆ సమాధి పైని ఆయ నుంచారు. ఆ సమాధిపైని ఆయన చెక్కించిన "బూద్ అజ్ అజల్ కుల్ జన్ తీ ప్రేమ మతి" (స్వర్గధామంలో స్వర్ణకమలం. క్రీ.శ. 1662) అన్న పదాలను ఒక్కసారి వల్లించారు. ఆ ప్రక్కనే తారామతి కోసం కట్టించిన సమాధిని ఒకసారి ఆయన చూశారు. ఆ తర్వాత తన కోసం నిర్మించుకొన్న సమాధి వద్దకు వెళ్ళి, దానిని ఒక్క క్షణం చూశారు. "తన సమాధి, తారామతి సమాధి ఖాళీగా ఉన్నాయి" అని మనసులో ఆయన అనుకొన్నారు. "తనను దుఃఖసాగరంలో ముంచి, ప్రేమావతి సుఖంగా తన

సమాధిలో ఎలా నిద్రబోగలుగుతూంది? తనను విడిచి ఆమె ఎలా వెళ్ళగలిగింది?" అని ఆలోచించారు. సమాధానం దొరకలేదు. మరక్కడ ఉండలేక త్వరగా తమ మందిరానికి వెళ్లిపోయారు. నిద్రపోవాలని చాలాసేపు ఆయన ప్రయత్నించారు. కనులు మూసుకొంటే ప్రేమావతే ప్రత్యక్షమౌతూంది. అందువల్ల మరి నిద్ర పోలేకపోయారు. మళ్లా లేచి కూర్చున్నారు. మంచం మించి లేచి, ప్రేమావతిని తలుచుకొంటూ ఆయన పచారులు చేయసాగారు. అలా పచారులు చేస్తుండగా, ఆ నిశ్శబ్ద వాతావరణంలో కలత చెందిన తన హృదయ ఆవేదనను తీర్చేటట్టుగా దూరం నుండి మృదుమధురమైన తారామతి గానం ఆయన చెవికి సోకింది. ఆయన పరవశులయ్యారు.

తమ గుప్పిటలో ఒక పర్షియా గులాబి పూవును పట్టకొని, ఆ గానం వినిపిస్తున్న దిశగా వెళ్ళారు.

చప్పుడు చేయకుండా, మెల్లగా అడుగులు వేసుకొంటూ, ప్రేమావతి నాట్యమందిరాన్ని ఆయన చేరుకొన్నారు.

తారామతి కన్నీరు మున్నీరుగా ప్రవహిస్తూనే వుంది. ఆమె గానం అమృత వాహినిలా సాగిపోతూనే ఉంది. ఆ కొండ చరియల్లో ఆమె గానం ప్రతిధ్వనిస్తూనే ఉంది.

మరుగున ఉండి, ఆవేదనాభరితమైన గానాన్ని వింటున్న పాదుషా వారు మరక్కడ నిలువలేక పోయారు. ప్రేమావతి నృత్యవేదికకు చేరువగా ఆయన వెళ్లారు. తారామతికి కొద్దిదూరంలో నిలబడి ఆమె గానాన్ని వింటూ నిశ్చేష్టులై ఆయన నిల్చున్నారు.

పాదుషా వారికి ఆమె హృదయావేదన అర్థమయింది.

తపిస్తున్న హృదయంతో, తన్ను తాను మరిచి, తారామతి అలా గానం చేస్తూనే ఉంది. ఆ గాన ప్రవాహం పాదుషాని, గాలిని, నేలని, సమస్త ప్రకృతిని ముంచెత్తింది.

ఆ గాన ఝరిలో ప్రేమావతి మువ్వల సవ్వడి మృదువుగా మధురంగా అబ్దుల్లా కుతుబ్‌షా చెవికి సోకింది. పాదుషాకు తారామతి హృదయ ఆవేదన అర్థమయింది.

ఆయన తారామతి చెంతకు వెళ్లి 'తారామతీ! మీరిద్దరు ఆంధ్రదేశ మున్నంతవరకు "లక్ష్మీసరస్వతుల్లాగ" "తారామతీ – ప్రేమావతులు"గా ఈ కళా ప్రపంచంలో చిరంజీవులై నిలిచిపోతారు. నీపేరే ముందుంటుంది' అంటూ ఆమెను ఓదార్చి, చేతిలోని గులాబీ రేకులను అబ్దుల్లా ఆ నృత్య వేదికపై నుంచారు.

"ప్రభూ! మేం ధన్యులం! మీ ఆశీర్వాదానికి మేం సర్వదా కృతజ్ఞులం...." అంటూ, చిననాటి నుండి తాను ఆరాధిస్తూ వచ్చిన తన తంబూరా పైని తారామతి వాలిపోయింది.

– 0 –

"స్వామీ! గోలకొండకు మరల ప్రసాదించు

అలనాటి సాంస్కృతిక స్వర్ణయుగము"

గోలకొండ పాదుషా అబ్దుల్లా కుతుబ్‌షా

జననము	:	21-11-1614
సింహాసనమధిష్టించిన దినము	:	01-02-1626
మరణం	:	21-04-1672
తల్లి	:	హయాత్ బక్షీ బేగం
తండ్రి	:	సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా
తాతగారు	:	భాగ్యనగరం నిర్మాత కులీకుతుబ్‌షా

అబ్దుల్లా కుతుబ్‌షా ఆస్థానంలో నుండిన కళాతపస్వినులు

తారామతి	:	సంగీత సరస్వతి
ప్రేమావతి	:	నర్తనవాణి మరణము - 1662 A.D. (స్వర్గంలో స్వర్ణకమలం) వీరియిరువురి సమాధులు ఆ పాదుషా తన సమాధి వద్ద నిర్మించారు.

వీరి పేర వెలసిన గ్రామాలు

తారామతి పేట : హయాత్‌నగరం వద్ద ప్రేమావతి పేట : శివరాంపల్లి వద్ద

పద్మశ్రీ నటరాజ రామకృష్ణ

జననం - బలిద్వీపం	:	21-3-1933
'నటరాజ' బిరుదు - 18వ సంవత్సరం బందార సంస్థానాధీశునిచే ప్రదానం		
భరతకళాప్రపూర్ణ - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ	:	1968
భరత కళా సవ్యసాచి - పశ్చిమగోదావరి జిల్లా కళాకారులచే	:	1979
కళాప్రపూర్ణ (డాక్టర్) ఆంధ్ర యూనివర్సిటీ	:	1981
కళా సరస్వతి - కళా వేదిక - హైదరాబాదు	:	1982
ఉత్తమ దక్షిణ భారత నాట్యాచార్య	:	1984 (ఢిల్లీ సంగీత నాటక అకాడమీ)
ఉత్తమ పరిశోధక ఆచార్య	:	ఎల్.వి.ఆర్. ట్రస్టు - మదరాసు 1986
ఆస్థాన నాట్యాచార్య - శ్రీశైలం దేవస్థానం	:	1980
ఆంధ్ర ప్రదేశ్ ఆస్థాన నాట్యాచార్య శ్రీశ్రీ ఆనం లక్ష్మణరావు ద్వారా	:	1980
దేశ చరిత్రలో అపూర్వ సన్మానం - బంగారు కిరీటము	:	1985
రాజలక్ష్మి అవార్డు	:	1991
ప్రముఖ నాట్యాచార్య - లిమ్‌కా అవార్డు	:	1994
రాజీవ్‌గాంధీ అవార్డు	:	1995
హైదరాబాదు యూనివర్శిటీ ప్రొఫెసరు (డాన్సు)	:	1994

నటరాజ రామకృష్ణ ఇతర రచనలు

1. నృత్యాంజలి
2. నృత్యరేఖ
3. నృత్యకళ
4. నృత్య మంజరి
5. నృత్యజ్యోతి
6. నర్తన వాణి
7. నాట్యరాణి
8. నర్తన బాల
9. నర్తన భూమి
10. నర్తన సీమ
11. నర్తన కథ
12. నాట్య సుందరి
13. నర్తన శోభ
14. Dancing Bells ఇంగ్లీషు
15. పేరిణి శివతాండవం
16. రుద్ర గణిక
17. పసిడి మువ్వలు - పారాణి
18. లకుమ
19. రదనిక
20. నర్తన మురళి
21. తూ॥ గో॥ జిల్లాలో నృత్య కళ
22. ప॥ గో॥ జిల్లాలో నృత్య కళ
23. దాక్షిణాత్యుల నృత్యకళ చరిత్ర
24. నవజనార్దనం
25. ఆంధ్రుల నాట్యకళ
26. దేవ నర్తకి - ఆలయ నృత్యాలు
27. ఇంకో అమ్మ కథ
28. అర్ధ శతాబ్ది - ఆంధ్ర నాట్యం (మొదటి భాగం)
29. ఆలయాలు - నృత్యపూజ
30. ప్రేమావతి

భారత ప్రభుత్వము బహుమతి పొందిన గ్రంథాలు

నర్తన బాల
నర్తన సీమ
నర్తన భూమి
నర్తన కళ
Dancing Bells

మదరాసు ప్రభుత్వ బహుమతి పొందిన గ్రంథం

దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర

1. ఆంధ్ర నాట్యం -
2. ఆంధ్ర నాట్యం - ఆలయాలు
3. ఆంధ్ర నాట్యం - ఆలయ నృత్యాలు
4. ఆంధ్ర నాట్యం - ఆస్థాన నర్తనం
5. ఆంధ్ర నాట్యం - అభినయము
6. ఆంధ్ర నాట్యం - అమర నర్తకులు
7. ఆంధ్ర నాట్యం - పేరిణి - కూచిపూడి
8. ఆంధ్ర నాట్యం - జానపద గిరిజన నర్తనాలు
9. ఆం[illegible] నాట్యం - నవజనార్దన పారిజాతం

1945 - ఆంధ్ర నాట్యం - నా కళా జీవితం
అర్ధ శతాబ్ది - ఆంధ్ర నాట్యం (రెండవ భాగం)

దొరుకు చోట్లు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
4-1-435, బ్యాంకు స్ట్రీట్,
హైదరాబాదు - 1
Phone : 595671

నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యం ట్రస్టు
1-1-230/2/7, చిక్కడపల్లి
హైదరాబాదు - 20
Phone : 27607508

డా॥ నటరాజ రామకృష్ణ

ఈ విశాల విశ్వంలో మరే మహారాజు, పాదుషా యివ్వని గౌరవం తన ఆస్థానంలో యిరువురు కళామూర్తుల కిచ్చి తన సమాధి ప్రక్కనే వారికి సమాధులు నిర్మింపచేసి, మానవ మతమే లోకంలో మహామతమని నిరూపించిన మానవతామూర్తి గోలకొండ పాదుషా అబ్దుల్లా కుతుబ్‌షా (1614-1672)



700 సంవత్సరాల తరువాత కాకతీయుల నాటి పేరిణి శివ తాండవాన్ని పునఃసృష్టించి, ఆంధ్రుల లాస్య నాట్యాన్ని పునరుద్ధరించి వాటికి అమరత్వం చేకూర్చిన పరిశోధకులు కళాతపస్వి డాక్టర్ నటరాజ రామకృష్ణ.